www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 219 | మంగళవారం | 29 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కొలువులు కొల్లలు

3689 బిసి గురుకుల పోస్టులు మంజూరు



గురుకులాల్లో...

ప్రిన్సిపాల్	119
జూనియర్ లెక్చరర్	833
పిజి టీచర్	833
ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్	1071
ఫిజికల్ డైరెక్టర్	119
పిఇటి	119
లైబ్రేరియన్	119
క్రాఫ్ట్, ఆర్ట్ ఇన్‌స్ట్రక్టర్	119
స్టాఫ్ నర్స్	119
సీనియర్ అసిస్టెంట్	119
జూనియర్ అసిస్టెంట్	119
అవుట్‌సోర్సింగ్‌లో	595

మన తెలంగాణ/హైదరాబాద్

బిసి గురుకుల పాఠశాలలకు ప్రభుత్వం 3689 పోస్టులు మంజూరు చేసింది. వీటికి తోడు జ్యోతిబా ఫూలే సంక్షేమ గురుకుల సొసైటీ కార్యాలయానికి 28 పోస్టులు, అవుట్‌సోర్సింగ్‌లో మరో 10 పోస్టులు, గురుకులాల్లో 595 అవుట్‌సోర్సింగ్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం 119 కొత్త బిసి సంక్షేమ గురుకులాలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ గురుకులాలన్నీ మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో పనిచేస్తాయి. కొత్త గురుకులాల అవసరాలన్నీ తీరేలా పోస్టులు మంజూరు చేశారు. మంజూరైన పోస్టులన్నీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే వర్తిస్తాయని, ఇందుకు అనుగుణంగా బిసి సంక్షేమ శాఖ చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

జ్యోతిబా ఫూలే గురుకుల సొసైటీ ప్రధాన కార్యాలయంలో....	
డిప్యూటీ సెక్రెటరీ	1
అసిస్టెంట్ సెక్రెటరీ	2
రీజనల్ కోఆర్డినేటర్	10
సూపరింటెండెంట్	2
సీనియర్ అసిస్టెంట్	8
జూనియర్ అసిస్టెంట్	5
అవుట్‌సోర్సింగ్‌లో	10

2000 ఖాళీల భర్తీకి రంగం సిద్ధం



మన తెలంగాణ/హైదరాబాద్

కొత్త జోనల్ విధానం ప్రకారం ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే తమ వద్ద ఉన్న ప్రతిపాదనలను ప్రభుత్వ శాఖలకు తిప్పి పంపించి, కొత్త జోనల్ పద్ధతి ప్రకారం తరువాయి 6లో



ఎస్ఐ నియామకాలకు లైన్ క్లియర్

ఒక ప్రశ్నకు రెండు జవాబులు రాసినా తప్పుకాదని హైకోర్టు స్పష్టీకరణ, స్టే ఎత్తివేత

మన తెలంగాణ/హైదరాబాద్

సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టుల భర్తీకి ఉన్న న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. గతంలో సింగిల్ జడ్జి ఆదేశాలపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచ్ స్టే ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్సై పోస్టుల భర్తీ తరువాయి 6లో



హెచ్ఎండిఎ నుంచి జనార్ధనరెడ్డి బదిలీ

విదేశాల్లో ఉండగానే ఉత్తర్వులు జారీ, జిఎడికి రిపోర్టు చేయాలని ఆదేశాలు

మన తెలంగాణ, సిటీబ్యూరో

హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ డా.బి. జనార్దన్‌రెడిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జనార్దన్‌రెడ్డిని హెచ్ఎండిఎ నుంచి బదిలీ చేస్తూ ఆయనను నేరుగా సాధారణ పరిపాలన విభాగంలో తరువాయి 6లో

సిరీస్ భారత్ కైవసం



న్యూజిలాండ్‌తో వన్‌డే సిరీస్‌ను టీమిండియా సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన మూడో వన్‌డేలో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది.

స్పోర్ట్స్ పేజీలో...

అడవంటే హడల్

మరింత కఠినంగా అటవీ చట్టాలు

- అడవిలోకి వెళ్లాలంటేనే భయపడేలా మార్పులు
- అవసరమైతే ఇంటెలిజెన్స్‌కు కూడా బాధ్యతలు
- జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు
- పర్యావరణ హితంగా, నివాసయోగ్యంగా తెలంగాణను తీర్చిదిద్దాలని సీఎం సంకల్పించారు
- అందుకు అనుగుణంగా అందరూ అడుగులు వేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సిఎస్ ఆదేశాలు



మన తెలంగాణ /హైదరాబాద్

అటవీ చట్టాలను మరింత కఠినతరం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె.జోషి తెలిపారు. ఉన్న చట్టాలకు మరింత పదునుపెట్టి కఠినమైన చట్టాలను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. అడవి లోపలికి వెళ్లాలంటేనే భయపడేలా చట్టాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇందుకోసం ముందుగా అటవీ రక్షణకు సంబంధించి జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఫిబ్రవరి ఆరవ తేదీ నాటికి ఈ నివేదికను అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం సాయుధ బలగాల పోలీసులు, అటవీశాఖ ఉమ్మడిగా తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. అవసరమైతే పోలీసు ఇంటలిజెన్స్ వ్యవస్థను తరువాయి 6లో

బాల్యానికి భరోసా





325మంది పిల్లలను కాపాడిన పోలీసులు

- బాల కార్మికుల విముక్తి
- సత్ఫలితాలను ఇస్తున్న ఆపరేషన్ స్మైల్

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో

తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు, భిక్షమెత్తుకుంటున్న 325 మంది పిల్లలను నగర పోలీసులు కాపాడారు. ఇందులో 11మంది బాలికలు ఉన్నారు. 53 మంది పిల్లలను రెస్క్యూ హోంకు తరలించగా, 247మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తరువాయి 6లో

కుంచెపోటు





వెయ్యేకరాల వేత

అకాల వర్షాల వల్ల పంట నష్టంపై వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

వాస్తవంలో మరింత ఎక్కువే ఉండగల సూచన

వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పత్తి, మిర్చి, కంది, వేరుశనగ, సోయాబీన్, మొక్కజొన్న పంటలు

మన తెలంగాణ/న్యూస్‌నెట్‌వర్క్

వడగళ్ల వాన రైతులను నిండా ముంచింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, పెద్దపల్లి, వనపర్తి, రాజన్న సిరిసిల్లా, ఖమ్మం జిల్లాల్లో తరువాయి 6లో

రేపే మూడో విడత పంచాయతీ

3529 పంచాయతీలు 3

27,582 వార్డులకు పోలింగ్



అధికారంలోకి వస్తే పేదలకు కనీస ఆదాయ పథకం : రాహుల్ 12

ఇలా అయితే దిగిపోతా 12



కాంగ్రెస్‌కు కర్ణాటక సిఎం కుమారస్వామి హెచ్చరిక

గవర్నర్‌ను కలిసిన డైరెక్టర్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్

మనతెలంగాణ/హైదరాబాద్ : సైనిక సంక్షేమ డైరెక్టర్ కల్నల్ పి.రమేష్‌కుమార్ (రిటైర్డ్) గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. సోమవారం నాడు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

అడవుల రక్షణకు ఉపగ్రహ నిఘా

- రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీతో ఒప్పందం
- ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో అమలు



మన తెలంగాణ / హైదరాబాద్ : అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ దృష్టి సారించి పూచిక పుల్ల కూడా అడవి నుంచి బైటకు వెళ్ళరాదని రాష్ట్ర అటవీ శాఖకు స్వయంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలు జారీ చేసినందున అధునాతన పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. నిరంతరం అడవులపై ఉపగ్రహ నిఘాను ఉంచాలని భావించారు. ఇందుకోసం జాతీయ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీతో రాష్ట్ర అటవీ శాఖ ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఈ పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా వినియోగిస్తోంది. రెండు మూడు నెలల తర్వాత వచ్చే నివేదికల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అడవులకూ ఈ పరిజ్ఞానాన్ని వినియోగించడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అడవుల్లో ఆక్రమణలను నివారించడంతో పాటు కలప అవసరాల నిమిత్తం భారీ వృక్షాలను నరకడం, దుంగలను తరలించడం తదితరాలను అరికట్టే దిశగా ఈ ఉపగ్రహ పరిజ్ఞానాన్ని ప్రభుత్వం వినియోగిస్తోంది. ప్రస్తుతం కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ రెండు జిల్లాల్లో 1:5000 నిష్పత్తిలో హై రిజొల్యూషన్‌తో కూడిన ఛాయాచిత్రాలను రాష్ట్ర అటవీ శాఖకు రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ అందిస్తుంది. నిరంతరం ఉపగ్రహ నిఘా ఉంటున్నందున నిర్దిష్టంగా ఏ ప్రాంతంలో చెట్లు నరికివేతకు గురవుతున్నాయి, ప్రస్తుతం పచ్చదనం సాంద్రత ఎలా ఉంది, నరికివేసిన తర్వాత ఏ తీరులో తగ్గిపోయిందని తదితర వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు రాష్ట్ర అటవీ శాఖకు ఈ ఏజెన్సీ అందజేస్తుంది. దాని ప్రకారం వెంటనే అటవీ, పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి ఆ అటవీ ప్రాంతం పరిసరాల్లో రహదారులపై తరలిపోతున్న కలపను స్వాధీనం చేసుకోవడం, చెక్‌పోస్టు సిబ్బందితో తనిఖీలను ముమ్మరం చేయడం తదితర కార్యాచరణను చేపట్టడానికి వీలవుతుంది. అయితే చెట్ల నరికివేతతో పచ్చదనం తగ్గిపోయినప్పుడు మాత్రమే అటవీ శాఖకు సమాచారం ఇచ్చేలా ఆ ఏజెన్సీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అడవులను ఆక్రమిస్తున్న సందర్భంలో సైతం ఛాయాచిత్రాలను ఆ ఏజెన్సీ అందజేస్తుంది. నిర్దిష్టంగా అక్షాంశ, రేఖాంశాలను ఆ ఛాయాచిత్రాలతో పాటు ఏజెన్సీ అందజేస్తుందని అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతానికి 1:5000 నిష్పత్తితో కూడిన ఛాయాచిత్రాలను మాత్రమే పంపిస్తుందని, దీన్ని ఒక మీటరు స్థాయికి సరిపోయేంత సైజులో సైతం ఛాయాచిత్రాలను పంపించే పరిజ్ఞానం ఏజెన్సీ దగ్గర ఉన్నప్పటికీ అది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి భవిష్యత్తు అవసరాలను బట్టి దాన్ని వినియోగించుకోవడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆ అధికారి వివరించారు. అటవీ విస్తీర్ణంలో వస్తున్న మార్పులు, పచ్చదనం సాంద్రత తగ్గిపోవడం తదితరాలపై ప్రతీ రెండేళ్ళకోసారి కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఒక సర్వే జరుగుతూ ఉంటుందని, రాష్ట్రాలవారీగా నివేదిక కూడా విడుదలవుతూ ఉంటుందని, కానీ రెండేళ్ళ వ్యవధి చాలా ఎక్కువ కాబట్టి వెంటవెంటనే మార్పుల వివరాలు అందితే తగిన రీతిలో స్పందించడానికి వీలవుతుందన్న ఉద్దేశంతో ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ అధికారి వివరించారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అడవి విస్తారంగా ఉండడం, విస్తీర్ణం కూడాఎక్కువగా ఉన్నందువల్ల ఆ ఏజెన్సీతో ప్రయోగాత్మకంగా ఈ రెండు జిల్లాల్లోనే ఉపగ్రహ పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఈ రెండు జిల్లాలకు సంబంధించిన అడవులపై పూర్తి సమాచారం, గణాంకాలు ఉన్నందువల్ల ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా అందే చెట్ల నరికివేత, పచ్చదనం తగ్గిపోవడం తదితరాలపై రోజుల వ్యవధిలోనే అటవీ, పోలీసు శాఖలు రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకోడానికి వీలు కలుగుతుందని ఆ అధికారి వివరించారు. రెండు లేదా మూడు నెలల పాటు ఈ జిల్లాల్లో ఉపగ్రహ పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా వచ్చే ఫలితాలకు అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని అడవులకూ ఈ పరిజ్ఞానాన్ని విస్తరించడంపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

ఒ.పి.రావత్ ఓటు హైదరాబాద్‌లో ఉందా?

- రాష్ట్ర ఎన్నికల అధికారులపై ఇసి ఆగ్రహం
- అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తిని పార్లమెంట్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ ఎస్.కె.జోషి



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో నకిలీ ఓటరు కార్డులు రావడంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏకంగా కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ ఒ.పి. రావత్ పేరుతో ఓటరు స్లిప్పులు రావడం ఏంటని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వెంటనే దీనిపై నివేదిక పంపాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్‌ను కోరినట్లు తెలిసింది. ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ ఆరోరా వివిధ రాష్ట్రాల సిఇఒలు, సిఎస్‌లు,డిజిపిలు, ఐటి ఇతర అధికారులతో పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్ల సన్నద్ధతపై వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసి అధికారులు ఓటర్ల జాబితాలో తప్పులను ప్రస్తావించినట్లు తెలిసింది. ఇక గత డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.కె.జోషి తెలిపారు. అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఇసికి వివరించారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్ స్టేషన్‌లలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించడానికి కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు త్వరలోనే రాష్ట్రాలను పర్యటించనున్నట్లు ఇసి తెలిపింది. సరిహద్దు రాష్ట్రాల అధికారులతో వచ్చే నెల 5వ తేదీన సమావేశం జరగనుందని సిఎస్ ఇసికి వివరించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బడ్జెట్ ను కేటాయిస్తామన్నారు.

సరిపడా పోలింగ్ సిబ్బంది : రజత్‌కుమార్

సిఇఒ రజత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘంలో అవసరమైన సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, ఎఆర్‌ఒలు ఉన్నారని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1950 అన్ని జిల్లాలలో ప్రారంభించామని, సిబ్బందికి శిక్షణ పూర్తయిందని తెలిపారు. ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, ఇప్పటి వరకు 16 లక్షల అభ్యంతరాలు, సవరణలు వచ్చాయన్నారు. పంచాయతీ ఎన్నికలు ఉన్నందున గడువును ఫిబ్రవరి 4 వరకు పొడిగించినట్లు తెలిపారు. దివ్యాంగులకు చేసిన ఏర్పాట్లకు గాను జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు వచ్చిందన్నారు.

అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు రిపీట్: డిజిపి

రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నక్సల్స్ ప్రభావంపై చత్తీస్ ఘడ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతో ప్రత్యేక దృష్టితో కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామన్నారు. అంతరాష్ట్ర చెక్ పోస్టుల ఏర్పాటు, గత ఎన్నికల కేసుల పరిష్కారానికి చర్యలు, సమాచార మార్పిడి తదితర అంశాలపై ఇసికి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. శాసన సభ ఎన్నికలకు పొరుగు రాష్ట్రాలనుండి 19 వేల మంది, కేంద్రం నుండి 276 కంపెనీల పోలీసు సిబ్బందిని కేటాయించారని, అదే స్థాయిలో పార్లమెంటు ఎన్నికలకు కేటాయించాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా రూ.97 కోట్లు సీజ్ చేశామని, కేసులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ముఖ్య కార్యదర్శులు సోమేష్ కుమార్, రాజీవ్ త్రివేది, అడిషనల్ డిజి జితేందర్, ఎన్నికల అధికారులు ఆమ్రపాలి, సత్యవాణి, ఐటి అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రి శశిధర్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : పోలవరం ప్రాజెక్టు పరిధిలోని ఏడు ముంపు మండలాల్లోని ఓటర్లను ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతూ కేంద్రం ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ మర్రి శశిధర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోలేదని వ్యాఖ్యానించారు. ఇదే అంశంపై మర్రి శశిధర్‌రెడ్డి గతంలో ఉమ్మడి హైకోర్టులో పిటిషన్‌ను దాఖలుచేశారు. తెలంగాణ పరిధిలోని ఏడు మండలాలను ముంపు ప్రాంతాల పేరుతో రాజ్యాంగ విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని, ఫలితంగా ఈ మండలాల్లోని ఓటర్లు కూడా ఆ రాష్ట్ర ఓటర్ల జాబితాలోకి వెళ్ళిపోయారని గతంలో హైకోర్టులోనూ, సోమవారం సుప్రీంకోర్టులోనూ మర్రి శశిధర్‌రెడ్డి తరఫున జంధ్యాల రవిశంకర్ వాదించారు. అయితే ఈ పిటిషన్‌లోని అంశాలను, న్యాయవాది లేవనెత్తిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ధర్మాసనం గతేడాది నవంబరులో ఈ కేసును కొట్టివేసింది. దీంతో మర్రి శశిధర్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏడు మండలాల్లోని ఓటర్లను ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతూ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం, జారీ చేసిన నోటిఫికేషన్ అభ్యంతరకరమని రవిశంకర్ వాదించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ సోమవారం విచారణ సందర్భంగా ప్రస్తుత దశలో ఈ కేసులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసి పిటిషన్‌ను కొట్టివేశారు.



బస్‌స్టేషన్లలో సోలార్ ప్లాంట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణలోని ప్రధాన బస్‌స్టేషన్లతో పాటు అన్ని డిపోల్లో త్వరలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన పనులు మరింత త్వరతగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్యదర్శి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ, ఐటి) పురుషోత్తం ఆదేశించారు. క్వారీ, వార్ప్, సన్ కంపెనీలు 4,458 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల సంస్థకు సరాసరిన రూ.2.25 కోట్లు ఆదా అవుతుందన్నారు. వీటికి సంబంధించిన పనుల నిర్వహణపై సోమవారం బస్‌భవన్‌లో సంస్థ ఉన్నతాధికారులతో పాటు సంబంధిత సంస్థలకు చెందిన ప్రతినిధులతో సమీక్షించారు. సంస్థను నష్టాల బారి నుంచి గట్టెక్కించడంతో పాటు ఖర్చును తగ్గించుకునే విధానాల్లో భాగంగా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం జరిగిందన్నారు. సోలార్ వాడకంతో పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు సంస్థకు లాభసాటిగా ఉంటుందన్నారు. సమావేశంలో సిసిఇ, ఇఇ (ప్రధాన క్వార్టర్స్), డిప్యూటి ఇఇ (ఎలక్ట్రికల్), హెచ్ఓ, హెచ్‌ఆర్ అసిస్టెంట్ ఇంజనీర్లు (ఎలక్ట్రికల్) పాల్గొన్నారు.

నేటి నుంచి పొడి వాతావరణం

మనతెలంగాణ/హైదరాబాద్ : వాతావరణం చల్లబడడంతో చలిగాలులు అధికమయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అధికంగా నల్లగొండ జిల్లాల్లో 9 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మహబూబ్‌నగర్ జిల్లాలో 7 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. రంగారెడ్డి జిల్లాతో పాటు జయశంకర్ భూపాలపల్లిలో 0.3 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షపాతం నమోదయ్యింది. హైదరాబాద్ జిల్లాల్లో తీసుకుంటే అత్యధికంగా రాజేంద్రనగర్‌లో 1.5 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా మలక్‌పేటలోని అస్మాన్‌ఘడ్‌లో 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు చలికి ఇబ్బందులు పడ్డారు. ఆకాశం మేఘావృతం కావడంతో చలిగాలులు మరింత ఎక్కువగా వీచాయి. హిందూ మహాసముద్రం దానిని ఆనుకొని ఉన్న అండమాన్ ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రధానంగా ఈశాన్యదిశ, తూర్పుదిశ నుంచి గాలులు వీస్తున్నాయని అధికారులు తెలిపారు. తెలంగాణలో మంగళవారం నుంచి పొడి వాతావరణం నెలకొంటుందని అధికారులు పేర్కొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో డిగ్రీ ప్రవేశాలు

మన తెలంగాణ/హైదరాబాద్: పద్దెనిమిదేళ్ల వయసు నిండి, విద్యార్హత లేకపోయినా నేరుగా డిగ్రీ పరీక్ష చదవాలనుకునేవారికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు బిఎ, బికాం, బిఎస్సీలలో ఒక కోర్సు చదువుకోడానికి అవకాశం ఉంది. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 28వ తేదీన నిర్వహిస్తున్నామని, మార్చి 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విశ్వవిద్యాలయ ప్రజాసంబంధాల అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆర్థికవేత్త పుల్లారావుకు జనసేన ఆహ్వానం

మనతెలంగాణ/హైదరాబాద్ : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రముఖ ఆర్థికవేత్త, పర్యావరణ ఉద్యమకారుడు పెంటపాటి పుల్లారావుపై ప్రశంసలు కురిపించారు. పుల్లారావును జనసేన పార్టీలోకి చేరాల్సిందిగా ఆహ్వానించానని ట్విట్టర్ వేదికగా పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఆయన రాస్తున్న కథనాలు విశ్లేషాత్మకంగా, ఆలోచింపచేసేలా ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఓ సందర్భంలో పుల్లారావును తాను కలిశానని తామిద్దరం కొన్ని గంటల పాటు ఒకరి ఆలోచనలను మరొకరం పంచుకున్నామని ఆయన వెల్లడించారు. జనసేన లాంటి కొత్త పార్టీకి పుల్లారావు లాంటి అనుభవం ఉన్న వ్యక్తుల మార్గదర్శకత్వం అవసరముందని ఆయన తెలిపారు. జనసేన పార్టీలో చేరాల్సిందిగా పుల్లారావును తాను ఒప్పించానని, ఆయనకు స్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు.

నేడు స్వదేశానికి గల్ఫ్ బాధితులు

ఢిల్లీ మీదుగా హైదరాబాద్‌కు



మన తెలంగాణ / హైదరాబాద్ : పొట్టకూటి కోసం ఇరాక్‌కు వెళ్ళి ఇబ్బందుల్లో ఉన్న 14 మంది నిజామాబాద్ యువకులకు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఇరాక్‌లోని భారత రాయబారి కార్యాలయం చొరవతో వారంతా ఎర్బిల్ నుంచి విమానంలో ఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం ఢిల్లీకి చేరుకునే వీరంతా తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ విమానంలో హైదరాబాద్‌కు పంపించనున్నారు. వీరు ఏజెంట్ల మోసాన్ని తెలుసుకోలేకపోయారు. టూరిస్టు వీసా మీద వెళ్ళిన వీరిని ఇరాక్ పోలీసులు పట్టుకున్నారు. తగిన డాక్యుమెంట్లు (వర్కింగ్ పర్మిట్) లేకపోవడంతో అక్కడి నిబంధనల ప్రకారం వీరిపై జరిమానా విధించారు. ఆ ప్రకారం వీరు తలా రూ. 12,500 మొదలు రూ. 17,500 వరకు చెల్లించాల్సి ఉంది. అక్కడ పనిచేయడానికి తగిన అవకాశాలు లేకపోవడంతో ఎప్పుడెప్పుడు స్వస్థలాలకు వెళ్ళాలా అని ఎదురుచూపులతో గడిపారు. తెలంగాణ గల్ఫ్ బాధితుల సంఘం (గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్) అధ్యక్షుడు బసంత్‌రెడ్డి ఈ సమాచారాన్ని తెలుసుకుని మన దేశ విదేశాంగ శాఖ ద్వారా ఇరాక్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించింది వీరికి సంబంధిత వివరాలను అందజేసి సాయం చేయాల్సిందిగా కోరారు. ఇరాక్ నిబంధనల ప్రకారం 14 మంది ఎగ్జిట్ వీసా మంజూరు కోసం ఇరాక్ అధికారులకు రోజుకు పదహారు డాలర్ల చొప్పున మొత్తం 23,296 డాలర్లను చెల్లించి 'ఎగ్జిట్ వీసా' మంజూరయ్యేలా చొరవ తీసుకున్నట్లు బసంత్‌రెడ్డి మీడియాకు వివరించారు.


హరితహారానికి రూ.25 కోట్లు

నిధులు విడుదల చేసిన పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖ



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖ రూ.25 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని ప్రతి గ్రామపంచాయతీకి ఒక నర్సరీ (మొక్కల పెంపు కేంద్రం) ఏర్పాటు చేసేందుకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుండెపోటుతో పశుసంవర్ధక శాఖ సంచాలకుని మృతి



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ సంచాలకులు వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతి చెందారు. తిరుపతిలో వెంకటేశ్వర పశువైద్య వర్సిటీలో జరిగిన జాతీయ సదస్సుకు సోమవారం ఆయనహాజరయ్యారు. సదస్సు అనంతరం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. క్యూలైన్‌లో వెంకటేశ్వర్లుకు గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించారు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. నల్లగొండ జిల్లా వేముల పల్లి మండలం బీమారం గ్రామంలో వెంకటేశ్వర్లు స్వస్థలం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆయన పదవి విరమణ చేయాల్సి ఉంది. 1985లో వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగ జీవితం ప్రారంభించిన వెంకటేశ్వర్లు, జగిత్యాల్, భువనగిరి ప్రాంతాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 1993 నుంచి ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో ఇండోసిస్ ప్రాజెక్టులో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. గొర్రెల అభివృద్ధి సంస్థ, టిఎస్‌ఎల్‌డిఎ ఎం.డిగా, 2013 నుంచి పశుసంవర్ధక శాఖ సంచాలకుడిగా సేవలందిస్తున్నారు.

వృద్ధులకు ప్రభుత్వం ఆసరా

సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి : హోం మంత్రి మహమూద్ ఆలీ

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో వృద్ధులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలకు ప్రభుత్వం తప్పనిసరిగా పరిష్కారం చూపిస్తుందని, ఇప్పటికే వారికి ఇస్తున్న వెయ్యి రూపాయల వృద్ధాప్య పింఛనును రెట్టింపు చేశామని, రానున్న ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్) నుంచి రూ.2016 చొప్పున ఇస్తామని హోం మంత్రి మహమూద్ ఆలీ తెలిపారు. కొద్ది మంది వృద్ధులకు కుటుంబం నుంచి తగిన ఆదరణ లేక నీడ కూడా కోల్పోయారని, వారికి ప్రభుత్వం తరఫున షెల్టర్లను నిర్మిస్తామని, వారి ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ సిటిజెన్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను, డైరీని సోమవారం సాయంత్రం ఆవిష్కరించిన సందర్భంగా మహమూద్ ఆలీ ప్రసంగిస్తూ, శిశువు మొదలు బాల్యం, కౌమార్యం, యవ్వనం, నడి వయసు దాటి ఇప్పుడు వృద్ధాప్యంలోకి ప్రవేశించారని, అనేక రకాల మానసిక, శారీరక, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఒక సీనియర్ సిటిజెన్‌గా తాను వాటిని అర్థం చేసుకోగలనని అన్నారు. కొద్దిమంది వృద్ధులు వారి పిల్లల నుంచి కూడా ఆదరణ లేకపోవడంతో ఒంటరిగా బతుకుతున్నారని, మానసిక సమస్య అన్నింటికన్నా ఇబ్బందికరమైనదన్నారు. అలాంటి పరిస్థితుల్లో సమాజం నుంచి వారు చాలా కోరుకుంటారని, ఒంటరి జీవితాన్ని ఒక నరకంగానే అనుభవిస్తూ ఉంటారని అన్నారు. పనిచేసే శక్తి లేక, సమాజంలో ఆదరణ లేక వారి జీవితం కుంచించుకుపోతూ ఉంటుందని, ఇలాంటి సమయంలో డిప్రెషన్, ఒంటరితనం బాధలు ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా ఉంటాయని, అందువల్లనే వారి బాధ్యత సమాజానిదే అనే తీరులో మారిపోయిందన్నారు. ఇక్కడకు వచ్చిన వృద్ధుల్లో ఒక్కొక్కరిది ఒక్కో రకమైన గాథ, బాధ అని, తప్పకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి శేష జీవితాన్ని కూడా సంతోషంగా, తృప్తిగా ఉండేలా తగిన నిర్ణయాలు తీసుకునేందుకు తన వంతు సాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

విజయవాడ మినీ థియేటర్లపై నివేదిక

త్వరలో లక్నోకు అధికారుల బృందం



మన తెలంగాణ/ హైదరాబాద్ : బస్‌స్టేషన్లలో మినీ థియేటర్ల ఏర్పాటుకు సంబంధించిన నివేదికను ఆర్‌టిసి అధికారుల బృందం సోమవారం సంస్థ ఇంచార్జీ ఎండి సునీల్‌శర్మకు అందజేసింది. రాష్ట్రం ఆర్‌టిసిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 14 జిల్లాల్లోని బస్ స్టేషన్ ప్రాంగణాల్లో మినీ థియేటర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నందున విజయవాడలో అమలవుతున్న తీరుపై అధికారుల బృందం అధ్యయనం చేసింది. రాష్ట్రంలో 23 బస్‌స్టేషన్లలో మినీ థియేటర్లను ఏర్పాటు చేయడపై ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయం జరిగింది. ఇందులో 15 ప్రాంతాల్లో రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ సహకారాన్ని ఆర్‌టిసి తీసుకుంటోంది. థియేటర్లను నిర్మించడానికి ముందే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విజయవాడలోని పండిట్ జవహర్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో నెలకొల్పిన థియేటర్ ఏ తీరులో పనిచేస్తుందో, ఆదాయం ఏ మేరకు సమకూరుతుందో, ప్రజల నుంచి ఎలాంటి ఆదరణ ఉందో, నిర్వహణ ఖర్చులు పోగా ఏ మేరకు లాభం వస్తుందో తదితర అంశాలను ఈ బృందం అధ్యయనం చేసింది. ప్రయాణికుల నుంచి ఏ మేరకు ఆదరణ ఉంది, ఎంతవరకు ఉపయోగపడుతున్నాయనేదానితో పాటు ఎంత మేరకు ఆదాయం సమకూరుతుందనే విషయాలపై ఆరా తీసి ఆ రాష్ట్రానికి అధికారులతో చర్చించి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆ వివరాలను పొందుపరుస్తూ నివేదకను తయారుచేసి సునీల్‌శర్మకు అందజేశారు.


విజయవాడ బస్‌స్టేషన్‌లో రెండు స్క్రీన్లతో మీని థియేటర్లు, ఫుడ్ స్టాళ్ళు, వాటి ద్వారా నెలకు రూ.4.45 లక్షల ఆదాయం సమకూరుతున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారని సమాచారం. తెలంగాణలో సైతం ఆర్‌టిసి బస్ స్టేషన్లలో ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకునేందుకు మినీ థియేటర్లను నిర్మించవచ్చని నివేదిక లో సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో లక్నోలో నిర్మించిన బస్‌స్టేషన్‌ను ఇదే బృందం త్వరలో సందర్శించనుంది. దానికి సంబంధించిన నివేదిక వచ్చిన తర్వాత ఆర్థిక ప్రయోజనాలు చేకూరే విధంగా సంస్థ నిర్ణయాలు తీసుకుంటుందనే అంశాలను ఎండి ఈ సందర్భంగా అధికారుల బృందానికి తెలిపారు. సంస్థకు సంబంధించిన ఖాళీ స్థలాలను ఏ రకంగా ఉపయోగించుకుంటే ఆదాయం సమకూరుతుందనే అంశంపై కూడా అధ్యయనం జరుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాలను ఒకవైపు మెరుగుపరుస్తూనే మరోవైపు సంస్థ ఆర్థికంగా పుంజుకోవడానికి అన్ని రకాలుగా పరిశీలన జరుపుతున్నట్లు వివరించారు.

రైతుల మేలు కోసమే...

దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సమావేశం : కోదండరెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతుల ప్రయోజనం కోసమే దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సమావేశ లక్ష్యమని ఆ విభాగం కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి పరిష్కారం చూపడం కోసమే ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ హయంలో రైతులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం కేవలం పెట్టుబడిదారులకే మాత్రమే కొమ్ముకాస్తోందని విమర్శించారు. కానీ దేశానికి అన్నం పెట్టే రైతన్నల గురించి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్‌గాంధీ కిసాన్ కాంగ్రెస్‌కు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారని ఆయన వెల్లడించారు. ఆయన ఆదేశాల మేరకు కిసాన్ కాంగ్రెస్ సమావేశాన్ని మంగళవారం గాంధీభవన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.

కొనుగోలుదారులకు ప్లాట్లు



ఏడాది కాలంలో ధరలకు 7% రెక్కలు

పెరిగిన చదరపు అడుగు ధర

బంజారాహిల్స్‌లో 4, కోకాపేటలో 9శాతం అమ్మకాల పెరుగుదల

రెసిడెన్షియల్ యూనిట్ల అమ్మకాల్లో 35 శాతం వృద్ధి

ప్రదేశం	చదరపు అడుగు (రూ.లలో)
ఢిల్లీ	4,240
కోల్‌కత్తా	3,259
హైదరాబాద్	4,090
పుణె	4,373
చెన్నై	4.389
బెంగళూరు	4.681
ముంబై	7,192

మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ పారిశ్రామిక పురోభివృద్ధితో పాటు రియల్ ఎస్టేట్ రంగం కూడా గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో గృహ నివాసాలకు డిమాండ్ ఏర్పడింది. నగరంలో ఏడాదికాలంలో ప్లాట్ల ధరలు పెరిగాయి. 2017 సంవత్సరంలో చదరపు అడుగు ధర సగటున రూ.3,821 ఉండగా, 2018 నాటికి అది కాస్తా రూ. 4,090కు చేరింది. 12 నెలల వ్యవధిలో 7 శాతం ధరలు పెరిగాయి. గతంలో పూర్తయిన ఇళ్లను విక్రయించేందుకు బిల్డర్లకు 15 నెలల సమయం పట్టేది. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో 2018 సంవత్సరం మార్చి నుంచి 6 నెలల్లోనే అమ్మకాలు పూర్తయ్యాయని రియల్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఇళ్ల కొనుగోలుకు ఐటి సంస్థల్లో పనిచేసే వారు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అంతర్జాతీయ ఐటి సంస్థలు హైదరాబాద్‌కు తరలిరావడం, ఇప్పటికే ఏర్పాటైన సంస్థలు విస్తరణ చేపట్టడంతో నగరంలో ఇళ్లకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే రెండేళ్లలో ఇళ్లకు చాలా డిమాండ్ ఏర్పడిందని, భవిష్యత్తులో అది మరింత పెరుగుతుందని రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. నగరం రెసిడెన్షియల్ యూనిట్ల అమ్మకాల్లో 35 శాతం వృద్ధిని సాధించినట్టు రియల్ వ్యాపారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ పెరిగిన జీడిపితో వృద్ధి మరింత వేగవంతమయ్యిందని ఆర్థికరంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ రంగం కోలుకోవడానికి కచ్చితంగా రెరా లాంటి విధానాలు కారణమవుతున్నాయని, ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చిన్న రియల్ వ్యాపారులతో పాటు బడా సంస్థలు ముందుకొస్తున్నారని అధికారులు తెలిపారు. రెరా వలన అమ్మకందారుల్లో నమ్మకాన్ని కలిగించడంతో రియల్ ఎస్టేట్ మెరుగైన ఫలితాలను కనబరుస్తోందని రియల్ వ్యాపారులు పేర్కొంటున్నారు. దీని వలన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాల వృద్ధికి ప్రధాన పాత్ర పోషిస్తున్నదని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో చదరపు అడుగు రూ.15 వేలు దాటింది. ఇక్కడ పెరుగుదల 4 శాతం ఉండగా కోకాపేట లాంటి ఏరియాలో సంవత్సరంలో 9 శాతం పెరుగుదల ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. బండ్లగూడ, మణికొండలో 8 శాతం, రాజేంద్రనగర్‌లో 7 శాతం పెరుగుదల కనిపించిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎల్‌బీనగర్, నాచారం ప్రాంతాల్లో 5 శాతం పెరిగాయి.వ్యవస్థీకృత స్థిరాస్తి మార్కెట్‌లో విక్రయాలు 9 శాతం పెరిగినట్టు పేర్కొంటున్నారు.

ప్రాంతాల వారీగా చూసుకుంటే..

పశ్చిమ: కూకట్‌పల్లి, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కోకాపేట ప్రాంతాల్లో ఎక్కువగా ఇళ్లను నిర్మించారు. విక్రయాలు కూడా ఎక్కువగా ఇక్కడే జరిగాయి. 2018లో 10,492 ఇళ్లను విక్రయించారు.

ఉత్తరం: కొంపల్లి, మేడ్చల్, అల్వాల్, కుత్బుల్లాపూర్ ప్రాంతం రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 1,563 ఇళ్లు కొనుగోళ్లు జరిగాయి.

దక్షిణం: రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల్లో ప్రస్తుతం మార్కెట్ విస్తరిస్తోంది. ఇక్కడ 1,146 ఇళ్లను విక్రయించారు.

మధ్య: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, సోమాజీగూడ, బేగంపేట ప్రాంతాల్లో పాత నివాసాలను కూలగొట్టి బహుళ అంతస్తుల నిర్మాణాలను చేపడుతున్నారు. ఇక్కడ 1,102 ఇళ్లను విక్రయించారు.

తూర్పు: ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, ప్రాంతాల్లో 918 ఇళ్ల అమ్మకాలు జరిగాయి. అపార్ట్‌మెంట్ కట్టే చోట నిర్మాణ, నాణ్యత, సౌకర్యాలను బట్టి చదరపు అడుగు ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నాయి. పాత ప్రాజెక్టులు కొత్త వాటిలోనూ ధరల్లో తేడా ఉంది. నైట్‌ఫ్రాంక్ (2018) నివేదిక ప్రకారం ధరలు ఈ విధంగా పేర్కొంది. హైదరాబాద్ మార్కెట్‌లో ప్లాట్లు రూ.25 లక్షల నుంచి అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా చూస్తే గతంలో రూ.50 లక్షల లోపు ఉండే ఇళ్ల నిర్మాణాలను ఎక్కువగా కొనుగోలు చేసేవారు. ధరలు పెరగడంతో ఇప్పుడు సగానికంటే తగ్గినట్టు రియల్‌రంగ నిపుణులు పేర్కొంటున్నారు. 2017 సంవత్సరంలో రూ.50 లక్షల లోపు ప్లాట్లకు ఆదరణ ఎక్కువగా ఉండేది. 2018లో రూ.75 లక్షల ధరల శ్రేణిలో నిర్మాణాలు గతేడాదిగా ఎక్కువగా ప్రారంభమయ్యాయి.

హైదరాబాద్‌కు వలస వచ్చే వారి సంఖ్య పెరగడం...

హైదరాబాద్‌కు వలస వచ్చే వారి సంఖ్య పెరగడం, నగర మౌలిక వసతుల కల్పన, కనెక్టివిటీపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టడంతో రియల్‌ఎస్టేట్ రంగం పురోగతి సాధించింది. దీంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతున్నాయి. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల మార్పులు, గృహ రంగానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోదా రావడంతో ఈ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. 2019లో మొత్తం ఈ రంగానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోదా, తక్కువ వడ్డీ రేట్లకు నగదు లభ్యత మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని రియల్ వర్గాలు పేర్కొంటున్నాయి. తద్వారా కొనుగోలు దారులకు ప్రాజెక్టులు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.





స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా, దుబ్బాకకు చెందిన నేత సిద్ధిరామ్, టిఎస్‌ఇడబ్ల్యుఐడిసి చైర్మన్ నాగేందర్ గౌడ్ సోమవారంనాడు ప్రగతిభవన్‌లో సిఎం కెసిఆర్‌ను కలిసి వారివారి కూతుళ్లు, కుమారుడి వివాహాలకు ఆహ్వానిస్తున్న దృశ్యాలు

రేడియాలజీ ఫిజిసిస్ట్‌లకు ఫిబ్రవరి 1న మౌఖిక పరీక్ష

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో రేడియాలజీ విభాగంలో ఫిజిసిస్ట్, ఫిజిషియన్‌ల పోస్టుల భర్తీ కోసం గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులై అర్హత పొందినవారికి ఫిబ్రవరి 1వ తేదీన పబ్లిక్ సర్వీస్ కమిషన్ మౌఖిక పరీక్షలు నిర్వహించనుంది. గతేడాది అక్టోబరులో 23, 24 తేదీల్లో పరీక్షలు జరిగిన తర్వాత మెరిట్ జాబితాలో స్థానం పొంది అర్హత సాధించినవారికి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆఫీసులో ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 10గంటల నుంచి మౌఖిక పరీక్షలు, ఇంటర్‌వ్యూలు జరుగుతాయని కమిషన్ డిప్యూటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించినవారి వివరాలు, హాల్‌టికెట్ నెంబర్లను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

వెబ్‌సైట్ ఆప్షన్లకు మరో అవకాశం

విఆర్‌ఒ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వెబ్ ఆప్షన్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోనివారికి, మళ్ళీ మార్పులు చేయాలనుకునేవారికి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరోసారి అవకాశం కల్పించింది. గురువారం వరకు ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లను సవరించుకోవచ్చని, ఆప్షన్లను ఖరారు చేసిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం లేదని కమిషన్ డిప్యూటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన వెబ్ ఆప్షన్లలో మళ్ళీ మార్పులు చేసుకోవాలనుకునేవారికి అవకాశమిచ్చామన్నారు.

ట్రిబ్యునల్ ఉద్యోగులకు త్వరలో పోస్టింగులు

జిఎడి కార్యదర్శిని కలిసిన ఉద్యోగులు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగులు త్వరలో వివిధ విభాగాల్లో విధుల్లో చేరనున్నారు. ఆర్థిక శాఖ నుంచి వీరికి అనుమతులు, నియామక ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది. క్వాసీ జ్యుడిషియల్ సంస్థలుగా ఉన్న లేబర్ కోర్టు, మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, సమాచార కమిషన్, వివిధ ట్రిబ్యునళ్ళలో వీరికి త్వరలో నియామక ఉత్తర్వులు జారీ కానున్నాయి. సమైక్య రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో పనిచేసి తెలంగాణ ఏర్పడిన అనంతరం రెండు రాష్ట్రాల మధ్య విభజన కావడంతో సుమారు 75 మంది ఉద్యోగులు ఇంతకాలం హైకోర్టులో ఉద్యోగులుగా పనిచేశారు. సమైక్య రాష్ట్రంలో అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో పనిచేసినందున విభజన తర్వాత వీరు తెలంగాణ ట్రిబ్యునల్‌లో పనిచేయాల్సి ఉంది. కానీ తెలంగాణ రాష్ట్రం ట్రిబ్యునల్ అవసరం లేదని భావించినందున వారికి ఆ అవకాశం లేకుండా పోయింది. క్వాసీ జ్యుడిషియల్ ఉద్యోగులుగా ఉన్నందున తొమ్మిదవ షెడ్యూలులోని ఏ సంస్థలోనూ వీరిని వారివారి స్థాయికి తగినట్లుగా నియమించుకునే పోస్టులు లేకపోవడంతో వారిని హైకోర్టులో పనిచేసేలా ఇంతకాలం రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెలా జీతాలు చెల్లిస్తూ తాత్కాలిక నియామకాలు చేసింది. ఇప్పుడు హైకోర్టు సైతం రెండు రాష్ట్రాలకు వేర్వేరుగా ఏర్పడినందున ఇకపైన కూడా హైకోర్టులోనే వీరి సేవలను కొనసాగించుకునే అవకాశం లేకపోయింది. దీంతో వీరు ఏ శాఖలోనూ ఉద్యోగులుగా లేనందున సచివాలయానికి వచ్చి సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి తాజా పరిస్థితిని వివరించారు. గతంలో ఉన్న వ్యవస్థ ప్రకారం 'సర్‌ప్లస్ సెల్'కు అప్పగించి ఆ తర్వాత వారికి నిర్దిష్ట పోస్టింగ్‌లు ఇచ్చే యంత్రాంగం ఉండేది. కానీ ఇప్పుడు హెచ్‌ఆర్‌ఎం 1, 2 అనే విభాగాలు ఉన్నందున తాత్కాలికంగా వాటికి అప్పగించే అవకాశం ఉంది. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సమైక్య రాష్ట్రంలో సిక్స్ పాయింట్ ఫార్ములా ప్రకారం ఎంపి అనే ఒక విభాగానికి వీరిని కేటాయించాల్సి ఉన్నా ఇప్పుడు ఆ వ్యవస్థ లేకపోవడంతో తాత్కాలికంగా జిఏడి చూస్తోంది. ఆర్థిక శాఖకు లేఖ రాసిన అనంతరం ఆ శాఖ నుంచి తగిన ఉత్తర్వులు, అనుమతులు రావడంతో వీరికి నిర్దిష్ట పోస్టింగ్‌లు, ప్రతీ నెలా వేతనం అందుతుంది. త్వరలోనే వీరికి నిర్దిష్ట పోస్టింగ్‌లు లభించే అవకాశం ఉందని, సాధారణ విభాగాల్లో వీరికి పని చేయడానికి తగిన అనుభవం లేనందువల్ల మళ్ళీ క్వాసీ జ్యుడిషియల్ విభాగాల్లో నియమించే అవకాశం ఉంది.

రేపే మూడోవిడత పంచాయతీ పోలింగ్

3529 పంచాయతీలు, 27,582 వార్డులు



మన తెలంగాణ/హైదరాబాద్: మూడో విడత పంచాయతీ ఎన్నికలకు బుధవారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. 3,529 పంచాయతీలకు, 27,582 వార్డులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. సర్పంచ్ పదవికి 11,664 మంది, వార్డు మెంబర్‌కు 73,976 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. దాదాపు 60 వేల మంది పోలింగ్ సిబ్బంది (బూత్) ఎన్నికల నిర్వహణలో పాల్గొననున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ కూడా తగిన బందోబస్తు ఏర్పాటు చేసింది. వాస్తవానికి రెండో విడతలో 4116 పంచాయతీలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో 10 పంచాయతీలకు నామినేషన్లు రాకపోవడం, వచ్చినవాటిలో కొన్ని తిరస్కరణకు గురికావడంతో వాటికి ఎన్నిక నిర్వహించడం లేదు. 577 ఏకగ్రీవం కావడంతో 3529 పంచాయతీలకు ఎన్నిక నిర్వహించనున్నారు. అలాగే 36,729 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా 188 వార్డులకు నామినేషన్లు రాలేదు. 8959 ఏకగ్రీవం కావడంతో 27,582 వార్డులకు ఎన్నిక నిర్వహించనున్నారు. సమస్యాత్మక కేంద్రాలైన అన్నిజిల్లాల్లో పలు చోట్ల వెబ్‌క్యాస్టింగ్ చేయనున్నారు. నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంతో పాటు, డిజిపి, జిల్లా ఎస్‌పి కార్యాలయాల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపును పరిశీలించనున్నారు. వెబ్‌క్యాస్టింగ్ కాకుండా మిగతా చోట్ల వీడియో రికార్డింగ్ చేయనున్నారు. మొదటి రెండు విడతల్లో ఎదురైన ఇబ్బందులు, సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీ ఏర్పాట్లను చేసింది.

అటవీ భూములకు ఒకటే రికార్డు

- కొత్త నెంబర్లు కేటాయించాలని రెవెన్యూ శాఖకు విజ్ఞప్తి
- వివాదాస్పద భూములు సర్వే చేయాలని అధికారుల నిర్ణయం
- అటవీ శాఖ భూములను అడవి భూమిగా పేర్కొనాలని ప్రతిపాదన



మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలో వేర్వేరు పేర్లతో ఉన్న అటవీ భూములను రికార్డుల్లో ఒకే పేరుతో తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖకు అటవీశాఖ ప్రతిపాదనలు పంపింది. పలు జిల్లాల్లో జంగల్, అడవి పోరంబోకు తదితర పేర్లతో రికార్డుల్లో ఉన్నాయి. ఈ పేర్లను తొలగించి వీటి స్థానంలో అడవి భూమిగా పేర్కొనాలని అటవీశాఖ కోరింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా రికార్డులను పరిశీలిస్తోంది. అటవీ భూములను లెక్క తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రెవెన్యూ, అటవీ శాఖలు దీనిపై కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 68 లక్షల అటవీ భూములు ఉన్నాయి. అందులో 53 లక్షల ఎకరాలకు సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖ దస్త్రాలను పోల్చి చూడగా అందులో 47 లక్షల ఎకరాలు మాత్రమే అటవీ భూమిగా రెవెన్యూ శాఖ తేల్చింది. ఆరు లక్షల ఎకరాలు రెవెన్యూ రికార్డులతో సరిపోలేదు. మిగిలిన 13 లక్షల ఎకరాల రికార్డులు పరిశీలన పూర్తయ్యాక వివాదాస్పదంగా ఉన్న భూములను క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు సర్వే ద్వారా తేల్చాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఇదే విషయమై రెవెన్యూ శాఖ మార్గదర్శకాలను ఇప్పటికే రూపొందించే పనిలో ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.దీనికి సంబంధించి త్వరలో సిసిఎల్‌ఏ సర్క్యులర్ జారీ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. సుమారు 15 లక్షల అటవీ భూములకు సర్వే నెంబర్లు లేవని, వీటికి కొత్తగా నెంబర్లు ఇవ్వాలని అటవీశాఖ రెవెన్యూ శాఖను కోరింది. భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. అటవీ భూములను రెవెన్యూ పహాణీల్లో అడవి భూములుగా మార్పు చేయించాలని కూడా అటవీ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇదే విషయమై రెవెన్యూ శాఖకు సూచించడంతో ఆ దిశగా రెండు శాఖలు కసరత్తు చేస్తున్నారు.

సిబిఐలో జైట్లీ జోక్యం

సంపాదకీయం


ఇప్పటికే మూలిగే నక్కను తలపిస్తున్న సిబిఐ (కేంద్ర నేర దర్యాప్తు సంస్థ) స్వేచ్ఛ మీద, విధ్యుక్త ధర్మ నిర్వహణ మీద అరుణ్ జైట్లీ రూపంలో మరో బండరాయి పడింది. సిబిఐని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇడి) ను ప్రధాని మోడీ ప్రభుత్వం తన జేబు బొమ్మలను చేసుకొని తిరుగుతున్నదని, దేశ ప్రజల మేలు కోరి పార్టీల కతీతంగా, నిష్పాక్షికంగా వ్యవహరించవలసిన ఉన్నత వ్యవస్థల స్వాతంత్ర్యాన్ని ఈ పాలన నిలువునా బలి తీసుకొని వాటిని భ్రష్టుపట్టిస్తున్నదనే విమర్శ ఈసరికే మిన్నంటుతున్నది. ఇది ఇక్కడితో ఆగదని, సిబిఐ వెన్నెముక పూర్తిగా విరిచి పోగులు పెట్టేవరకు ఎన్‌డిఎ ప్రభుత్వం ఊరుకోదనే అభిప్రాయానికి ఇప్పుడు అవకాశం కలుగుతున్నది. ఇంకొక వైపు విజిలెన్స్ కమిషనర్ల మీద వచ్చే ఆరోపణలపై విచారణ జరిపించడానికి నిబంధనలు ఒప్పుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేయడం గమనార్హం.

విడియోకాన్‌కు ఐసిఐసిఐ అక్రమ రుణ మంజూరు ఉదంతంపై సిబిఐ ప్రాథమిక దర్యాప్తు నివేదికలో ఆ బ్యాంకు ప్రస్తుత సిఇఒ సందీప్ భక్షి, దాని నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కెవి కామత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ చటర్జీ వంటి ప్రముఖుల పేర్లను కూడా చేర్చడం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి ఆగ్రహం కలిగించింది. టిష్యూ క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాలో ఉన్న జైట్లీ తన శాఖకు ఎంతమాత్రం సంబంధంలేని సిబిఐ మీద రుసరుసలాడుతూ ట్వీట్ చేశారు. బ్యాంకింగ్‌కు సంబంధించిన ఒక కేసు దర్యాప్తులో ప్రముఖులను చేర్చడాన్ని అభ్యంతర పెట్టారు. దుస్సాహస దర్యాప్తులు తగవని, వృత్తి నైపుణ్యంతో, నిబద్ధతతో చేయాలని వ్యాఖ్యానించారు. పక్షి కన్నును గురి పెట్టి బాణాన్ని సంధించిన అర్జునుడి పౌరాణిక గాథను ఉదహరించారు. నేరుగా లక్ష్యాన్ని ఛేదించాలేగాని అనవసరమైనవారందరి జోలికి పోకూడదని హితవు చెప్పారు.

చందాకొచ్చర్ ఐసిఐసిఐ బ్యాంకుకు సారథ్యం వహించిన రోజుల్లో తన భర్త దీపక్ కొచ్చర్‌తో వ్యాపార పరమైన సాన్నిహిత్యం, సంబంధాలున్న వేణుగోపాల్ ధూత్ యాజమాన్యంలోని విడియోకాన్ గ్రూపు సంస్థలకు బ్యాంకు పరపతి విధానానికి విరుద్ధంగా ఆమె 3250 కోట్ల రూపాయల రుణం మంజూరు చేయించారని, ఇందుకు ప్రతిగా ఆమె భర్త కంపెనీలకు ధూత్ రూ. 65 కోట్లు బదలాయించారన్నది కేసు సారాంశం. ఈ కేసులో ప్రస్తుతం ఐసిఐసిఐ నుంచి తప్పుకున్న చందా కొచ్చర్‌ను, ఆమె భర్తను, విడియోకాన్ యజమానిని నిందితులుగా సిబిఐ చేర్చింది. కెవి కామత్, సంజయ్ చటర్జీ తదితరులపై ఎటువంటి అభియోగాలు మోపలేదు. విడియోకాన్‌కు రుణ మంజూరీ ప్రక్రియ వివిధ దశల్లో జరిగిన ఐసిఐసిఐ బ్యాంకు డైరెక్టర్ల బోర్డు సమావేశాలకు ఈ పెద్దలు హాజరయ్యారని కేవలం దర్యాప్తు పకడ్బందీగా జరిపించడం కోసమే వారిని కూడా విచారించాలని సిబిఐ సంకల్పించినట్టు బోధపడుతున్నది. అరుణ్ జైట్లీ ఆగ్రహానికి కారణమిదే. ఇంకా మరికొన్ని కార్పొరేట్ సంస్థలకు రూ. 1575 కోట్ల మేరకు ఐసిఐసిఐ మంజూరు చేసిన రుణాలు తిరిగి రాని బకాయిలుగా మురిగిపోయి ఆ బ్యాంకును తీవ్ర నష్టాలపాలు చేశాయి. ఈ రుణాల మంజూరు సందర్భంగా జరిగిన బోర్డు మీటింగుల్లోనూ ఈ అధికారులు పాల్గొన్నట్టు తెలుస్తున్నది. అందుచేత వీరి పేర్లను ప్రాథమిక దర్యాప్తు నివేదికలో కేవలం చేర్చడాన్ని తప్పుపట్టవలసిన పని లేదు. కాని వీరంతా కార్పొరేట్ దిగ్గజాలు కావడం వల్ల వారి నుంచి వచ్చిన ఒత్తిడి అస్వస్థతలో సైతం సిబిఐని మందలిస్తూ ట్వీట్ చేయడానికి కేంద్ర ఆర్థిక మంత్రిని పురికొల్పిందని అనుకోవలసి ఉన్నది.

మోడీ ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాల అడుగులకు మడుగులొత్తుతున్నదని భావించడానికి ఆస్కారం కలుగుతున్నది. ప్రధాని తర్వాత అంతటివాడనిపించుకుంటున్న అరుణ్ జైట్లీ తన స్థాయి, స్థితి మరచి విదేశాల నుంచే సిబిఐ చెవులు మెలిపెట్టారంటే ఆ సంస్థ నిష్పాక్షికత మరింతగా నీరుకారడం ఖాయమని స్పష్టపడడం లేదా? ఇప్పటికే అలోక్ వర్మను సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి నియమ విరుద్ధంగా సెలవు మీద పంపించి ఆ తర్వాతి పరిణామాల్లో ఆయన పూర్తిగా ఉద్యోగాన్నే వదులుకొనేలా పాచికలు కదిపిన కేంద్ర పాలకులు ఆ ఉదంతం మీద వచ్చిన విమర్శలను దులిపేసుకున్నారని ఏ మాత్రం గుణపాఠం నేర్చుకోలేదని అనిపించడం సహజం. ఇటు సిబిఐని అటు ఇడిని రాజకీయ ప్రత్యర్థుల మీద కక్ష సాధింపు కోసం ప్రయోగిస్తున్నారన్న విమర్శను ఎదుర్కొంటున్న వారే తమకు ఇష్టం లేని పరిణామం తారసపడడంతో దర్యాప్తు జరపవలసిన తీరు మీద ఆ సంస్థలకు నీతులు చెప్పడం తెడ్డు నాకిన అత్త కోడలికి బుద్ధి చెప్పిన విధంగా ఉంది. సిబిఐతో ఈ విధంగా వరుసగా క్రూర క్రీడ సాగించడం ఈ సువిశాల దేశంలో ప్రజాస్వామిక దర్యాప్తు వ్యవస్థను కాలరాయడమే అవుతుంది.

ఎన్నికల ముందు దమనకాండ



భీమా కోరెగాంవ్ హింసాకాండ తర్వాత రిజిష్టరైన కేసుల్లో రాజకీయ స్వభావం కలిగిన వాటన్నింటినీ ఉపసంహరిస్తున్నామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి గత మార్చి 13వ తేదీన రాష్ట్ర అసెంబ్లీలో చెప్పారు. మొత్తం 655లో 592 కేసులను వెనక్కి తీసుకుంటున్నట్లు నవంబరులో చెప్పారు. అంటే 90 శాతం కేసులు ఉపసంహరిస్తున్నట్లే అనుకున్నారంతా.

కాని ఒక సంవత్సరం తర్వాత పరిస్థితి అది కాదు. ముఖ్యమంత్రి ప్రకటనలకు విరుద్ధంగా మహారాష్ట్ర పోలీసులు తనిఖీ చర్యలు చేపట్టారు. రాజకీయ నాయకులను, కార్యకర్తలను విచారణకు పిలవడం, నిర్బంధించడం మొదలైంది. కుల నిర్మూలన కార్యకర్తలు, రాజకీయ నాయకులు ఈ హఠాత్తు చర్యలకు నిర్ఘాంతపోయారు. సార్వత్రిక ఎన్నికలకు కేవలం మూడు నెలల ముందు రాజకీయ దురుద్దేశాలతో ఈ చర్యలు చేపట్టారనే ఆరోపణ వినవస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పూనా, పింప్రి చించ్వాడ్, ఔరంగాబాద్, నాందేడ్, ముంబయిల నుంచి 200 మంది కార్యకర్తలకు సమన్లు అందాయి. వారిపై ఉన్న కేసులకు సంబంధించి పోలీసు స్టేషనో, కోర్టుల్లో హాజరు కావాలని సమన్లు జారీ అయ్యాయి. దాదాపుగా వీళ్ళందరు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలె), బహుజన సమాజ్ పార్టీ, భారిప్ బహుజన్ మహాసంఘ్, బహుజన్ రిపబ్లిక్ సోషలిస్ట్ పార్టీ వంటి రాజకీయ పార్టీలకు చెందిన వారే.

కొందరు కార్యకర్తలకు కోర్టు సమన్లతో పాటు, నగర బహిష్కరణ ఉత్తర్వులు కూడా అందాయి. ఏడాది పాటు పట్టణంలో ప్రవేశించరాదన్న నిషేధాజ్ఞలు ఇవి. అలాంటివారిలో సురేష్ నికలే ఒకడు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలె)కు చెందిన వాడు. అక్రమ సమావేశం, అల్లర్లకు సంబంధించి మూడు కేసులు ఇతనిపై ఉన్నాయి. పట్టణంలో ప్రవేశించరాదన్న నిషేధాజ్ఞలు ఇతనిపై జారీ చేశారు. ఒక రాజకీయ నాయకుడిగా ప్రజా ప్రతిఘటన కార్యకలాపాల్లో ఇలాంటి కేసులు నమోదు కావడం సహజమే, కాని భీమా కోరెగాంవ్ అల్లర్ల తర్వాత రాజకీయ స్వభావమున్న కేసులన్నీ ఉపసంహరిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. కాని ఇప్పుడు రాజకీయంగా చురుకుగా ఉన్న ప్రతివ్యక్తిని గుర్తించి, వేధించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని, ఇది రాజకీయ కక్ష సాధింపని సురేష్ నికలే విమర్శించాడు. పోలీసు నోటీసు వచ్చిన వెంటనే అతను జవాబు ఇచ్చాడు, కాని ఆ ప్రాంతంలో అతనివల్ల శాంతిభద్రతలు దెబ్బతింటాయంటూ అతని జవాబును తిరస్కరించడం జరిగింది.

ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీన లక్షలాది అంబేద్కరిస్టులు భీమాకోరెగాంవ్‌లో సమావేశం కావడం జరుగుతూ వస్తున్నదే. 1818లో పీష్వా వంశానికి చెందిన బ్రాహ్మణ రాజు రెండవ బాజీరావుపై బ్రిటీషు సైన్యం యుద్ధం చేసి విజయం సాధించింది. అప్పుడు బ్రిటీషు సైన్యంలో సైనికులందరు దళితులే. ఈ యుద్ధం జరిగి 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గత సంవత్సరం భీమా కోరెగాంవ్‌కు మామూలు కన్నా ఎక్కువ మంది దళితులు వచ్చారు. కాని ఈ దళితులు సమావేశ స్థలం చేరుకోకుండా మనోహర్ అలియాస్ శంభాజీ భిండే, మిలింద్ ఎక్బోటేలకు చెందిన హిందూత్వ సంస్థ కార్యకర్తలు దాడి చేశారు. వీరిద్దరిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంబేద్కరిస్టులపై ఈ సందర్భంగా నమోదైన కేసులను పరిశీలించడానికి అక్టోబర్ 23న మహారాష్ట్ర హోం శాఖ ఒక కమిటీ ఏర్పాటు చేస్తానని చెప్పింది. ఈ సందర్భంగా కేసుల పురోగతిలో మూడు ముఖ్యమైన అంశాలు దృష్టిలో ఉంచుకుంటామన్నారు. ఉద్దేశపూర్వకంగా ఎవరిపైనైనా జరిగిన దాడులు, పది లక్షల కన్నా ఎక్కువ ప్రజా ఆస్తులకు నష్టం కలిగిన కేసులు, పోలీసులపై దాడులు జరిగిన కేసులు. ఇలాంటి కేసుల్లోనే తదుపరి విచారణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కమిటీలో జిల్లా పోలీసు అధిపతి, ఒక సబార్డినేట్ అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివిధ కేసులను పరిశీలిస్తారు. వాటిని తదుపరి విచారణకు తీసుకోవాలా లేదా అన్నది నిర్ణయిస్తారు. కాని ఈ కమిటీ అస్సలెప్పుడూ సమావేశమే కాలేదని వార్తలు వచ్చాయి.

పింప్రీ చించ్వాడ్‌లో నమోదైన ఆరు కేసుల్లో విచారణ కొనసాగుతూనే ఉంది. ఈ కేసులన్నీ సీరియస్ కేసులని విచారణ చేయవలసిన కేసులేనని అక్కడి పోలీసులు అంటున్నారు. కాని వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని వార్తలు వచ్చాయి. అక్రమ సమావేశం వంటి కేసులో అరెస్టయిన ప్రవీణ్ వాకోడే కేసు సీరియస్ దేమీ కాదు, అయినా అతనిపై పోలీసులు చర్య తీసుకుంటున్నారు. భారతీయ రిపబ్లికన్ యువ మోర్చా అధ్యక్షుడు, భీమా కోరెగాంవ్ హింసాకాండకు ప్రత్యక్ష సాక్షి అయిన రాహుల్ దంబాలే వంటి వారు ఈ వైఖరిని విమర్శిస్తున్నారు. ఇచ్చిన హామీకి విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కార్యకర్తలను కేసుల్లో ఇరికిస్తున్నారని దంబాలే అన్నాడు. కొందరిపై రెండు మూడు కేసులున్నాయి. అవన్నీ బెయిలబుల్ కేసులే. కాని, ఈ కేసులన్నింటినీ కలిపి, ఆ వ్యక్తి మంచి వాడు కాడని, లేనిపోని తలనొప్పి కలిగిస్తాడని పోలీసులు ఆరోపణలు చేస్తున్నారు. ప్రతి జిల్లాలోను పోలీసులు రాజకీయ కార్యకర్తలను గుర్తించడం జరిగిందని దంబాలే అన్నాడు. కేసుల విచారణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు కేవలం భీమా కోరెగాంవ్ హింసాకాండకు సంబంధించింది మాత్రమే కాదు, 2017, 2018లో మరాఠాల ఉద్యమానికి సంబంధించిన కేసుల విచారణకు కూడా చెందినది. కాని ఆ కేసులన్నింటినీ అటకపైకెక్కించారని దంబాలే అంటున్నాడు. కేవలం ఒక్క పింప్రి ఛించ్వాడ్‌లో మాత్రమే మరాఠా ఉద్యమానికి సంబంధించిన ఐదు కేసుల విచారణ కొనసాగుతోంది. మరెక్కడా జరగడం లేదన్నాడు. కార్యకర్తలపై చర్యలు తీసుకోడానికి చురుకుగా పనిచేస్తున్న పోలీసులు, భీమా కోరెగాంవ్ అల్లర్లలో జనవరి 1వ తేదీ నాటి దాడులకు కారకులుగా అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదైన భిండే, ఎక్బోటేలపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. మరో వైపు కార్యకర్తలపై అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి వారిపై చర్యలు తీసుకుంటున్నారు. తొమ్మిది మంది ప్రముఖ హక్కుల కార్యకర్తలపై చర్యలు మొదలయ్యాయి. ఆనంద్ టెల్తుండే అరెస్టుకు కూడా రంగం సిద్ధమైంది. భీమా కోరెగాంవ్ హింసాకాండకు సంబంధించి దళితులు నమోదు చేసిన కేసులు దాదాపు 20 ఉంటాయి. అందులో దాదాపు 100 మంది నిందితుల పేర్లున్నాయి. కాని పోలీసులు వారిపై చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు దళితులపై రిజిష్టరైన కేసుల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. కేసుల ఉపసంహరణ పేరుతో కార్యకర్తలను పోలీసు స్టేషన్లకు పిలిపించి నేరం ఒప్పుకోవాలంటూ బలవంతం చేస్తున్న ఆరోపణలు బలంగా వచ్చాయి. నేరం ఒప్పుకుని, భవిష్యత్తులో ఎలాంటి ఆందోళనల్లో పాల్గొనకుండా హామీ రాసివ్వాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్నారన్న విమర్శలు కూడా వచ్చాయి. ఈ కేసులు రాజకీయ స్వభావమున్నవిగా భావిస్తే నేరం ఒప్పుకోవడం అనే ప్రశ్నే ఉండదని, దేశంలో ప్రభుత్వ వైఖరిపై ఆందోళన చేసే హక్కు ప్రతి పౌరుడికి ఉందని కార్యకర్తలు వాదిస్తున్నారు. ఏది ఏమైనా సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ పరిణామాలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి.

* సుకన్య శాంత (ది వైర్)

స్వాతంత్ర్యానంతర వైజ్ఞానిక ప్రగతి



డా. దేవరాజు మహారాజు
9573706806

వైజ్ఞానిక రంగంలో మన దేశం ఈ రోజు ప్రపంచంలో తలెత్తుకుని నిలబడిందంటే అందుకు కారణం మన తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూయే. ఆయన వైజ్ఞానిక స్వాప్నికుడి, నిరీశ్వర వాది, హేతువాది, గొప్ప దార్శనికుడు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాల్ని త్యాగం చేసిన త్యాగధనులు ఆ కాలంలో ఎంతో మంది ఉన్నారు. కాని, ఎవరికీ లేని వైజ్ఞానిక దృక్పథం, పట్టుదల కార్యదీక్ష ఉన్నందువల్లనే జవహర్ లాల్ నెహ్రూ ఈ దేశానికి తొలి ప్రధాని – దేశ నిర్మాత కాగలిగారు. గాంధీజీని 'జాతిపిత'గా దేశం గుర్తుంచుకుంది. అలాగే జాతి నిర్మాతగా నెహ్రూని గౌరవించుకుంది. బ్రిటీష్ వారు ఇండియాను వదిలి వెళ్లిన తర్వాత, ఈ దేశ పరిస్థి ఎలా ఉంది? మూడు వందల ఏళ్లు నివాసముండి, ఇల్లు ఖాళీ చేసి పోయినట్లుగా అస్తవ్యస్తంగా, చిందరవందరగా, అస్థిరంగా ఉంది. అన్నీ చక్కదిద్దుకుంటూ, చాకచక్యంగా అన్ని రంగాల్ని సంఘటిత పరుస్తూ దేశాన్ని పునర్నిర్మించారు నెహ్రూ! దేశం నిండా చిన్నచిన్న సంస్థానాలు రాజ్యమేలుతున్నప్పుడు వాటిని ఒక్కతాటిపైకి తెచ్చి విశాల భారతానికి రూపకల్పన చేశారు. సంస్థానాల్ని విలీనం చేసుకున్న ఘనత అంతా వలభ్ భాయ్ పటేల్‌దేనంటూ ఇప్పటి ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తూ ఉంది. ఇంతిత జ్ఞానంతో ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. పటేల్‌ను మనం ఏ మాత్రం తక్కువ చేసి మాట్లాడాల్సిన అవసరం లేదు గానీ, ఆయన నెహ్రూ కేబినెట్‌లో హోమ్ మినిస్టర్ మాత్రమే! ప్రధానికి తెలియకుండా ఏ హోమ్ మంత్రీ నిర్ణయాలు తీసుకోడు. వాటిని అమలు చేయలేడు. పండిట్ నెహ్రూ అనుమతి, అంగీకారం లేకుండానే పటేల్ దేశ సమైక్యతకు కృషి చేశారనడం అర్ధ సత్యం. అలాగే కశ్మీర్ విషయంలో నెహ్రూ తప్పు చేశారని నేటి ప్రభుత్వ పెద్దలు డప్పు కొట్టడమూ అర్ధ సత్యమే. నిజంగా అది తప్పయితే నాటి హోమ్ మంత్రి పటేల్ బాధ్యత కూడా అందులో ప్రధానంగా ఉంటుంది.

రాజకీయాలు పక్కన పెట్టి, నెహ్రూ జీ ఎందుకు దార్శనికుడయ్యారో చూద్దాం. ముందు చూపుతో ఈ దేశానికి కావల్సినవన్నీ సమకూర్చి వాటిని పటిష్ట పరచడానికి నిరంతరం కృషి చేసిన వాడాయన. ఆయన దేశ ప్రధానిగా ఉన్న పదిహేడేళ్ల కాలంలో 'భారత దేశ ఆధునిక దేవాలయాలు' అనదగిన ఎన్నో ప్రాజెక్టులు పూర్తి చేశారు. ఆయన కాలంలోనే అవన్నీ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పండిట్ నెహ్రూ వైజ్ఞానిక స్పృహ గల ప్రధాని గనుక, ఈ దేశ ప్రజలకు విద్య అవసరమని, మరీ ముఖ్యంగా వైజ్ఞానిక విద్య– పరిశోధన చాలా అవసరమని గుర్తించారు. ఆయన తీసుకున్న చొరవ వల్లనే దేశమంతటా శాస్త్ర పరిశోధనా శాలలు విస్తృతంగా అభివృద్ధి అయ్యాయి. ఇప్పుడు దేశంలో ఉన్న ప్రముఖ వైజ్ఞానిక సంస్థను దేన్ని తీసుకున్నా, దాని నేపథ్యంలో నెహ్రూయే కనిపిస్తారు.

ఉదాహరణకు ప్రస్తుతం విజయ దుందుభి మోగిస్తున్న ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ISRO); బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (BARC); కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (CSIR); నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (NRSC); నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (NGRI); ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ ఏరిడ్ ట్రాపిక్స్ (ICRISAT); టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (TIFR); వంటి ముఖ్యమైన పరిశోధనా కేంద్రాలన్నింటికీ రూపకల్పన చేసింది, ప్రారంభించింది, అవి సజావుగా నడవడానికి స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని ముఖ్యంగా ఆర్థిక వనరుల్ని సమకూర్చింది మన తొలి ప్రధాని నెహ్రూయే. అంతేకాదు, రక్షణ శాఖకు సంబంధించిన ఎన్నో పరిశోధనా కేంద్రాలకు నెహ్రూ ఊతమిచ్చారు. డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబోరేటరీ (DERL); డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ (DRDL); డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO); హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL); వంటివి మరెన్నో ఉన్నాయి. స్వాతంత్ర్యం లభించిన తొలి నాళ్లలో భారతదేశ పరిస్థితి తుపానులో కొట్టుకొచ్చిన మొక్క లాంటిది. దాన్ని నిలకడగా ఉంచి, నారు – నీరు పోసి, వ్రేళ్లు భూమిలో నాటుకునేట్టు చేసిన,నిటారుగా నిలబెట్టడం ఆశామాషీ కాదు. ఎంతో అంకిత భావం కావాలి.

పరాయి పాలనలో అస్తిత్వాన్ని కోల్పోయిన ఈ దేశం సర్వస్వతంత్రంగా నిలదొక్కుకోవడానికి, ఎదిగి మహావృక్షమై విస్తరించడానికి తొలినాళ్లలో నెహ్రూ చేసిన ప్రయత్నం అసామాన్యం. ఆయనలోని వైజ్ఞానిక దృక్పథం, లలితకళల పట్ల గల మక్కువ, పిల్లలంటే ఉండే ప్రేమ ఆయనతో ఎన్నో పనులు చేయించింది. సాహిత్య, సాంస్కృతిక అకాడెమీలు, బాలల అకాడెమీ వంటి ఇతర జాతీయ సంస్థలన్నింటినీ ప్రారంభించి, నిలబెట్టింది నెహ్రూనే. అర్ధ శతాబ్దానికి పైగా నిరంతరం పరిశోధనలకు అంకితమైన ఈ జాతీయ పరిశోధనా సంస్థలకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా కేటాయించే నిధులే ఇవ్వలేకపోతూ ఉంది. ఇది నేటి దుస్థితి! పైగా ప్రైవేటు సంస్థల నుండి, వ్యక్తుల నుండి ఆర్థిక వనరులు సంపాదించుకోవాలని సూచిస్తోంది. ఎందుకంటే ఈ ప్రభుత్వానికి యోగులు, సాధువులు, బాబాలు తప్ప వైజ్ఞానికులు కనబడడం లేదు. నెహ్రూజీకి ఉన్న వైజ్ఞానిక దృక్పథం ఆర్‌ఎస్‌ఎస్‌కు, దాని అనుబంధ సంస్థలకు నచ్చదు. అందుకే ఆయనను, ఆయన కృషిని తక్కువ చేసి అవి మాట్లాడుతూ ఉంటాయి. వెనక్కి నడిచే వాడికి ముందుకు పోయేవాడు నచ్చడు కదా?

బాక్రానంగల్, సట్లజ్, హీరాకుడ్, మహానది, నాగార్జునసాగర్ వంటి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే అయ్యాయి. గంగ, యమున, కావేరి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, కృష్ణా నదులపై ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది ఆయన హయాంలోనే. వాటివల్ల దేశంలో హరిత విప్లవం సాధ్యమైంది. తాగునీరు దొరికింది. సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగాయి. వ్యవసాయ రంగమే కాదు, పారిశ్రామిక రంగంలోనూ నెహ్రూ నేతృత్వంలో ఈ దేశం గణనీయమైన ప్రగతిని సాధించింది. బొకారో, జంషెడ్‌పూర్, రూర్కేలా, హిందుస్థాన్ జింక్ వంటి ఉక్కు పరిశ్రమలు, నాల్కో (NALCO) వంటి అల్యూమినియం పరిశ్రమలు, ఒఎన్‌జిసి (ONGC) వంటి చమురు కేంద్రాలు, దేశ వ్యాప్తంగా ఎన్నో ఓడరేవులు నెహ్రూ చొరవతో నిర్మాణమై దేశాన్ని అన్ని విధాలా నిలబెట్టాయి. దేశ అవసరాలు పూర్తి చేయడమే కాకుండా ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేసే దశకు చేరుకున్నాయి. వైద్యానికి, ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులు దేశంలోనే తయారు కావాలన్నది ఆయన ఆశయం. దాన్నే ఆయన సాధించారు కూడా!

దేశానికి ఊపిరులూదిన పండిట్ నెహ్రూ కృషిని తక్కువ చేసి మాట్లాడే వారు చారిత్రక సత్యాలు తెలుసుకుంటే మంచిది. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలో ప్రతిపక్షంలో మహానుభావులెంతో ఉంది ఉండేవారు. ఎన్నో విమర్శలు చేసేవారు. అవి పనికొచ్చేవయితే ఆయన తప్పకుండా ఆలోచించేవారు. కార్టూనిస్ట్ శంకర్‌ను దగ్గరకు పిల్చుకుని ''శంకర్ నువ్వు స్వేచ్ఛగా, సహేతుకంగా విమర్శించు. అధికారంలో ఉన్న మా అహంకారాన్ని ఎప్పటికప్పుడు వదిలిస్తూ ఉండు'' అని సలహా ఇచ్చారు. అలాంటి సంస్కారం ఇప్పటి నాయకులకు ఎందుకు లేదూ? నర్మదా నది పరీవాహక ప్రాంతంలో డెబ్బయి రెండు గ్రామాల్ని ఊడ్చేసి, వేల మంది నిర్వాసితుల్ని పట్టించుకోకుండా ఎత్తయిన పటేల్ విగ్రహం స్థాపించినంత మాత్రాన, అది ఈ దేశంలో తొలి ప్రధాని స్థానాన్ని తగ్గించగలదా? ఎవరెన్ని చెప్పినా పటేల్ నెహ్రూ దగ్గర పని చేసిన హోమ్ మినిస్టర్ మాత్రమే. దార్శనికుడిగా, వైజ్ఞానిక ద్రష్టగా పటేల్‌ను ఎవరూ గుర్తు పెట్టుకోలేదు. అయినా ప్రజలు ప్రేమతో, గౌరవంతో తాము ఏర్పాటు చేసుకున్న విగ్రహాల ఎత్తు ముందు, జనాన్ని హింసించి, ప్రభుత్వాలు నెలకొల్పే విగ్రహాల ఎత్తెంత? ఆలోచిస్తే విషయం చాలా లోతైంది!

స్వాతంత్ర్య సమరంలో తలమునకలై ఉన్న నెహ్రూకు కూతురు ఇందిరను పెంచడం చాలా కష్టమైంది. ఎందుకంటే ఆయన భార్య కమల యవ్వన దశలోనే కన్ను మూశారు. జైలు నుండి ఆయన కూతురికి ఉత్తరాలు రాశారు. అందులో దేశ భూ, భౌతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల గూర్చి అనేక విషయాలు రాశారు. ఆ ఉత్తరాలే 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గా – పుస్తకం వెలువడింది. దాని ఆధారంగా చిత్ర దర్శకుడు శ్యాం బెనెగల్ టివి సీరియల్ తీశారు. పిల్లలపట్ల ఆయనకు గల ప్రత్యేకమైన శ్రద్ధ, ప్రేమల వల్ల ఎన్నో సంస్థలకు, ప్రాజెక్టులకు ఆయన రూపు దిద్దారు. చాచా నెహ్రూగా శాశ్వతత్వం పొందారు. పిల్లలు పెద్దవాళ్లవుతారు, ముసలివాళ్లు కూడా అవుతారు. తరాలు మారినా పండిట్ నెహ్రూ మాత్రం చాచా నెహ్రూగానే పిలవబడుతారు. ఆయన పుట్టిన రోజు 14 నవంబర్ ను పిల్లల దినంగా జరుపుకుంటున్నాం. జాతీయ సంస్థల్ని ప్రారంభించి నిలబెట్టింది నెహ్రూ జీ అయితే, అన్ని వ్యవస్థల్ని ధ్వంసం చేసింది మోడీజీ. తొలి ప్రధాని నుండి ఇటీవలి కాలం వరకు ఏ ప్రధానీ చేయని 'ఘన'మైన పనులు ఇప్పటి ప్రధాని చేశారు. నిజమే.. ఈయన నిరంతర ప్రపంచ పర్యాటకుడు. ఈ దేశానికేమో పార్ట్ టైం ప్రైం మినిష్టర్! ఈయనకు ఇక్కడి దేశ ప్రజల సమస్యలు పరిష్కరించడం కన్నా విదేశాలకు వెళ్లి తీసుకునే సెల్ఫీలంటే ఇష్టం! ఏమీ మాట్లాడలేక వారసత్వ పాలనకు నెహ్రూయే కారణమంటారు. ఆయన మరణానంతరం జరిగిన సంఘటనకు ఆయన ఎలా బాధ్యుడవుతారూ? పటేల్ విగ్రహం స్థాపించారు. ఐక్యతా విగ్రహం అన్నారు బావుంది. ప్రారంభోత్సవ సభలో నేటి హోమ్ మంత్రి కనబడలేదు. విగ్రహం తొలి హోం మంత్రిది కదా? పైగా వేల సంఖ్యలో మత గురువుల్ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అసలది, మతానికేం సంబంధం?

ఆ రోజుల్లో ఆసేతుహిమాచలం స్వాతంత్ర్య సమర యోధులు లక్షల మంది ఉండి ఉంటారు. వారందరిలోకి నాయకత్వ లక్షణాలు, చురుకుదనం, విశాల భావాలు, అభ్యుదయ ధోరణి, విదేశాంగ విధానాల మీద పట్టు, చదువు, సంస్కారం అన్నిటినీ పుణికి పుచుకుని ఉన్నారు గనక నెహ్రూ తొలి ప్రధాని కాగలిగారు. సుదీర్ఘ కాలం ఆ పదవిలో మనగలిగారు. మనిషిలో ఎంతో సంయమనం ఉంటేగాని అలా నిలబడలేరు. మూఢ నమ్మకాల్లోంచి బయటపడాలని దేశ ప్రజలకు చెపుతూనే ఉండేవారు. ధనం, స్థాయి, స్థోమత ఏమీలేని వాడు త్యాగం చేయడానికి ఏముంటుందీ? కాని, నెహ్రూజీకి ఇవన్నీ ఉండి కూడా అన్నింటినీ త్యజించి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడం గొప్ప! పైగా కశ్మీర్ పండిట్ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వాడై ఉండి, నిరీశ్వర వాది కావడం అంతకన్నా గొప్ప!!

భారత రత్నాలు

భారత ప్రభుత్వం ప్రకటించే దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారమే భారతరత్న. పలు రంగాలలో దేశానికి అత్యున్నత సేవలు అందించిన పౌరులను గుర్తించి, వారికి ప్రధానమంత్రి , రాష్ట్రపతి సూచనల ఆధారంగా కేంద్ర కేబినేట్ భారత రత్న అవార్డులను ప్రకటిస్తుంది. ఈ అవార్డును 1954 నుండి ఒక సంవత్సరంలో ముగ్గురికి మాత్రమే అందజేయాలన్న పరిమితులతో ఏర్పాటు చేశారు. మొదటగా ప్రతి సంవత్సరం ముగ్గురిని సత్కరించడం, తర్వాత ఇద్దరు, ఒకరు అలా తోచినట్లుగా ఇస్తూ వస్తున్నారు. మధ్యలో కొన్ని అనివార్య కారణాల వలన ఇవ్వలేకపోవడం, వీటిపై కూడా కొన్ని విమర్శలు లేకపోలేదు. ఏది ఏమైనప్పటికి దేశంలో సేవలందించే వారిని ఈ పురస్కారంతో సత్కరించుకోడం మన అదృష్టంగా భావించక తప్పదు. దేశంలో అత్యున్నతమైన ఈ పురస్కార గ్రహీతలకు రాష్ట్రపతి సంతకం చేసిన ధ్రువపత్రం, ఒక మెడల్ బహూకరిస్తారు. రావి ఆకు రూపంలో ఉన్న మెడల్‌పై ప్రకాశిస్తున్న సూర్యుని బొమ్మ ఉంటుంది. దాని క్రింద భారత రత్న అని హిందీలో వ్రాసి ఉంటుంది. ఈ అవార్డుతో ఎలాంటి నగదు అందజేయరు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 18 (1) ప్రకారం ఈ అవార్డును ఎట్టి పరిస్థితిలోనూ గ్రహీతలు తమ పేర్ల ముందు ప్రదర్శించు కోరాదు, అవసరమైతే గ్రహీతలు తమ బయోడేటా , లెటర్ హెడ్, విజిటింగ్ కార్డులపై రాష్ట్రపతి నుంచి భారత రత్న అందుకున్న 'భారత రత్న అవార్డు గ్రహీత' అని ముద్రించుకోవచ్చు. అవార్డు ప్రారంభించినాటి నుండి సత్కరించుకున్న వారిని ఒక్కసారిగా మననం చేసుకుంటే. 1954లో సర్వేపల్లి రాధా కృష్ణన్, చక్రవర్తుల రాజా గోపాలా చారీ, డా. సి.వి. రామన్. 1955లో డా.భగవాన్ దాస్, డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, జవహర్ లాల్ నెహ్రూ. 1957 లో గోవింద్ వల్లభ్ పంత్. 1958 లో దొండో కేశవ కార్వే. 1961లో పురుషోత్తమ దాస్ టాండన్, డా. బి.సి. రాయ్. 1962లో డా. రాజేంద్ర ప్రసాద్. 1963లో డా. జాకీర్ హుస్సేన్, పాండురంగ వామన్ కానే. 1966లో లాల్ బహదూర్ శాస్త్రీ. 1971లో ఇందిరా గాంధీ. 1975లో వి.వి. గిరి. 1976లో కె. కామరాజు. 1980లో మదర్ థెరిస్సా. 1983లో ఆచార్య వినోబా భావే. 1987లో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్. 1988లో ఎం.జి.రామచంద్రన్. 1990లో డా. బి.ఆర్. అంబేద్కర్, నెల్సన్ మండేలా. 1991లో రాజీవ్ గాంధీ, మొరార్జీ దేశాయ్, వల్లభాయ్ పటేల్. 1992లో మౌలాన అబుల్ కలామ్ ఆజాద్, జెఆర్‌డి టాటా, సత్య జిత్ రే, సుభాష్ చంద్ర బోస్ (చంద్ర బోస్‌కు సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఉపసంహరణ). 1997 లో ఏ.పిజె. అబ్దుల్ కలామ్, గుల్జారీలాల్ నందా, అరుణా అసఫ్ అలీ. 1998లో ఎమ్మెస్ సుబ్బలక్ష్మీ, సి. సుబ్రమణ్యం, జయప్రకాశ్ నారాయణ్. 1999లో రవిశంకర్, అమర్త్యసేన్, గోపినాథ్ బోర్డోలాయ్. 2001లో లతా మంగేష్కర్, బిస్మిల్లా ఖాన్. 2008లో భీమ్ సేన్ జోషి. 2014 లో సచిన్ టెండూల్కర్, సిఎన్ఆర్ రావు. 2015లో మదన్ మోహన్ మాలవ్య, అటల్ బిహారీ వాజపేయి. 2019 లో ప్రణబ్ ముఖర్జీ, నానాజీ దేశముఖ్, భూపెన్ హజారికా.

ప్రణబ్ ముఖరీ

ఈయన పశ్చిమ బెంగాల్ లోని బీర్భుమ్ జిల్లా మిరాటీ గ్రామంలో బెంగాలీ కులీన కుటుంబంలో కింకర ముఖర్జీ రాజ్యలక్ష్మి దంపతులకు 1935 డిసెంబర్ 11 న జన్మించారు . కలకత్తా విశ్వవిద్యాలయానికి అనుబంధంగానున్న సూరి పూర్తి చేశారు. దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా భారత జాతీయ కాంగ్రెస్‌లో పలు పదవులు అధిరోహించి సీనియర్ నాయకుడిగా పేరొందారు. 2009 నుంచి 2012 వరకు కేంద్ర ఆర్థిక మంత్రి పదవి అధిరోహించి, ఆ తర్వాత పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి 2012 నుండి 2017 వరకు భారత దేశానికి 13 వ రాష్ట్రపతి సేవలందిందించడం జరిగింది.

నానాజీ దేశముఖ్

ఈయన మహారాష్ట్రంలోని కదోలి అండ్ చిన్న గ్రామం లో బ్రాహ్మణ కుటుంబంలో 11 అక్టోబర్ 1916లో జన్మించారు. సింకార్‌లో ఉన్నత విద్య పూర్తి చేసి, బిర్లా కళాశాలలో కాలేజీ విద్యనభ్యసించి, బాల్యంలోనే లోకమాన్య బాలా గంగాధర్ తిలక్‌కు ఆకర్షితులై, ఆర్.ఎస్.ఎస్.లోకి ప్రవేశించి అంచలంచలుగా ఎదుగుతూ, తన కంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకోవడం జరిగింది. మొదట ఉత్తరప్రదేశ్‌కు ప్రచారక్‌గా వెళ్లి పలువురు ఉత్తములతో పరిచయం తనని శిఖరాలకధిరోహించింది. దేశంలో విద్య ప్రా ముఖ్యతను గ్రహించిన నానాజీ పలు విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేయడంలో భాగంగా 1950 లో గోరఖ్ పూర్‌లో సరస్వతి శిశు మందిర్ స్థాపన. చిత్తర కోట్ లవ్ చిత్తరకోట్ గ్రామోదయి విశ్వ విద్యాలయం స్థాపన.గ్రామీణ యూనివర్సిటీకి ఛాన్సలర్ బాధ్యతలు నిర్వహించారు. జ్ఞానేశ్వర్ అవార్డు, పద్మ విభూషణ్ పొందారు, 2010 ఫిబ్రవరి 27 తుది శ్వాస విడిచారు.

భూపేన్ హజారిక

ఈయన అస్సాం రాష్ట్రంలోని సరియాలో నీలకంత, శాంతిప్రియ దంపతులకు 8 సెప్టెంబర్ 1926 లో జన్మించారు . గౌహతి, దుబ్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1940 లో ఉన్నత విద్య, 1942 లో కాటన్ కాలేజీలో ఇంటర్ మీడియేట్, 1944 లో బి.ఎ., 1946 లో బాంబే హిందు యూనివర్శిటీలో ఎం.ఎ. పొలిటికల్ సైన్స్ పూర్తిచేసి స్కాలర్‌షిప్ సహాయంతో న్యూయార్క్ కొలంబియా యూనివర్శిటీలో ఇండియన్ బేసిక్ ఎడ్యుకేషన్ టూ యూజ్ ఆడియో విజువల్ టెక్నిక్ ఇన్ అడల్ట్స్ ఎడ్యుకేషన్‌లో 1952 లో పిహెచ్‌డి పూర్తిచేశారు. మెజిషియన్, సింగర్, కవి, ఫిల్మ్ మేకర్‌గా ప్రసిద్ధి గాంచినది. హజారికా ఎన్నో రుదలి, దార్మియాన్, గజా, గమిని, డామన్ బాలీవుడ్ చిత్రాలతో పాటు అనేక అస్సామీ సినిమాలకు సంగీతం అందించారు. బెంగాలీ, హిందీ పాటలను రచించి పాడారు. తన జీవితంలో ఎక్కువ సమయాన్నీ ఆల్ ఇండియా రేడియోలో పని చేశారు. మొదటగా బిజెపి పార్టీ తరుపున లోకసభ స్థానానికి పోటీ చేసి ఓటమిపాలు అయ్యారు. ఆ తర్వాత 1967, 72లో స్వతంత్ర అభ్యర్థిగా శాసన సభకు పోటీ చేసి గెలుపొంది పలు సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది. చివరగా 5 నవంబర్ 2011న కన్నుమూశారు.

* పోలం సైదులు
944193036

సకుటుంబం

ఆమె అందరిలాంటి సాధారణ తెలుగమ్మాయి. చిన్నప్పటి నుండి సంగీతం, నాట్యం మీద మక్కువతో నేర్చుకుంటూ ఆడుతూపాడుతూ చదువుకుంటూ ఉండేది. కాని ఆ అమ్మాయే మొన్న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో ప్రప్రథమంగా 144 మంది పురుష జవాన్ల బృందాన్ని ముందుండి నడిపించింది. సంప్రదాయ నృత్యం, సంగీతం, చదువు, కుటుంబమే తన ప్రపంచంగా గడిపిన ఈ అమ్మాయి పొడుగాటి జుట్టుని కత్తిరించుకుని, నాట్య ముద్రలు పట్టిన చేతులతో రైఫిల్ పట్టి దేశరక్షణే లక్ష్యంగా వడివడిగా అడుగులు వేస్తోంది. ఆమే హైదరాబాదుకు చెందిన లెఫ్టినెంట్ భావనా కస్తూరి.

దేశం తర్వాతే ఏదైనా..



భారతీయ సైన్యంలోని 'ఆర్మీ సర్వీస్ కారప్స్' అనేది సైన్యంలో ఓ విభాగం. 257 ఏళ్ల క్రితం బ్రిటీషువాళ్లు ప్రారంభించిన ఈ రెజిమెంట్ భారతీయ సైన్యంలోని అతి పురాతనమైనది. ఈ విభాగం భారత సైన్యానికి లాజిస్టిక్స్ సహకారం అందిస్తుంది. సైన్యంలో ఆర్మీ సర్వీస్ కారప్స్‌లో ఆఫీసర్‌గా పని చేస్తోన్న భావన గణతంత్ర దినోత్సవంలో పాల్గొంటున్న ఈ విభాగపు బృందాన్ని నాయకత్వం వహించిన తొలి మహిళ.

హైదరాబాదులో పుట్టి పెరిగిన భావన వాళ్లది సంప్రదాయ కుటుంబం. తండ్రి సీసీఎంబీ ఉద్యోగి. తల్లి స్టెనోగ్రాఫర్. చిన్నప్పటి నుండి నాట్యం, సంగీతం అంటే చాలా ఇష్టం. సాధన చేయడం, ప్రదర్శనలు ఇవ్వడమే తన ప్రపంచంగా బతికింది. చదువుతో పాటు ఈ రెండింటిలోనే భవిష్యత్తును ఊహించుకుంది భావన. అయితే చదువుకుంటున్నప్పుడు సైన్యం గురించి విన్న భావన సైన్యంలో చేరాలనుకుంది. అప్పటికే డిగ్రీలో తను ఎన్‌సీసీలో చేరింది. సైన్యంలో చేరడానికి షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికలు జరుగుతాయని తెలుసుకుంది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా కొన్ని వేలమంది ఈ పరీక్షలు రాసినా అవకాశం మాత్రం నలుగురికే వస్తుందని తెలుసుకున్న ఆమె... ఆ పరీక్షలో అర్హత సాధించేందుకు ప్రణాళికలు వేసుకుంది. అప్పటికే డిగ్రీ పూర్తిచేసిన భావన ఓ వైపు ఆ పరీక్షలకు సిద్ధమవుతూనే... మరోవైపు సమయం వృథా కాకుండా ఉస్మానియాలో ఎంఎస్సీ మైక్రోబయాలజీలో చేరింది. మొదటిసారి ఎంతో ఉత్సాహంగా పరీక్షలు రాసింది. అవకాశం వస్తుందని అనుకుంది. కానీ రాలేదు. మరో రెండుసార్లు ప్రయత్నించినా సాధించలేకపోయింది. అయినా పట్టు వదల్లేదు. నాలుగోసారి ప్రయత్నించింది. ఈసారి పలు ఇంటర్వ్యూలు, వడపోతల అనంతరం నాలుగోసారి, నాలుగో అమ్మాయిగా అవకాశం అందుకుంది. అలా చెన్నైలోని 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ' (ఓటీఏ)లో శిక్షణకు అర్హత సాధించింది.

భావనకు సైన్యంలో అవకాశం వచ్చిందని తెలుసుకున్నవారు సంతోషించలేదు. 'ఆర్మీ శిక్షణ అంటే చాలా కష్టంగా ఉంటుంది. ఆడపిల్లవి. నీ వల్ల కాదు...' అని కొందరంటే... 'చక్కగా నాట్యం నేర్చుకున్నావ్. సంగీతం కూడా వచ్చు. ప్రయత్నిస్తే ఐటీ ఉద్యోగం వస్తుంది. భవిష్యత్తు బాగుంటుంది. పెళ్లి చేసుకుని హాయిగా స్థిరపడక ఇంత కష్టం అవసరమా' అని మరికొందరు అన్నారు. కాని ఎవరెన్ని చెప్పినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకే సిద్ధమైంది. శిక్షణ కోసం అప్పటివరకూ ఎంతో ఇష్టంగా పెంచుకున్న జుట్టుని కత్తిరించుకోవాల్సి వచ్చింది. 2015లో సైనికురాలిగా శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది.

అప్పుడే ఆమెకు అసలు సవాళ్లు ఎదురయ్యాయి. శిక్షణలో భాగంగా కఠినమైన పరీక్షలు తప్పలేదు. 'ఒక్క క్షణం ఖాళీ దొరికేది కాదు. ఒక్కోసారి పరుగెడుతున్నప్పుడు కాళ్లు కదపలేని స్థితిలో కూర్చుండిపోయేది. కాస్త విశ్రాంతి తీసుకుందామనుకున్నా మరో పని ఉండేది. మొదట్లో మనసూ, శరీరం రెండూ సహకరించేవి కావు. శరీరం పుండులా మారిపోయింది. అలసిపోయినా నిద్రపట్టేది కాదు. గుర్రపుస్వారీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఈత, రాకెట్ లాంచింగ్...ఒకటేమిటి ఎన్నో ఉండేవి. ఓసారి 20 కిలోల బరువైన బ్యాగును భుజాన వేసుకుని నలభై కిలోమీటర్లు పరుగెత్తాలని చెప్పారు. అదీ రాత్రంతా పరుగెత్తి తెల్లారేసరికల్లా చేరుకోవాలి. వాళ్ల బ్యాచ్‌లో మొత్తం 250 మంది ఉంటే అమ్మాయిల సంఖ్య మాత్రం 30. మొదట సందేహించినా, ఒకరు వెనకడుగు వేసినా...మరొకరు ప్రోత్సహించుకుంటూ పరుగెత్తారు. మహిళలు తలచుకుంటే ఏమైనా చేయగలరని నిరూపించారు.

భామనే సత్యభామనే అంటూ పొడుగాటి జడను వయ్యారంగా తిప్పుతూ నాట్యం చేస్తూ దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన భావన తను సైన్యం వైపు వస్తానని అస్సలనుకోలేదు. భావనకు శిక్షణ పూర్తయిన వెంటనే కార్గిల్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

అలా శిక్షణలో భాగంగా ఎన్ని సవాళ్లు ఎదురైనా అన్నింటినీ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో అధిగమించింది భావన. ముందు తన ఇంట్లో ఓ పట్టాన నిద్రలేచేది కాదు. ఇప్పుడు శిక్షణలో భాగంగా నాలుగ్గంటలకే లేచి పరేడ్, పరుగు మొదలైనవి అబ్బాయిలతో సమానంగా చాలా చేయాలి. ఒక్కోసారి చేయలేకపోయినా తన లక్ష్యం గుర్తొచ్చినప్పుడల్లా కసి పుట్టేది.

ఆ కసితోనే శ్రమించి రోప్ పుషింగ్, ఫైరింగ్ ఇలా చాలా విభాగాల్లో ముందంజలో ఉంటూ, శిక్షణ పూర్తయ్యేసరికి అకాడమీలో టాపర్‌గా నిలిచింది. భామనే సత్యభామనే అంటూ పొడుగాటి జడను వయ్యారంగా తిప్పుతూ నాట్యం చేస్తూ దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన భావన తను సైన్యం వైపు వస్తానని అస్సలనుకోలేదు. భావనకు శిక్షణ పూర్తయిన వెంటనే కార్గిల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అప్పుడామెకు మేజర్ పద్మపాణి ఆచార్య గుర్తొచ్చారు. ఒక్క క్షణం భయం అనిపించినా... ఆయన వీర మరణం ఎంతమందిలో దేశభక్తి రగిలించిందో గుర్తు చేసుకుని మహిళా జవానుగా భరతమాతకు సేవ చేసే అవకాశం తనకు వచ్చిందని సంతోషంగా చేరింది. దేశం కోసం నిస్వార్థసేవ చేయాలని, తన దేశం కోసం చనిపోయినా ఆనందమేనని, దేశం తరువాతే కుటుంబం అని ఆ క్షణానే నిర్ణయించుకుంది భావన.

''ఇప్పుడు నాకు వచ్చిన ఈ అవకాశాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. సాధారణంగా మహిళలకు నాయకత్వం వహించే అవకాశం రాదు. ఆరునెలల క్రితం మమ్మల్ని బెంగళూరు రమ్మన్నారు. అక్కడ ఎంపికలు జరిగాయి. గణతంత్ర దినోత్వం పెరేడ్‌లో సైనిక బృందానికి నాయకత్వం వహిస్తానని అనుకోలేదు. శిక్షణ మొదలైంది. పెరేడ్, డ్రిల్ ఇలా చాలా జరిగాయి. డిసెంబరు చివరివారంలో నన్ను కంటింజెంట్ కమాండర్‌గా ఎంపిక చేస్తూ నాయకత్వం వహించమన్నారు' అని చెబుతుంది భావన.

ఆమె భర్త కూడా సైన్యంలో డాక్టరుగా పని చేస్తున్నారు. భావన శ్రమ, పట్టుదల మిగతా ఆడపిల్లలకు ఆదర్శంగా నిలవాలి.

– జ్యోతి వలబోజు


స్నేహాన్ని కొనసాగించడం తప్పకాదు!



నా పేరు శ్రీరేఖ. నాకు పెళ్లయి ఏడు సంవత్సరాలయ్యింది. నా భర్త పేరు మురళి, మాకు 5 సంవత్సరాల పాప అలేఖ్య వుంది. నాన్నగారు మాకు దూరపు బంధువులు, మంచివాళ్ళని మురళితో నాకు డిగ్రీ పూర్తవగానే పెళ్ళి చేశారు. నేను కూడా ఆడపిల్ల అన్నాక ఎప్పటికైనా పెళ్ళి చేసుకోవాలి కదా అని పెళ్ళికి ఒప్పకున్నా. మురళీ మంచివాడే, కానీ తనకి పెళ్ళికి ముందు లవ్ ఎఫైర్ వుంది. తను ఇప్పటికి ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అది నాకు తెలిసి నేను తనతో కలిసి వుండలేకపోతున్నాను. మా అత్త, మామలు మాతో వుండరు. ఊరిలో మాకు పొలాలున్నాయి. వాటిని చూసుకుంటూ వాళ్ళు అక్కడే ఉంటారు. మేము పండగలకి అక్కడికి వెళ్ళి వస్తుంటాం. నాకు ఒక చెల్లి వుంది ఇంకా పెళ్ళి కాలేదు. సంబంధాలు చూస్తున్నాము. ఇలాంటి సమయంలో అమ్మ వాళ్ళకి నేను ఈ విషయం చెబితే వాళ్ళు చాలా బాధ పడతారు. అందుకే నేను వాళ్ళకి చెప్పలేక, మీకు లెటర్ ద్వారా తెలియచేస్తే ఏదైనా పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నాను. నా భర్తలాగే మా చెల్లికి గవర్నమెంట్ ఉద్యోగినిచ్చి పెళ్ళి చేయాలని మా నాన్న ఆలోచిస్తున్నారు. నేను ప్రస్తుతం ఏం చేయాలి? నాకు మురళితో కలిసి ఉండాలని లేదు. తను పూర్తిగా మారి, కేవలం నన్ను, పాపని మాత్రమే తన జీవితానికి ముఖ్యమనే విధంగా మారాలి. అప్పడే తనతో కలిసి వుండగలను. నేనేం చేయాలో నాకు అర్థం కావడం లేదు. దయచేసి నాకు మార్గం చెప్పండి.

శ్రీరేఖా ఈ లెటర్ చదివాకా, నీ సమస్య అర్థమైంది. నాకు పెళ్ళై 7 సంవత్సరాలయిందని, ఒక పాప (5 సం'') అని రాసావు. నీవు నీ జీవితంతో పాటు పాప గురించి కూడా ఆలోచించాలి. నీవు ఈ విషయంలో తొందరపడాల్సిన పని లేదు. ఎందుకంటే నీ భర్త మురళి మంచివాడేనని నువ్వే రాసావు. చాలా మంది చదువుకునే రోజుల్లో ఉన్న స్నేహితుల్నీ, అప్పట్లో ఏర్పడ్డ బంధాల్ని త్వరగా వదులుకోలేరు. అందుకే ఎక్కడ వున్నా ఫోన్ల ద్వారా స్నేహాన్ని కొనసాగిస్తుంటారు.. కానీ అది పెద్ద తప్పు కాదు. కేవలం దానిని కారణంగా చూపించడం సరికాదు. వివాహానంతరం భార్యాభర్తల మధ్య వచ్చే సమస్యల పరిష్కారం కోసమే హిందూ మ్యారేజ్ యాక్ట్ 1995 పెట్ట బడింది. ఎవరైనా తమ జీవిత భాగస్వామితో కలిసి వుండలేని పక్షంలో సెక్షన్.13 ప్రకారం విడాకులు కోరవచ్చు.

అలాగే జీవిత భాగస్వామి (భర్త) నుంచి భరణం పొందవచ్చు. భర్త ఉద్యోగి అయితే, భార్యకు, సంతానానికి తన జీతం నుండి కోర్టు నిర్ణయించిన మేరకు వారి పోషణార్థం నెలనెలా యివ్వవలసిందే. ఒక వేళ నీకు విడాకులు తీసుకోవాలని లేనిచో నీవు జ్యుడీషియల్ సపరేషన్ కోరుకోవచ్చు. సెక్షన్ 10 ప్రకారం నీవు నీ భర్త ఇంట్లోనే వుండి , నీకు పాపకు పోషణార్థం పొందవచ్చు. కనుక నీవు నీ గురించి, నీ కుంటుంబం గురించి బాగా ఆలోచించి, నీ తల్లిదండ్రులతో కూడా చెప్పాక, నిర్ణయం తీసుకో. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు మంచి ఫలితాల్ని ఇవ్వవు. కనుక తొందర పడకుండా నిదానంగా ఆలోచించు.



ఎస్.బి.టి. సుందరి
హైకోర్టు న్యాయవాది, ఫ్యామిలీ కౌన్సిలర్ మీ సమస్యలను features@manatelangana.orgకి పంపగలరు.

భోజనం తర్వాత చేయకూడనివి




ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే చాలని అనుకుంటారు అందరు. అయితే కేవలం పోషకాహారం తింటే సరిపోదు. కొన్ని రకాల నియమాలను కూడా పాటించాలంటున్నారు నిపుణులు. చాలా మంది భోజనం చేసిన తర్వాత కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. వాటి కారణంగా ఎంత మంచి ఆహారం తిన్నా కూడా అది వంట పట్టదట. మరి భోజనం తర్వాత చేయకూడని పనులేంటో తెలుసుకుందామా...

చాలా మందికి భోజనం చేసిన వెంటనే పండ్లు తినే అలవాటు ఉంటుంది. ఆ అలవాటు ఏ మాత్రం మంచిది కాదు. దీనివల్ల పొట్ట పెరుగుతుందట. భోజనానికీ, పండ్లకీ మధ్య సమయం కనీసం రెండు గంటలైనా ఉండాలంటున్నారు. ఇంకొందరు వేళాపాళా లేకుండా టీ తాగేస్తుంటారు. భోజనం తర్వాత మాత్రం తాగకూడదు అంటున్నారు నిపుణులు. టీపొడిలో ఉండే ఆమ్లాలు..ఆహారంలో ఉండే మాంసకృత్తులు శరీరం వినియోగించుకోకుండా అడ్డుకుంటాయట. అందుకే భోజనం తర్వాత టీకి కాస్త దూరంగా ఉండాలి.

ఇంకొందరికి భోజనం చేసిన తర్వాత స్నానం చేసే అలవాటు ఉంటుంది. దీనివల్ల జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

అంతేకాదు భోజనం చేసిన వెంటనే వాకింగ్ కూడా చేయకూడదు. కనీసం ఒక గంట సమయం తర్వాత చేస్తే చాలా మంచిది. భోజనం చేసిన వెంటనే నిద్ర పోవడం కూడా మంచిది కాదట.

అందమైన ఒత్తైన కనురెప్పల కోసం...



అందమైన అమ్మాయి అనగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది కళ్లే. కళ్లు పెద్దవిగా అందంగా ఉండే అమ్మాయిలు చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తుంటారు. అందుకే కంటికి కూడా అమ్మాయిలు రకరకాల మెరుగులు అద్దుతుంటారు. కళ్లకు కాటుకతోపాటు కనురెప్పలకు మస్కారా వేస్తుంటారు. మస్కారాతో కనుబొమ్మలు ఒత్తుగా కనడతాయి. దీంతో అందం మరింత పెరుగుతుంది. అయితే మస్కారా అవసరం లేకుండా కను రెప్పలను ఒత్తుగా, అందంగా చేసుకోవచ్చు. అది కూడా మన వంటింట్లో లభించే పదార్థాలతో అదెలాగో చూద్దాం..

* రాత్రి నిద్రపోయే ముందు తాజా ఆలివ్ ఆయిల్ లేదా ఆముదంలో ఇయర్ బడ్ ముంచి, దానిని కనురెప్పల మీద అద్దుకోవాలి. ఇలా వారం పాటు చేస్తే కనురెప్పలు ఒత్తుగా పెరుగుతాయి.
* నిమ్మ తొక్కను ఆలివ్ ఆయిల్ లేదా ఆముదంలో వేసి ఒక వారం తర్వాత ఆ నూనెను కనురెప్పలకు పూస్తే ఫలితం ఉంటుంది. పెట్రోలియం జెల్లీలో మస్కారా బ్రష్ ముంచి దానితో కనురెప్పలు అద్దుకోవాలి ఇలా క్రమం తప్పకుండా వారం రోజులు చేస్తే కచ్చితంగా కనురెప్పలు ఒత్తుగా పెరుగుతాయి.

బొప్పాయి తింటే అబార్షన్ జరుగుతుందా..?

బొప్పాయి తింటే అబార్షన్ అవుతుందని చాలా కాలం నుంచి అందరిలోనూ ఉన్న ఒక నమ్మకం. అందుకే గర్భం దాల్చిన స్త్రీలకు అన్ని పండ్లు పెడతారు కానీ బొప్పాయి మాత్రం పెట్టరు. కడుపులోని బిడ్డకు ప్రమాదం జరగుతుందని వారి భయం. అయితే ఇందులో 100శాతం నిజం లేదంటున్నారు నిపుణులు. బొప్పాయిలో విటమిన్ సి శాతం ఎక్కువగా ఉంటుంది. గర్భం దాల్చిన స్త్రీలు విటమిన్ సి ఎక్కువగా తింటే అబార్షన్ జరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే అబార్షన్ జరగాలంటే స్త్రీలు కనీసం ఐదు కిలోల బొప్పాయి తినాలట. అంత మొత్తంలో తీసుకున్నప్పుడు మాత్రమే అబార్షన్ జరుగుతుందట. అంత మొత్తంలో ఎవరూ తీసుకోలేరు కాబట్టి ప్రమాదం ఏమీ ఉండదని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి తగిన మోతాదులో తీసుకుంటే మంచిది.





కూలిన సైనిక జాగ్వార్

న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి చెందిన జాగర్ విమానం ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్ జిల్లాలో సోమవారం కూలిపోయిందని, అయితే పైలట్ సురక్షితంగా బయటపడ్డాడని పోలీసులు తెలిపారు. ఎప్పటిలాగే గోరఖ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి బయలుదేరిన సైనిక విమానం కొద్దిసేపటికే కూలిపోయింది. సోమవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగిందని జిల్లా మేజిస్ట్రేట్ అనిల్‌కుమార్ తెలిపారు. విమానంలో ఏదో సమస్య ఏర్పడిందని గుర్తించిన పైలట్ తను దాన్నుంచి దూకడానికి ముందు సురక్షిత ప్రదేశానికి తరలించారని మేజిస్ట్రేట్ చెప్పారు. కుషీనగర్ జిల్లాలోని హాతెంపూర్ ప్రాంతంలో హాటా..కశ్యా టౌన్‌ల మధ్య విమానం కూలిపోయిందని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎయిర్ ఫోర్స్ అంబులెన్స్‌లో పైలట్‌ను ఆస్పత్రికి తరలించామని ఎస్‌పి రాజీవ్ నారాయన్ మిశ్రా చెప్పారు. ప్రమాదంపై దర్యాప్తు జరపాలని వైమానిక దళ ప్రధాన కేంద్రం ఆదేశించిందని ఐఎఎఫ్ వర్గాలు తెలిపాయి.

కృష్ణుడికి సాహిత్య అకాడమీ అవార్డు



న్యూఢిల్లీ : తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్టు అప్పరసు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ విశిష్ట పురస్కారానికి కృష్ణారావును ఎంపిక చేస్తున్నట్లు సోమవారం సాహిత్య అకాడమీ ఒక ప్రకటన వెలువరించింది. ఉదయం దినపత్రికలో తొలుత సబ్ ఎడిటర్‌గా చేరి తరువాత ఆంధ్రజ్యోతిలో పాత్రికేయుడిగా ప్రస్థా నం సాగిస్తోన్న కృష్ణారావు తన కలం పేరు కృష్ణుడు పేరిట పలు రచనలు చేశారు. కవిగా, విశ్లేషకుడిగా కూడా ప్రతిభ కనబర్చారు. ప్రస్తుతం ఢిల్లీలో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధిగా ఉన్న కృష్ణారావు స్వస్థలం పాలమూరు. అయితే చాలా కాలం హైదరాబాద్‌లో ఉన్నారు. పద్మ సచ్‌దేవ్ డోగ్రీ భాషలో రాసిన కవితలను గుప్పెడు సూర్యుడు, మరికొన్ని కవితల పేర్లతో కృష్ణుడు తెలుగులోకి అనువదించారు. కృష్ణారావుకు సాహిత్య అకాడమి అవార్డు రావడం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ అభినందనలు తెలిపారు.

లైన్‌క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

కోసం జరిగిన పరీక్షలో ఇచ్చిన ప్రవఘ్నల్లో ఆరింటిని తొలగించాలన్న ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సవాల్ చేసింది. ఈ అప్పీల్ వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. ఎస్సు పోస్టులకు నిర్వహించిన రాతపరీక్షల పేపర్ బుక్‌లెట్ కోడ్‌బిలోని ఆరు ప్రశ్నలను తొలగించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. నియామక ప్రక్రియ 90 శాతం వరకూ జరిగినందున తాము జోక్యం చేసుకోబోమని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఒక ప్రశ్నకు రెండు రకాలైన జవాబులు ఉండవచ్చునని, ఏది రాసినా తప్పుకాదని తెలిపింది. అభ్యర్థులు తమ మార్కుల కోసం బోర్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. పోలీస్, ఫైర్, జైళ్ల శాఖల్లో 1217 ఎస్సు పోస్టుల భర్తీ కోసం బోర్డు 2018 మే 31న నోటిఫికేషన్ వెలువరించి అదే ఏడాది ఆగస్టు 26న రాతపరీక్ష నిర్వహించింది. బుక్‌లెట్ బి కోడ్‌లోని ఆరు ప్రశ్నలు, వాటి జవాబులు కూడా తప్పని పేర్కొంటూ నల్గొండ వాసి ఉపేందర్‌రెడ్డి సహా 15 మంది హైకోర్టును ఆశ్రయించారు. బుక్‌లెట్ బీ కోడ్‌లోని 117, 138, 172, 181, 185, 189 ప్రశ్నలను తొలగించిన తర్వాత అర్హుల జాబితాను వెల్లడించాలని సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అప్పటికే అర్హత సాధించిన వారిని మినహాయించాని ఆదేశాలిచ్చారు. దీనిపై బోర్డు సవాల్ చేసిన అప్పీల్ తరపున ప్రభుత్వ ప్రత్యేక లాయర్ శరత్ వాదిస్తూ.. ఆరు ప్రశ్నల్లో తప్పులు లేవన్నారు. సింగిల్ జడ్జి ఆదేశించినట్లుగా అభ్యర్థుల హాల్ టిక్కెట్లను, వారి మార్కుల్ని ప్రచురించడం కష్టమన్నారు. ఇప్పటికే అర్హత సాధించిన వారిని కొనసాగించవచ్చునని, ఆరు తప్పుడు ప్రశ్నలు తొలగించి మిగిలిన వారిలో అర్హుల్ని ప్రకటించాలని పిటిషనర్ లాయర్ వాదించారు.

జనార్ధనరెడ్డి బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆయన గత ఏడాది ఆగస్టు నెలలో హెచ్‌ఎండిఎ కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా మూడేళ్ళు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. అయితే, ఈ నెల 11వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆయన అమెరికాలో ఉన్నారు. అమెరికాలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరిగిన ఇ గవర్నెన్స్ అమలు విషయమై అమెరికాలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అయితే, ప్రస్తుతం ఆయన 28 నాటికి సెలవులో ఉన్నారు. 29న విధుల్లో చేరాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే జనార్ధన్‌రెడ్డిని హెచ్‌ఎండిఎ నుంచి బదిలీ చేస్తూ ఆయనను నేరుగా సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టంచేసింది. ప్రస్తుతం హెచ్‌ఎండిఎ కమిషనర్‌గా పురపాలక విభాగం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్న అరవింద్ కుమార్‌ను అథారిటీ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది ప్రభుత్వం. త్వరలోనే అథారిటీకి నూతన కమిషనర్ ఎవరు వస్తారనేది హాట్ టాపిక్‌గా మారింది.

భరోసా

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ జనవరి 1వ తేదీ, 2019న ప్రారంభించారు. 17 టీములు ఏర్పాటు చేసి పిల్లలను కాపాడారు. పిల్లలతో పనిచేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. వారిపై 6,75,365 రూపాయలు ఫైన్ వేశారు. పోలీసులు కాపాడిన పిల్లలు బ్యాగుల తయారీ పని, గాజుల పరిశ్రమ, బిస్కట్, బేకరీ, ఎలక్ట్రికల్ పరికరాల తయారీ, మెకానిక్ షాపులు, వెల్డింగ్ పనులు, ఫ్యాబ్రికేషన్, టిఫిన్ సెంటర్లలో పనిచేస్తున్నారు. బాల బాలికలతో పనిచేయిస్తున్న వారిపై జరిమానా విధించారు. పట్టుకున్న వారిలో 100మంది ఎపి,బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, నేపాల్‌కు చెందిన వారు ఉన్నారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ సిపిలు శిఖగోయల్, డిఎస్ చౌహాన్ పాల్గొన్నారు.

దర్పన్ యాప్‌లో వివరాలు..

దర్పన్ యాప్ సాయంతో బాలబాలికల వివరాలు తెలుసుకున్నారు. ఇందులో ముగ్గురు పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నారు. ఇద్దరు కుటుంబ ఆర్థిక పరిస్థితి వల్ల చదువు మధ్యలో ఆపివేసి వీధుల్లో తిరుగుతున్నారు. వీరిని అందరిని తిరుమలగిరి పిఎస్ ఎస్సై రజిని వారిని సికింద్రాబాద్‌లోని ఓ పాఠశాలలో చేర్పించారు. ఒక పిల్లవాడు ఆర్థిక పరిస్థితుల వల్ల ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్నాడు. ఇతడిని గోల్కొండ ఎఎస్సై పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చాడు. మూడు పాఠశాలలు వీరికి ఉచితంగా చేర్పించుకునేందుకు ముందుకు వచ్చాయి.

కాగుతున్న నూనెలు ఘాటెక్కిన మిర్చి



పప్పులు, బియ్యం హెచ్చుతగ్గులు • కొండెక్కిన కూరగాయలు
• ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
పది నుంచి ముప్పై శాతం పెరుగుదల • అధికారిక లెక్కల్లో వెల్లడి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో వంట నూనెల ధరలు కాగుతున్నాయి. సంక్రాంతి పర్వదినం మొదలుకొని వంట నూనెలు ధరలు పెరుగుతునే ఉన్నాయి. ఈ పరిస్థితి మరి కొంతకాలం ఉండే అవకాశముందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం గత ఏడాదిలో లీటర్ పామాయిల్ ధర రూ.65.22 ఉండగా అది ప్రస్తుతం 17.78 శాతంతో రూ.11.60 పెరిగి రూ.76.82 చేరింది. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.81.25 ఉండగా 10.26శాతంతో రూ. 8.33 పెరుగుదలతో రూ. 89.58 చేరింది. పల్లీ నూనె రూ.100.71 గతేడాది ఉంటే అది 6.33 శాతంతో రూ. 6.38 పెరిగి ప్రస్తుతం రూ.107.09 ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. కానీ బహిరంగ మార్కెట్‌లో మాత్రం హోల్ సేల్‌లో మొదటి రకం పల్లీ నూనె పదిహేను లీటర్లకు రూ.1600, పది లీటర్లకు రూ.1067 ఉండగా సన్‌ఫ్లవర్ పదిహేను లీటర్లకు రూ. 1470, పది లీటర్లకు రూ.980లుగా పామాయిల్ ధర పదిహేను లీటర్లకు రూ. 980, పదిలీటర్లకు రూ.653లుగా ఉందన్నారు. అదే రిటైల్ మార్కెట్‌లో ప్రతి లీటర్ పల్లీ నూనె రూ. 110 నుంచి 115 వరకు, సన్‌ఫ్లవర్ లీటర్‌కు రూ. 98 నుంచి వంద వరకు, పామాయిల్ రూ.86లుగా ఉందని అయిల్ వ్యాపారులు వివరిస్తున్నారు. మిర్చి ధర కిలో రూ. 84.34 ఉంటే 24.38 శాతంతో రూ. 20.56 పెరిగి 104.90లుగా ప్రస్తుతం ధర ఉందని అధికారిక లెక్కలుండగా బహిరంగ మార్కెట్‌లో మిర్చి ధర మేలు రకం రూ.110 నుంచి రూ.130 వరకుంది. ఇందులో మూడే గ్రేడ్‌లుగా వ్యాపారులు విక్రయాలు సాగిస్తున్నారు. మేలు రకం, సెకండ్ గ్రేడ్‌తో పాటు తాళ్లుగా ఉండే మిర్చి ధర రూ.110 నుంచి రూ.150ల వరకు కూడా బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు సాగుతున్నాయి. క్వాలిటి బియ్యం గత ఏడాది 45.43 ఉంటే అది ఈ ఏడాది 1.82 శాతంతో రూ.0.83 ప్రస్తుతం మార్కెట్‌లో రూ.46.26 ఉంది. సెకండ్ గ్రేడ్ బియ్యం గత ఏడాది రూ.39.59 లుండగా 0.32శాతంతో రూ.0.13 పెరిగి ప్రస్తుతం 39.72గా ఉంది. కానీ బహిరంగ మార్కెట్‌లో గ్రేడ్ వన్ రైస్ రూ.48 నుంచి రూ.50లుండగా రెండవ రకం రూ.45 నుంచి రూ.48లుగా ఉందని వ్యాపారులు తెలిపారు.

పప్పుధాన్యాల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అధికారుల అం చనా మేరకు గ్రేడ్ 1 కందిపప్పు గత ఏడాది రూ.72.45 ఉంటే 5.81 శాతంతో రూ.4.21 పెరిగి ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 76.66, సెకండ్ గ్రేడ్ కందిపప్పు గతేడాది రూ.64.69 ఉంటే 7.12శాతంతో రూ.4.61 పెరిగి ప్రస్తుతం 69. 30 ఉందన్నారు. కానీ బహిరంగ మార్కెట్‌లో గ్రేడ్ వన్ రూ. సెకండ్ గ్రేడ్ రూ.75లుంది. నిత్యావసర ధరల పెరుగుదల సామాన్యుడికి శరాఘాతంగా మారింది. ఒకవైపు ధరలు ఆకాశన్నంటుతుంటే మరోవైపు సామాన్యుని జీవనం రోజురోజుకు దుర్భరంగా మారుతోంది.

ఆకాశన్నంటిన కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు మాత్రం ఆకాశన్నంటుతున్నాయి. రైతు బజార్లలో కంటే బహిరంగ మార్కెట్లల్లో విపరీతమైన ధరలతో వ్యాపారులు విక్రయిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే కూరగాయల ధరలు 30 నుంచి 60 శాతం మేరకు పెరిగాయని ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఈ ధరలు మరింతగా మండిపోతున్నాయి. గతేడాది టమోట కిలో రూ.9.77 ఉంటే 58.70 శాతంతో రూ.5.73 పెరిగి ఈ ఏడాది రూ. 15.50 బంగాళదుంప గతేడాది రూ. 19.31 ఉంటే 33.22 శాతంతో రూ.6.42 పెరిగి ప్రస్తుతం 25.73గా ఉంది. అదే విధంగా వంకాయలు గతేడాది రూ.31.95 ఉంటే 13.56శాతంతో రూ.4.33 పెరిగి రూ.36.28లుగా ఉంది. టోకు మార్కెట్‌లో మాత్రం కిలో టమోట రూ. 30, ఆలుగడ్డ రూ.50, బెండకాయ రూ.35, దొండకాయ రూ.30, ఉల్లిపాయలు రూ.2, చిక్కుడు కాయ రూ.40, క్యారట్, పచ్చిమిర్చి రూ.60, వంకాయలు రూ.80, క్యాబేజి రూ.40లుగా ఉంది.

అడవంటే హడల్

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఇందుకోసం వినియోగిస్తామన్నారు. అడవుల రక్షణ, అటవీ నేరాల అదుపునకు సంబంధించి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, అటవీశాఖ అధికారులతో సోమవారం సచివాలయం నుంచి వీడియో కాన్స్‌రెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ జోషి మాట్లాడుతూ అధికారులు ఎంత కఠినంగా వ్యవహరిస్తే అటవీ నేరాలను అంతేస్థాయిలో తగ్గించే అవకాశముంటుందన్నారు. పర్యావరణపరంగా నివాసయోగ్యానికి అనువుగా తెలంగాణ రాష్ట్రం ఉండాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆకాంక్షిస్తున్నారని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.

రానున్న ఐదేళ్లల్లో పచ్చదనం పెంపుతో పాటు అడవుల రక్షణ ప్రాధాన్యత అంశంగా ఉంటుందని సిఎం తెలిపారన్నారు. ఇందుకోసం హరితహారం కార్యక్రమం నిర్వహణ ద్వారా అటవీ నేరాల అదుపునకు కఠిన చర్యలు, పచ్చదనం పెంపు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో అటవీ ప్రభావిత జిల్లాల్లో సాయుధ పోలీసులతో పాటు అటవీ అధికారులు సమిష్టిగా 54 చెక్‌పోస్టు లను ఏర్పాటు చేసి తనిఖీ చేయాలని ఆదేశించారు. అటవీ నేరాల విచారణ, కఠిన శిక్షల ఖరారులో మరింత వేగం పెంచుతామని తెలిపారు. పోలీసు ఇంటలిజెన్స్ వ్యవస్థతో పాటు అటవీ నేరాల్లో ఇన్‌ఫార్మర్ల వ్యవస్థ పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సరైన సమాచారం అందించే ఇన్‌ఫార్మర్లకు మంచి రివార్డులు ఇస్తామన్నారు.పేకాట, గుడుంబా స్థాయిలోనే కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలన్నారు.

కొట్టేసిన కలపను పట్టుకోవడమే కాకుండా నేరస్తులు అడవి లోపలికి వెళ్లకుండా అడ్డుకోవాలన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ అటవీ నేరాల అదుపు కోసం పోలీసుల నుంచి పూర్తిస్థాయిలో సహకారం ఉంటుందన్నారు. అన్ని స్థాయిలలోని పోలీస్ సిబ్బంది స్థానిక అటవీ అధికారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్‌పి, డిఎఫ్‌ఓ కలిసి ఒక ఒక టీంగా ఏర్పడి అటవీ నేరాలను ఆరికట్టాలన్నారు. అడవులపై నిరంతర నిఘా కోసం పోలీసుల పహారా ఉంటుందన్నారు. తరచుగా అటవీ నేరాలకు పాల్పడే నేరస్తులను జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కలప కోత యంత్రాల (సా మిల్లులు)పై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వారంతా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మంచి అడవులను కాపాడుకోవడం ఒక ఎత్తయితే, క్షీణించిన అడవులను పునరుద్ధరించుకోవడం మరో ఎత్తన్నారు.

విధుల నిర్వహణలో అటవీ సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఎంతటి స్థాయి అధికారులైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి సిబ్బంది తప్పనిసరిగా తమ పరిధి మేరకు క్షేత్ర పర్యటన చేయాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ముల్తానీలను కలప స్మగ్లింగ్ నుంచి దూరం చేసేందుకు అవసరమైన పునరావాస ప్యాకేజిని వెంటనే అమోదిస్తామన్నారు. అధికారుల స్థాయిలోని అటవీ రక్షణ కమిటీలు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసి తరచుగా సమావేశం కావాలన్నారు. గ్రామస్థాయిలో కూడా హరిత రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా అటవీ ప్రధాన సంరక్షణ అధికారి ప్రశాంత్ కుమార్ ఝూ మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసుల సహకారంతో అటవీ ఆక్రమణలు జరగకుండా చూస్తామన్నారు.

వన్యప్రాణుల వేటపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. వన్యప్రాణుల కోసం వేటగాళ్లు విద్యుత్ వైర్లను అమరుస్తున్నారని, దీన్ని నిరోధించేందుకు విద్యుత్‌శాఖ సహకారం తీసుకుంటామన్నారు. వీడియో కాన్స్‌రెన్స్‌లో అటవీ, పర్యావరణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, అదనపు డిజిపి జితేందర్, ఐజిలు నాగిరెడ్డి, స్టిఫెన్ రవీంద్ర, పిసిసిఎఫ్ విజిలెన్స్ రఘువీర్, అదనపు పిసిసిఎఫ్ మునింద్ర, లోకేష్‌జైస్వాల్, డోబ్రియేల్, తిరుపతయ్య, స్వర్గం శ్రీనివాస్ సిఎం ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.

2000 ఖాళీల భర్తీకి రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పోస్టుల విభజన చేయాలని కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పలు ప్రభుత్వ శాఖల్లో కలిపి సుమారు 2000 వరకు ఉన్న పోస్టులు భర్తీచేయాల్సి ఉంది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు గతంలోనే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు చేరాయి. ఇటీవలే కొత్త జోనల్ విధానానికి కేంద్రం ఆమోదం తెలిపిన నేపథ్యంలో కమిషన్ ప్రతిపాదనలు తిప్పిపంపించింది. నోటిఫికేషన్లు కూడా ఇవ్వకపోవడంతో కమిషన్‌కు సులువైంది. గ్రూప్ 1లో 137 పోస్టులు, గ్రూపు 3లో 339 పోస్టులతో పాటు ప్రజారోగ్యం, పురపాలక శాఖ, రోడ్లు, భవనాలశాఖ, భూగర్భ జలవనరుల శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఐపిఎం, దేవాదాయ శాఖ, అటవీ, పర్యావరణ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ శాఖలు, పశు సంవర్ధక శాఖ, జిహెచ్‌ఎంసి, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖ, మత్స్యశాఖ, ఆర్‌టిసి, హోంశాఖ, కార్మిక శాఖ తదితర శాఖలకు చెందిన పోస్టులు త్వరలోనే భర్తీచేయనున్నారని సమాచారం. సుమారుగా 2000 వరకు ఉన్న ఈ పోస్టులను ప్రభుత్వ శాఖల నుంచి కొత్త జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్ల వారీగా విభజించి టిఎస్‌పిఎస్‌సికి పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఇప్పుడు మధ్యలో ఉంది. కమిషన్ తరపున పంపిన లేఖలకు కొన్ని శాఖలే సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. మిగతా శాఖల నుంచి సమాచారం పూర్తిగా రాగానే వెంటనే అన్ని పోస్టులను నోటిఫై చేస్తుంది. ఆ తదుపరి వారం, పది రోజుల్లోనే పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అవుతుందని కమిషన్ ఉన్నతస్థాయి వర్గాలు అభిప్రాయపడ్డాయి.

ప్రభుత్వ శాఖలు	ఖాళీలు
1. ఎఇ, ప్రజారోగ్యం	47
2. డ్రాఫ్ట్స్‌మెన్, ఆర్అండ్‌బి	58
3. డిప్యూటీ కలెక్టర్లు	8
4. డిఎస్‌పి	42
5. కమర్షియల్ టాక్స్ ఆఫీసర్	19
6. జిల్లా రిజిస్ట్రార్	6
7. మునిసిపల్ కమిషనర్ గ్రేడ్ 2.	26
8. గ్రూప్ 3 సర్వీసులు	339
9. ఎఇ, గ్రామీణ నీటి సరఫరా శాఖ	82
10. ఫుడ్ ఇన్స్‌పెక్టర్	10

ప్రభుత్వ శాఖలు	ఖాళీలు
11. ఇఓ గ్రేడ్ 3, దేవాదాయ శాఖ	59
12. అటవీ, పర్యావరణశాఖ	31
13. పశుసంవర్ధకశాఖ	39
14. జిహెచ్‌ఎంసి	226
15. డిప్యూటీ తహసిల్దార్	38
16. డిప్యూటీ సర్వేయర్లు	210
17. కంప్యూటర్ డ్రాఫ్ట్‌మెన్	50
18. సబ్ రిజిస్ట్రార్లు	22
19. ఆర్‌టిసి	207
20. కార్మిక, ఉపాధి, శిక్షణా శాఖ	287

మోడీ షాస్ ఓడోమస్

జమ్మూ : బిజెపినేత అమిత్ షా ఒఆర్ఒపి వ్యాఖ్యలపై నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ఘాటుగా స్పందించారు. దేశం ఇప్పుడు అతి మోతాదు ఓడోమస్‌తో కలత చెందుతోందని వ్యాఖ్యానించారు. ఓడోమస్ అంటే ఓవర్ డోస్ ఆఫ్ ఓన్లీ మోడీ , ఓన్లీ షా అని ఒమర్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ వారికి సైనికుల ఒఆర్ఒపి గురించి తెలియదని షా సోమవారం విమర్శించారు. వారికి తెలిసిన ఒఆర్ఒపి కేవలం ఓన్లీ రాహుల్ ఓన్లీ ప్రియాంక అని చమత్కరించారు. దీనిపై మాజీ సిఎం ఒమర్ ఎదురుదాడికి దిగారు. దోమల మందు ఓడోమస్ మోతాదు మించితే అందరికీ చేటే అని, ఇప్పుడు మోడీ, షాల తీరు ఓడోమస్ ఘాటును తలపిస్తోందన్నారు.

వెయ్యెకరాల వెత





(మొదటిపేజీ తరువాయి)

పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. వేలాది ఎకరాల్లో వేసిన పత్తి, మిర్చి, కంది, వేరుశనగ, సోయాబీన్, మొక్కజొన్న పంటలు దెబ్బతినగా మామిడి పూత రాలిపోయింది. ఇప్పటికే 3,300 ఎకరాల్లో సాగైన పంట ఉత్పత్తులు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే పంట చేలల్లో దాదాపు 1000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనావేసింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక నష్టం అంచనా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని 14 మండలాల్లో 107 గ్రామాల్లోని 2077 మంది రైతులకు ఈ వర్షం నష్టాలను మిగిల్చింది. పత్తి పంటలు చేతికి వచ్చినప్పటికీ వ్యవసాయ కూలీలు లభించక పత్తిని ఏరకపోవడంతో వర్షాలమూలంగా పంట తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండిన కంది మార్కెట్లకు తరలించగా మార్కెట్లలో కొనుగోలు ఆలస్యం కావడంతో కంది బస్తాలు తడిసిపోయాయి.

ప్రభుత్వ అధికారులు పంట నష్టం అంచనావేసేందుకు రంగంలోకి దిగారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పత్తి, కంది, మిర్చి పంటలు నీటిలో మునిగిపోయి ఉన్నాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని హాజీపూర్, లక్షెట్టిపేట, నస్పూర్, జన్నారం, దండేపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి, తాండూర్, కోటపల్లి, బెల్లంపల్లి, నెన్నెల మండలాల్లో పత్తి, మామిడి, కంది, కూరగాయల పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. కన్నెపల్లి మండలంలో పసుపు, కంది పంటలు చేతికి వచ్చిన సమయంలోనే వర్షానికి తడిచిపోయాయి. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు పత్తి, వరి ధాన్యం పంటలు నష్టపోగా గత మూడు రోజులుగా కురుస్తున్న వాన వల్ల మరోసారి నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కూలీలు లభించకపోవడం వల్ల పత్తి ఏరడాన్ని ప్రారంభించకపోగా అకాల వర్షం కారణంగా తడిచి ముద్దగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పత్తి నాణ్యత పేరుతో కొనుగోలు చేసేందుకు సిసిఐ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తుండగా తడిసిన పత్తిని అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి, వేమ నపల్లి, చెన్నూర్ ప్రాంతాల్లో రైతులు మిర్చి పంటలను నష్టపోయారు. కొమురంభీం జిల్లాలోని దహెగాం, కౌటాల, పెంచికల్‌పేట, చింతలమానెపల్లి, బెజ్జూర్, రెబ్బెన, వాంకిడి మండలాల్లో రైతులు పత్తి పంటలను రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి తడిసి కిందపడి పోగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని రైతులు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావల్సిన పత్తి ఎదుగుదల లేక ఎకరానికి 5 క్వింటాళ్లు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

అంతే కాకుండా పత్తి ప్రారంభంలో బహిరంగ మార్కెట్‌లో రూ. 5,800 వరకు పలుకగా వారం రోజుల్లోనే ధరలు పడిపోయాయి. ధరలు పెరిగితే విక్రయించుకుందామని రైతులు ఆశ పడగా సిసిఐ ద్వారా పత్తిని విక్రయిస్తే ప్రభుత్వ మద్దతు ధర రూ. 5050 లభిస్తుందని ఆశ పడితే అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దమందడి మండలంలో 469 ఎకరాల్లో 183మంది రైతులకు చెందిన వేరుశనగ పంటకు వర్షం కారణంగా నష్టం వాటిల్లినట్లు ఆయా గ్రామాల విఆర్‌ఓలు తెలిపారు. మంగళవారం పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి తెలియచేయనున్నట్లు విఆర్‌ఓలు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ మండలంలో మిర్చి పంటకు లక్షల్లో నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లా మనుగూరు సబ్‌డివిజన్‌లో కర్కగూడ మండలంలోని చిరుమళ్ల, భట్టుపల్లి, తినపాక మండలంలో ఎల్చిరెడ్డిపల్లి, వెంకట్రావ్‌పేట, దిగునేపల్లి, చింతలబయ్యారం, టి.కొత్తగూడెం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో ఆరబోసిన మిర్చి పూర్తిగా తడిసిపోయింది. నీటిలో ఉన్న మిర్చిని ఆరబోసేందుకు వర్షం నీటిని చేతులతో ఎత్తివేస్తున్నారు. సోమవారం కూడా చిరుజల్లులు కురవడంతో రైతులు మరింత ఆవేదనకు గురవుతున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వరంగల్ జిల్లా తొర్రూరు మండలంలో కోసి కుప్పలుగా పోసిన మిర్చి తడిసిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిర్చి వర్షంనీటికి కొట్టుకుపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో మార్కెట్‌కు తీసుకువచ్చిన కంది పంట తడవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. మార్కెట్‌కు తరలించిన కందులు రవాణ చేయకపోవడంతో వర్షానికి తడిసిముద్దయింది. కొల్హాపూర్ నియోజకవర్గంలో శనివారం 6, ఆదివారం 16.6, సోమవారం 6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి పశుగ్రాసం సైతంతడిసిపోయింది.



ఘరానాదొంగ అరెస్టు

2.10 కిలోల బంగారు ఆభరణాలు, 7.5 కిలోల వెండి స్వాధీనం


మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : రాత్రి సమయంలో ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను, అతడికి సహకరిస్తున్న ముగ్గురిని రాచకొండ స్పెషల్ టీమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 2.10కిలోల బంగారు ఆభరణాలు, 7.5 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా, తంగెలముడి మండలం, చిన్న మల్లేపల్లి గ్రామానికి చెందిన వేముల నటరాజ్ ఆయుర్వేదిక్ వ్యాపారం చేస్తున్నాడు. గతంలో ఆటో నడిపాడు. నగరంలోని రోడ్‌నంబర్ 10, బంజారాహిల్స్, విస్టా ఆస్పత్రి వద్ద ఉంటున్నాడు. 2005 నుంచి తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పశ్చిమ గోదావరిలో 16 కేసులు నమోదయ్యాయి. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 47 దొంగతనాలకు పాల్పడ్డాడు. కుషాయిగూడ డివిజన్‌లో 24 కేసులు నమోదయ్యాయి. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో 24 కేసులు, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 కేసులు, కీసర పిఎస్ పరిధిలో 10 కేసులు నమోదయ్యాయి. నటరాజ్‌కు ఆరుగురు వ్యక్తులు సహకరిస్తుండగా, ముగ్గురిని అరెస్టు చేశారు. ముగ్గురు పరారీలో ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పోలిమెట్ల రాజశేఖర్ అలియాస్ స్టీఫెన్, మెదక్ జిల్లా ఇమామ్ పూర్‌కు చెందిన వడ్ల కృష్ణ చారా ఫిల్మ్ రైటర్, మెదక్ జిల్లా తూపురాన్ గ్రామానికి చెందిన గోల్డ్ స్మిత్ రాయారపు నరేష్ దొంగిలించిన సొత్తుకు రిసీవర్‌గా వ్యవహరిస్తూ సహకరిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల విలువ రూ.75లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

స్థానికుల సహకారంతో..

జవహర్‌నగర్ దమ్మాయిగూడలో బ్యాగు పట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో స్థానికులు జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చిరు. వెంటనే పోలీసులు వచ్చి నిందితుడిని అరెస్టు చేశారు. ఇళ్ల తాళాలను పగుల గొట్టేందుకు ఉపయోగించే కిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల సహకారంతో రాచకొండ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను రాచకొండ కమిషనర్ అభినందించి అవార్డు అందజేశారు. దొంగలను పట్టుకునేందుకు సహకరించిన నలుగురు స్థానికులను సన్మానించనున్నట్లు సిపి మహేష్ భగవతి తెలిపారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో విషాధం



మన తెలంగాణ/మల్కాజిగిరి : ఉద్యోగం కోసం వచ్చి కరెంట్ షాక్ తగిలి యువకుడు మృతి చెందిన సంఘటనతో మల్కాజిగిలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన విరాల ప్రకారం మహబూబ్‌నగర్ వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం మునిమాముల గ్రామానికి చెందిన అంజనేయులు శంకరమ్మ దంపతుల రెండవ కుమారుడు అరవింద్(19) ఆర్మీ సెలక్షన్స్ కోసం అదివారం మౌలాలిలోని జేటిఐఎస్ వద్ద గల ఆర్‌పిఎఫ్ సెంటర్‌కు వచ్చాడు. సోమవారం ఉదయాన్నే సెలక్షన్ ఉండటంతో అదివారం సెంటర్ సమీపంలోనే ఫుట్‌ఫాత్‌పై నిద్రించి సోమవారం ఉదయం 4గంటల ప్రాంతంలో బహిర్భూమికని ఈస్టు అనంద్‌బాగ్‌లోని ఖాళీ ప్రదేశానికి వెళ్లాడు. చీకటి ఉండటంతో పైన ఉన్న కరెంట్ వైర్ తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం మృతదేహన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి గాంధీ ఆసుపత్రికి వెళ్లి మృతుని తల్లిదండ్రులను ఓదార్చారు. విద్యుత్ అధికారులతో స్వయంగా మాట్లాడి 5 లక్షల రూపాయలు, ప్రభుత్వ పరంగా లక్ష రూపాయలు, వ్యక్తిగతంగా తను లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తానని తెలిపారు. మైనంపల్లి సోషల్ అర్గనైజేషన్ నుంచి మృతుడి తండ్రి అంజనేయులుకు 25 వేల రూపాయలు అందజేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. సిఐ మన్మోహన్‌తో పాటు కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, అకుల నర్సింగ్‌రావు మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మేకలరాముయాదవ్, అమినుద్దిన్, సతీష్‌కుమార్, అయుబ్, విద్యుత్ అధికారులు ఆసుపత్రికి వెళ్లారు.

మునిమాములలో విషాదఛాయలు..

ఉద్యోగం కోసం వెళ్లిన కొడుకు మృతదేహమై రావడంతో మృతుడి తల్లిదండ్రులు,బంధువులు తీవ్రంగా దుక్కిస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండేవాడని పలువురు గ్రామస్తులు వాపోయారు. కొడుకు ఎదిగి ఉద్యోగం సాధించి తమకు అండగా ఉంటాడనుకుంటే శవమై కనిపించడని గుండెలు బాధుకుని దుక్కించడం చూచి పలువురు రోధించారు.

వైరాలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు



మన తెలంగాణ/వైరా : వైరాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసిపి రెహ్మాన్ ఆధ్వర్యంలో సిఐ తిరపతిరెడ్డి, ఎస్సైనాగుల్ మీరా దాడులు నిర్వహించగా అక్రమంగా హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలో శంకర్ అనే వ్యక్తి వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 8 సిలిండర్లను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. అనంతరం సిలిండర్లను, శంకర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హాజరుపరిచి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ఎవరైనా అక్రమాలకు పాల్పడినా, దొంగ వ్యాపారాలు చేసినా చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్ళు జాలాది పార్థసారథి, శ్రీనివాస్, ఆదినారాయణ, వెంకట్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్విటర్‌లో ఎంపి కవిత సమాధానాలు



మన తెలంగాణ/నిజామాబాద్ : నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా అయిన ట్విటర్‌లో ప్రజల సమస్యలకు సమాధానాలు తెలియజేస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీన మధ్యాహ్నం 1గంటకు లైవ్‌లో అందుబాటులో ఉంటారన్నారు. #ASkmpkavitha హ్యాష్‌ట్యాగ్‌పైన ప్రజలు ప్రశ్నలను పంపితే ఎంపి కవిత వాటికి సమాధానం తెలియజేస్తానన్నారు. ఎంపితో నేరుగా మాట్లాడే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మున్సిపాలిటీలకు పచ్చదనం శోభ

- హరితహారంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం
- 700 ఖాళీ స్థలాలను గుర్తించిన మున్సిపల్ శాఖ
- 36వేల ఎకరాల బఫర్‌జోన్‌లోనూ విరివిగా మొక్కల పెంపకం
- రూ. 250 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేసిన అధికారులు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు పచ్చదనం శోభను సంతరించుకోనున్నాయి. హరితహారం కార్యక్రమం కింద మున్సిపాలిటీల్లోని ప్రాంతాల్లో పెద్దఎత్తున మొక్కలను నాటనున్నారు. దీని కోసం మున్సిపల్ శాఖ ఇప్పటికే 700 ఖాళీ స్థలాలను గుర్తించింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 68 మున్సిపాలిటీల్లో కొన్నింటిలో అటవీ బ్లాక్లులు కూడా ఉన్నాయి. అందులో 36వేల ఎకరాల బఫర్‌జోన్ ప్రాంతం కూడా ఉన్నట్లు గుర్తించారు. బఫర్‌జన్‌లో ఎలాంటి కట్టడాలు, అన్యాక్రాంతానికి గురికాకుండా ఉండేందుకు పెద్దఎత్తున మొక్కలను నాటనున్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను సైతం మున్సిపల్ శాఖ సిద్ధం చేసింది. వాస్తవానికి పట్టణ ప్రాంతాల్లో ఉండాల్సిన పచ్చదనం శాతం మరీ తక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం పట్టణ స్థానిక సంస్థల పరిధి (యుఎల్‌బి)లో 33 శాతం పచ్చదనం ఉండాల్సి ఉండగా కేవలం 6 నుంచి 10 శాతం వరకే గ్రీనరీ ఉంది. అంటే సగాని కంటే తక్కువగా పచ్చదనం ఉండడం వల్లే పట్టణ ప్రాంతాల్లో వాతావరణ సమతుల్యం పూర్తిగా దెబ్బతింటోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో గజం స్థలం విలువ రోజురోజుకు పెరుగుతుండడంతో మొక్కల పెంపకానికి కేటాయించాల్సినంత స్థలాన్ని ఇళ్ళ యజమానులు కేటాయించలేకపోతున్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం రోజురోజుకు తగ్గిపోతోంది. దీని కారణంగానే వాతావరణ సమతుల్యం దెబ్బతింటోంది. అదే సమయంలో పట్టణాల్లో వాహనాల సంఖ్య కూడా బాగా పెరిగిపోతోంది. దీంతో వాహనాల నుంచి వెలువడుతున్న పొగ కాలుష్యం సైతం అంతకంతకు పెరిగిపోతోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో ప్రజల ఆరోగ్యంపై మరింత ప్రభావం చూపే అవకాశముంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. హరితహారం కార్యక్రమం కింద రాష్ట్రాన్ని పచ్చ తెలంగాణగా మార్చాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే పలు మార్లు హరితహారం కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించి మొక్కలను విస్తృతంగా నాటాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రానున్న వర్షాకాలంలో మొదలయ్యే హరితహారం కార్యక్రమం కింద పెద్దఎత్తున మొక్కలను నాటేందుకు మున్సిపల్ శాఖ పలు ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీల్లో పచ్చదనం కోల్పోయి అధ్వాన్నంగా ఉన్న పార్కులను సైతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. అలాగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో లేఅవుట్ నిబంధనల ప్రకారం కొంత స్థలంలో పార్కుల కోసం కేటాయించాలి. వాటిని కాలనీ పార్కులుగా అభివృద్ధి చేయాలి. కానీ అనేక లేఅవుట్‌లో బిల్డర్లు పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లుగా కాగితాల్లో మాత్రమే చూపించారు. సంబంధిత మున్సిపాలిటీల అధికారులు ఏ మాత్రం దృష్టి సారించకపోవడంతో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు నిరూపయోగంగా పడి ఉంటున్నాయి. ఫలితంగా కొత్తగా ఏర్పడిన కాలనీల్లో సైతం ఆశించిన స్థాయిలో పార్కుల నిర్మాణం జరగడంలేదు. అలాంటి లేఅవుట్లపై మున్సిపల్ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆయా స్థలాల్లో ం పార్కుల నిర్మాణం చేసేందుకు అవసరమైన కసరత్తు కూడా చేస్తోంది. లేఅవుట్లలో లభించే స్థలం విస్తీర్ణతను బట్టి చిల్డ్రన్ పార్కులు, ట్రీ పార్కులు, స్మృతి వనాలుగా తీర్చిదిద్దనున్నారు. అలాగే యుఎల్‌బిల్లోని అన్ని రహదారులకు ఇరు వైపులా పెద్ద ఎత్తున మొక్కలను పెంచనున్నారు. రోడ్ మీడియన్లలో ఉన్న గ్రీనరీ శాతాన్ని మరింతగా పెంచనున్నారు. ఇక ఫారెస్టు రిజర్వు ప్రాంతాల్లో అదనంగా మొక్కలను నాటనున్నారు. మున్సిపాలిటీలు, రిజర్వు ఫారెస్టుల మధ్య నున్న బఫర్‌జోన్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలను నాటాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. ఇప్పటికే గుర్తించిన 700 ఖాళీ స్థలాలు అన్యాకాంతం కాకుండా జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేస్తూ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే కూడా పూర్తి చేశారు. కొన్ని స్థలాల్లో పార్కులకు సంబంధించిన సివిల్ పనులను కూడా మొదలుపెట్టారు. గుర్తించిన 700 స్థలాల్లో 140 పార్కులు కూడా ఉన్నాయి. ఈ పార్కులకు ప్రహరిగోడల నిర్మాణం, వాకింగ్‌పాత్‌లు, లాన్‌లు, చిన్నారులు ఆడుకునే పరికరాలు, ఇంకుడు గుంతల నిర్మాణంతో వర్మి కంపోస్ట్ యార్డులు, వాచ్‌మన్‌రూమ్‌లు కూడా విధిగా ఏర్పాటు చేస్తారు. అయితే అర ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలం ఉన్న పార్కుల్లోనే ఈ సౌకర్యాలను కల్పిస్తారు. ఇందుకుగానూ ఒక్కొక్క పార్కు నిర్మాణం యాభై లక్షల నుంచి రెండు కోట్ల రూపాయల మేరకు ఖర్చు అవుతుందని మున్సిపల్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా హరితహారం కింద విస్తృతంగా మొక్కల పెంపకానికి మొత్తంగా రూ.250 కోట్ల మేరకు అవసరం ఉంటుందని మున్సిపల్ శాఖ భావిస్తోంది. అయితే ఈ నిధులను ఎలా సేకరించాలన్న అంశంపై మున్సిపల్ శాఖ తర్జన, భర్జన పడుతోందని తెలుస్తోంది.

అప్పుల బాధతో రైతుల ఆత్మహత్య



మృతిచెందిన పోచయ్య, నర్సయ్య

మన తెలంగాణ/నందిగామ : అప్పుల బాధతో రైతు ఉరివేసుకుని అత్మహత్య చేసుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోత్కుల గూడ గ్రామ శివారులో అదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివారల ప్రకారం రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం, కేశారం గ్రామానికి చెందిన తోట రామయ్య తండ్రి పోచయ్య 54 సంవత్సరాలు తనకు గల వ్యవసాయ పోలంలోని పంటకు అప్పు తీసుకొని పంట పండించాడు. అయితే పంటకు గిట్టుబాటు ధర రాక పోవడంతో అప్పు తీర్చలేక మానసిక బాధతో జీవితంపై విరక్తి చెంది అదివారం సాయంత్రం నందిగామ మండలం మోత్కులగూడ శివారులో గల తన పోలంలోని వేప చెట్టుకు ఉరివేసుకుని అత్మహత్య చేసుకొని మృతి చెందాడు. రైతు కుంటుంబానికి సమాచారం తెలిసిన వెంటనే పోలం దగ్గరకు వెళ్లె సరికి రైతు మృతి చెందడంతో వెంటనే నందిగామ పోలీసులకు సమాచారం అందచేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు తోట నర్సింలు ఫిర్యాదు మేరకు ఏఎస్సై రాంచెందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భీమ్‌గల్ : నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన రైతు ఆలూరు నర్సయ్య అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఇంటి నుండి బయ టకు వెళ్లిన నర్సయ్య ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా గ్రామ శివారులోని పంట పొలం గట్టు వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై ఉరేసుకొని చని పోయినట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మంగపేటలో ఎన్నికలు నిలిపివేత



మనతెలంగాణ/మంగపేట : మండలంలోని పాత 18 గ్రామ పంచాయతీలతో పాటు నూతనంగా ఏర్పడిన పంచాయతీలను కలుపుకుని 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలను నిలిపి వేయాలని ఎన్నికల సంఘానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇందులో భాగంగానే మంగపేట మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికలను నిలిపివేస్తున్నట్టు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజయ్ కుమార్ నోటీసులను జారీ చేశారు. ఈ నోటీసులను స్థానిక గిరిజనేతరులు సోమవారం ఎన్నికల అధికారి భీంరెడ్డి రవిందర్‌రెడ్డికి అందజేశారు. గత 2011లో మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలు గిరిజన గ్రామాలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం అప్పట్లో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో మంగపేట మండలం గిరిజన మండలం కాదని గిరిజనేతరులు కోర్టులో కేసు వేశారు. దీంతో మండలంపై కోర్టు స్టే విధించింది. దీంతో అప్పటినుంచి 2019 వరకు ఎన్నికలను నిర్వహించలేదు. అయితే జనవరి 30న ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో అధికారులు ఎన్నికలకు సిద్ధమయ్యారు. కాగా ఈ ఎన్నికలను బహిష్కరిస్తూ మండలానికి చెందిన దళిత సంఘాల నాయకులు గోనె తిరుపతి, బోడ రమణయ్య, దామల్ల రత్నాకర్, చింతా పరమాత్మ తదితరులు మరోసారి కోర్టులో పిటీషన్ వేశారు. దీంతో సుమారు మూడు రోజుల పాటు వాదనలు నిర్వహించిన అనంతరం మంగపేట ఎన్నికలను నిలిపేయాలని కోర్టు తీర్పు వచ్చిన అనంతరం ఎన్నికలను నిర్వహించాలని న్యాయమూర్తి సంజయ్ కుమార్ తీర్పును వెలువరించారు. కోర్టు తీర్పుకు చెందిన నోటీసులను మండలంలోని గిరిజనేతరులు మధ్యాహ్నం ఎన్నికల అధికారి(ఎంపీడీఓ) భీంరెడ్డి రవిందర్ రెడ్డికి అందజేశారు. కాగా సోమవారం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం సాయంత్రం వరకు కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి అదేశాలు రాలేదని ఎన్నికలను నిలుపుదల చేయడం కుదరదని ఆయన తెలిపారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చేంత వరకు ఎన్నికలకు సంబంధించిన పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనేతరులు సిద్దంశెట్టి వైకుంటం, జాగర్ల మూడి నాగేశ్వరరావు. పగిడిపల్లి వెంకటేశ్వర్లు, మండవ రామక్రిష్టతో పాటు తదితరులు ఉన్నారు.

సిఎం ఆదేశంతో కదిలిన యంత్రాంగం

- అడవుల సంరక్షణపై దృష్టి
- పోలీస్, అటవీశాఖల ఆధ్వర్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- కలప స్మగ్లర్లపై పిడి యాక్ట్



మనతెలంగాణ/ఆదిలాబాద్ ప్రతినిధి : అటవీ ప్రాంతాన్ని పరిరక్షించడంతో పాటు వన్యప్రాణుల వేటను సమూలంగా నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించడంతో జిల్లా అధికార యంత్రాంగం ఈ విషయంపై దృష్టి సారించింది. జిల్లాలోని ఇచ్చోడతో పాటు మంచిర్యాల జిల్లా మందమర్రిలో పులి చర్మాలు లభ్యం కావడం, మంచిర్యాల పరిసరాలలో చిరుతపులి ఉచ్చులో చిక్కుకొని మరణించిన విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అలాగే స్మగ్లర్లు యధేచ్చగా విలువైన కలపను అక్రమంగా తరలిస్తుండటంతో జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీప్రాంతం కాస్తా మైదానంగా మారుతోంది. దీనిపై కఠినంగా వ్యవహరించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ స్మగ్లర్లు భౌతికదాడులకు పాల్పడుతుండటంతో ఆశించిన ఫలితాలు కనిపించలేదు. స్మగ్లర్ల దాడిలో అటవీశాఖ సిబ్బంది మరణించిన సందర్భాలు సైతం చోటు చేసుకోవడం, రాళ్లతో దాడి చేసిన సందర్భాలలో తీవ్రగాయాల పాలవడంతో స్మగ్లర్లను అరికట్టేందుకు అటవీశాఖ ఉద్యోగులు వెనుకాడాల్సిన పరిస్థితులు నెలకొనేవి. ఇలాంటి సందర్భాలలో ఆయుధాలు ఇవ్వాలని సైతం డిమాండ్ చేస్తూ వచ్చారు. అయితే ఆయుధాలు సమకూర్చే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ప్రభుత్వం పోలీస్ శాఖతో కలిసి స్మగ్లర్లను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా సిరికొండ మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్‌పై పిడి యాక్టు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇతనిపై 21 అక్రమ కలప రవాణ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. త్వరలోనే మరి కొందరిపై పిడి యాక్టు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కలప అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుండడంతో స్మగ్లర్లు కొంత వెనుకంజ వేస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే జిల్లాలో అక్రమ కలప రవాణను పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ స్పష్టం చేవారు. అటవీ, పోలీసు అధికారులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాయుధ పోలీసులతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టి అడ్డుకొనేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దీంతోపాటు జిల్లాలో కలప రవాణా చేసే ప్రాంతాలలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాలలో ఇళ్లల్లో తనఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన కలపను స్వాధీనం చేసుకొని మరోసారి చెట్లను నరికితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తున్నారు. అటవీ ప్రాంతంలోని వెళ్లకుండా ముమ్మర తనిఖీలు చేపడుతూ అటవీ ప్రాంతాల్లోకి వచ్చే వారిని నిరోధించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.



ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో

ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు

మన తెలంగాణ / సిద్దిపేట రూరల్ : ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంఘటన సిద్దిపేట శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట మెరీడియన్ స్కూల్లో జరుగుతున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో చింతమడక గ్రామానికి చెందిన కేవీఆర్ ఎస్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు తాము రూపొందించిన ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించి, తిరిగి తమ సొంత గ్రామమైన చింతమడకకు చెందినఆటోలో తమ టీచర్లు అజిత్, శోభారాణిలతో కలిసి వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌తో పాటు అతని స్నేహితుడు ప్రసాద్, అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రులను సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఆటో డ్రైవర్ కూస దినేష్(22), అతని స్నేహితుడు ప్రసాద్(22)కి కాలు ఫ్యాక్చర్ అనగా, విద్యార్థులు స్రవంతి, భరత్‌కుమార్, అరవింద్, కార్తీక్, స్వాతిలకు గాయాలు కాగా అందులో రత్నాకర్, శరణ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న లారీ డ్రైవర్ లారీతో పాటు పరారవడం గమనార్హం. గాయపడిన విద్యార్థులను జిల్లా విద్యాధికారి రవికాంతరావు పరామర్శించి, మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఈ సంఘటన గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

యాదాద్రిలో స్వాతినక్షత్ర పూజలు

- శ్రీవారి కొండకు గిరిప్రదక్షిణలు చేసిన భక్తులు
- స్వామివారికి మూడు బంగారు పుష్పాల బహూకరణ
- శ్రీవారి నిత్యరాబడి రూ.11.29 లక్షలు



శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో కూడాభక్తుల పూజలను నిర్వహించి శ్రీలక్ష్మీ నరసింహుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరంచారు.

మన తెలంగాణ/యాదాద్రి : యాదగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలను వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు బాలాలయం తెరిచి సుప్రభాత, అభిషేకాల అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శతఘటాభిషేకం నిర్వహించారు. శ్రీవారి ఆలయంలో అర్చక స్వాములు 108 కలశాలతో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలతో శతఘటాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మి నరసింహ స్వామి జన్మనక్షత్రం స్వాతి కావడంతో స్వామి వారి దర్శనార్థం అనేక ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు, స్థానికులు తెల్లవారుజామునుండె యాదాద్రి కొండకు గిరి ప్రదక్షణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి దర్శనార్థం తరలివస్తున్న భక్తులు పిల్లాపాపలతో స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయంలో జరుగు నిత్య కైంకర్య పూజలు సుప్రభాత సేవ, అభిషేక, అర్చన, కళ్యాణ మహోత్సవం, శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రతపూజలు కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి అనుబంధ ఆలయాలైన పాతగుట్ట

శ్రీవారి నిత్యరాబడి

శ్రీలక్ష్మి నరసింహా స్వామివారి దేవస్థానం స్వామివారి నిత్యరాబడిలో భాగంగా సోమవారం రోజున 11 లక్షల 29 వేల 991రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి తెలిపారు. ప్రధాన బుకింగ్, శ్రీఘ్రదర్శనం, వ్రతాలు, కళ్యాణ కట్ట, ఎంక్వైరీ, ప్రసాదాలు, వాహన పూజల ద్వారా శాఖల వారిగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

గుండెపోటుతో జీవిత ఖైదీ మృతి

మన తెలంగాణ/చర్లపల్లి : చర్లపల్లి కేంద్రకారాగారంలో జీవిత ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న బాగ్‌చంద్ సురణ(80) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. చర్లపల్లి జైలు అధికారులు, కుషాయిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రిసాలబజార్‌కు చెందిన బాగ్ చంద్‌సురణ హత్య కేసులో నిందితుడు 2013 సంవత్సరం కోర్టు ఇతనికి జీవితఖైదీగా శిక్ష విధించింది. అప్పటి నుంచి బాగ్ చంద్‌సురణ చర్లపల్లి జైల్లో జీవితఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. గత కొంత కాలంగా బిపి, షుగర్ వంటి పలు వ్యాధులతో బాధపడుతున్నాడని జైలు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో చాతిలో నొప్పి వస్తుందని తోటి ఖైదీలకు చెప్పడంతో ఖైదీలు జైలు అధికారులకు తెలిపారు. చికిత్స నిమిత్తం వెంటనే జైలు వాహనంలో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు తెలిపారని జైలు అధికారులు వివరించారు. ఈ మేరకు జైలు అధికారులు కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నా బయోపిక్‌ను నా కుమారుడు జునైద్ ఖాన్ చేయగలడు. అతనే సరైన ఛాయిస్. జునైద్ నటనలో శిక్షణ పొందాడు. దాదాపు ఏడాదిగా రంగస్థల నాటకాల్లో నటిస్తున్నాడు. ఇక జునైద్ బాలీవుడ్ అరంగేట్రానికి ఓ మంచి స్క్రిప్ట్ కోసం చూస్తున్నాను.

-బాలీవుడ్ స్టార్ అమీర్‌ఖాన్

లగ్జరీ కార్లలో విలాసవంతమైన ప్రయాణం


రవితేజ


టాలీవుడ్‌లోని టాప్ హీరోలంతా ఖరీదైన హైఎండ్ కార్లను ఉపయోగిస్తున్నారు. ప్రభాస్, రామ్‌చరణ్, ఎన్టీ ఆర్, అల్లుఅర్జున్, రానా,నాగార్జున, అఖిల్, నాగచైతన్య సహా పలువురు స్టార్ హీరోలు అధునాతన సౌకర్యాలు ఉన్న హై క్లాస్ కార్లను వినియోగిస్తున్నారు. వీళ్లందరితో పోటీపడుతూ మాస్ మహా రాజా రవితేజ కూడా లగ్జరీ కార్లను ఉపయోగిస్తున్నారు. ఈ స్టార్ హీరో రెగ్యులర్‌గా ఉపయోగిస్తున్న రేంజ్ రోవర్ ఎవోక్ విలువ అక్షరాల రూ.63.82 లక్షలు ఉంటుందట. అలాగే రూ.1.24 కోట్లు వెచ్చించి బిఎండబ్ల్యు ఎం6 కారును ఆయన సొంతం చేసుకున్నారు. వీటన్నిటికంటే ఖరీదైన మెర్సిడెస్ బెంజ్ ఎస్ క్లాస్ రవి తేజ వద్ద ఉంది. దీని విలువ రూ.2.43 కోట్లు. ఈ మూడు కార్లను సందర్భాన్ని బట్టి ఆయన ఉపయోగిస్తుంటారు. ఇక రవితేజ నటించిన గత చిత్రం 'అమర్ అక్బర్ ఆంటోని' బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి కథలపై చాలా జాగ్రత్త వహిస్తున్నారట. తాజాగా ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై 'డిస్కో రాజా' అనే చిత్రంలో రవితేజ నటిస్తున్నారు. ఇటీవల లాంచ్ చేసిన టైటిల్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. రవి తేజ కెరీర్‌కు ఎంతో ముఖ్యమైన చిత్రమిది.

అనుకున్న లక్ష్యాన్ని చేరుకోకుంటే పెళ్లి చేసుకోవద్దనుకున్నా


విజయ్

యంగ్ స్టార్ విజయ్ దేవరకొండ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. అర్జున్ రెడ్డి, గీత గోవిందం, టాక్సీవాలా వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు అతనికి యూత్‌లో తిరుగులేని క్రేజ్‌ను సంపాదించి పెట్టాయి. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ యూత్‌కు కొన్ని మంచి విషయాలు చెప్పారు. ''జీవితంలో నేను కొన్ని మంచి సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాను. ఏ పని చేసినా కూడా డెడ్‌లైన్ పెట్టుకొని చేస్తాను. డెడ్‌లైన్ పెట్టుకొని పనిచేస్తే మంచి ఫలితం ఉండే అవకాశం ఉంది. ఇక చిత్ర పరిశ్రమలో లీడ్ యాక్టర్స్‌కు లోటు ఉంది. దాన్ని గుర్తించి స్టార్‌గా ఎదగాలని ప్రయత్నాలు చేస్తున్నాను. హీరో అవకాశాల కోసం కూడా డెడ్‌లైన్ పెట్టుకున్నాను. 25 ఏళ్లు వచ్చే వరకు ప్రయత్నాలు చేసి ఆతర్వాత కూడా రాకుంటే రచయితగా లేదంటే దర్శకత్వ విభాగానికి వెళ్లి పోవాలనుకున్నాను. ఇక జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోకుంటే పెళ్లి చేసుకోవద్దనుకున్నాను. పెళ్లి చేసుకుంటే బాధ్యతలు చాలా ఉంటాయి. కాబట్టి లక్ష్యాన్ని చేరుకోనప్పుడు పెళ్లికి దూరంగా ఉండాలని భావించాను''అని అన్నారు. విభిన్నమైన చిత్రాలతో యూత్‌ను కట్టిపడేస్తున్న విజయ్ దేవరకొండ తన మాటలతో కూడా యువతలో స్ఫూర్తిని నింపుతున్నారు. ప్రస్తుతం విజయ్ 'డియర్ కామ్రేడ్' చిత్రంలో నటిస్తున్నారు. వేసవిలో విడుదల కాబోతున్న ఈ చిత్రానికి భరత్ కమ్మ దర్శకత్వం వహిస్తున్నారు. కొత్త దర్శకులతో ఆయన చేసిన సినిమాలు మంచి ఫలితాలను దక్కించుకుంటున్నాయి కాబట్టి ఈ చిత్రం కూడా విజయం సాధిస్తుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక మైత్రి మూవీస్ బ్యానర్‌లో ఒక చిత్రాన్ని, క్రాంతిమాధవ్ దర్శకత్వంలో మరో చిత్రాన్ని విజయ్ దేవరకొండ చేస్తున్నారు.

చైతూ కోసం స్టార్ రైటర్ ప్రేమ కథ


నాగచైతన్య

ఈమధ్య కాలంలో పెద్ద హిట్స్ రాకపోవడంతో అక్కినేని నాగచైతన్య కాస్త వెనకడ్డారు. ఎలాగైనా మంచి హిట్‌తో కెరీర్‌లో దూసుకుపోవాలని చైతన్య భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగచైతన్య కోసం స్టార్ రైటర్ విజయేంద్ర ప్రసాద్ ఓ మంచి లవ్ స్టోరీ రాస్తున్నారని తెలిసింది. ఇది విభిన్నమైన ప్రేమ కథా చిత్రమట. తాజా సమాచారం ప్రకారం పాత 'దేవదాస్' కథ ఆధారంగా అంతటి గొప్ప విషాదాంతమైన ప్రేమ కథను చైతూ కోసం విజయేంద్ర ప్రసాద్ రాస్తున్నారట. అయితే ఈ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహిస్తారో ఇంకా తెలియాల్సి ఉంది. ఇక ప్రస్తుతం శివ నిర్వాణ దర్శకత్వంలో నాగచైతన్య 'మజిలీ' చిత్రంలో నటిస్తున్నారు. పెళ్లయిన తర్వాత తన సతీమణి సమంతతో కలిసి ఆయన నటిస్తున్న తొలి చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో నాగచైతన్య బిజీగా ఉన్నారు.

కోలీవుడ్‌లో హవా


రకుల్‌ప్రీత్ సింగ్

తన అందచందాలతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసి కొంతకాలం మరో హీరోయిన్ ఆప్షనే లేకుండా చేసింది రకుల్‌ప్రీత్ సింగ్. అయితే ఎప్పుడయితే టాలీవుడ్‌ను కాదని బాలీవుడ్‌కు వెళ్లిందో ఆ క్షణం నుండి రకుల్‌ను పట్టించుకోవడం మానేశారు తెలుగు ప్రేక్షకులు. ఎంత ప్రయత్నించినా ఇప్పుడు ఆమెకు తెలుగులో అవకాశాలు రావడం లేదు. అయితే ఎలాగోలా 'ఎన్టీఆర్' బయోపిక్‌లో ఛాన్స్ దక్కించుకున్న ఈ ముద్దుగుమ్మకు దాంతోనూ చుక్కెదురైంది. ఇదిలాఉండగా తమిళంలో మాత్రం రకుల్ హవా బాగానే నడుస్తోంది. తమిళ తంబీలు అమ్మడి గ్లామర్‌ను చూసి మైమరచిపోతున్నారట. అక్కడ సూర్య, కార్తి సినిమాలతో బిజీగా ఉంది రకుల్. త్వరలోనే కార్తితో చేస్తున్న 'దేవ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో 'ధీరన్ అధిగారం ఒంద్రు' (తెలుగులో ఖాకీ) చిత్రంతో మంచి పేరు తెచ్చుకుంది ఈ జంట. మరోసారి ఈ కాంబినేషన్‌లో రానున్న 'దేవ్' చిత్రంపైనా మంచి అంచనాలున్నాయి. ఇదో ట్రావెల్ లవ్‌స్టోరీ. ఈ సినిమాలో మధ్యతరగతి అమ్మాయి మేఘన పాత్రలో రకుల్ నటిస్తోంది. మరోవైపు సూర్యతో నటిస్తున్న 'ఎన్‌జికె' చిత్రం కూడా షూటింగ్ దశలో ఉంది. ఇవేకాకుండా యంగ్ హీరో శివకార్తికేయన్ చిత్రంలోనూ రకుల్ నటిస్తోంది. అలాగే బాలీవుడ్‌లో 'అయ్యారీ' సినిమా ఫెయిల్యూర్ తర్వాత అక్కడ మరో రెండు సినిమాల్లో నటించే ఛాన్స్ దక్కించుకుంది ఈ బ్యూటీ.

ఈ ఏడాది చివరలోనే కొత్త చిత్రం


షారుఖ్‌ఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్‌ఖాన్ చిత్రాలు ఈమధ్య పూర్తిగా నిరాశపరుస్తున్నాయి. ఈ సూపర్‌స్టార్‌కు గత కొంతకాలంగా చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిలో అతని దృష్టి సినిమాలకంటే పూర్తిగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ వైపు మళ్లుతోందట. ఇక ఈ ఏడాది చివరలోనే ఈ బాద్‌షా తన కొత్త చిత్రాన్ని ప్రారంభిస్తారని తెలిసింది. 'డాన్' సిరీస్‌లో షారుఖ్ ఓ సినిమా చేస్తారట. అందుకోసం దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఇప్పటికే స్క్రిప్టును సిద్ధం చేసే పనిలో ఉన్నారు. మలేషియాలో ఈ సినిమాను ప్రారంభిస్తారని తెలిసింది. ఏడాది చివరి నాటికి స్క్రిప్టు పూర్తిగా సిద్ధమయితే ఈ సినిమాను పట్టాలెక్కిస్తారట. అయితే ఈ గ్యాప్‌లో ఫర్హాన్ 'తుఫాన్' అనే మరో సినిమాతో బిజీగా ఉంటాడు. ఇక 'డాన్' సిరీస్‌లో మూడో సినిమాకు ప్రస్తుతం సీరియస్‌గానే సన్నాహాలు సాగుతున్నాయి. రితేష్ సిద్వానీ ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. కనీసం ఈ సినిమాతో అయినా షారుఖ్ తాను కోల్పోయిన మార్కెట్‌ను తిరిగి సాధిస్తారో చూడాలి.

పాప నీకేదంటే ఇష్టం


లక్ష్మీ రాయ్

హీరోయిన్ లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నూతన దర్శకుడు కిషోర్ కుమార్ తెరకెక్కిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి'. ఈ చిత్రం నుండి 'పాప నీకేదంటే ఇష్టం' అనే పాటను మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు ఫిల్మ్‌మేకర్స్. ఈ విషయాన్ని చిత్ర బృందం పోస్టర్ ద్వారా అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఇక మెగాస్టార్ చిరంజీవి 'ఖైదీ నంబర్ 150', పవన్‌కల్యాణ్ 'సర్దార్ గబ్బర్‌సింగ్' చిత్రాల్లోని ఐటమ్‌సాంగ్స్‌లో హుషారుగా స్టెప్పులు వేసి అలరించింది లక్ష్మీ రాయ్. కొంత గ్యాప్ తర్వాత 'వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి' చిత్రంతో ఈ భామ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో పూజిత పొన్నాడ నటిస్తోంది. ఎబిటి క్రియేషన్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో నవీన్ నేని, మహత్, పంకజ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

కంటెంట్ బేస్డ్ సినిమా


హేమలతా రెడ్డి, మిషాన్ జైన్

కొత్తతరం ఆలోచనలకు దగ్గరగా ఉండే సినిమాలు బాక్సాఫీస్ దగ్గర నిలబడతాయి అని చాలా చిత్రాలు నిరూపించాయి. అలాంటి సబ్జెక్ట్‌తో శుక్రా ప్రొడక్షన్ బ్యానర్‌లో మిషాన్ జైన్, హేమలతా రెడ్డి హీరోహీరోయిన్లుగా రాబోతున్న చిత్రం టాకీ పార్ట్‌ను పూర్తి చేసుకుంది. పాటల చిత్రీకరణకు సిద్ధమవుతోంది ఈ చిత్రం. కంటెం ట్ బేస్డ్ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమా టైటిల్‌ను త్వరలో ప్రకటిస్తామని నిర్మాత సంజయ్ జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు వి.ఎస్.ఫణీంద్ర మాట్లాడుతూ ''యువతకు సంబంధించిన అంశాలతో ఈ సినిమా రూపొందుతోంది. అలాగే యాక్షన్ ఎపిసోడ్స్ అందరినీ ఆకట్టుకుంటాయి. హీరోహీరోయిన్ల పాత్రలు చాలా బోల్డ్‌గా ఉంటాయి. రాజా రవీంద్ర ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఫిబ్రవరి 4 నుండి సినిమా చివరి షెడ్యూల్‌కు వెళ్తుంది''అని అన్నారు.


నేహాశర్మ

అందాలతో హాట్ హాట్‌గా..

నేహాశర్మ... ఈ పేరు ఎప్పుడో విన్నట్లుంది కదా. స్టార్ హీరో రామ్‌చరణ్ ఎంట్రీ మూవీ 'చిరుత'లో హీరోయిన్‌గా నటించింది ఈ ముద్దుగుమ్మ. ఆరంభం అదిరింది కానీ ఆతర్వాత చెప్పుకోదగ్గ అవకాశాలను దక్కించుకోవడంలో ఈ హాట్ భామ విఫలమైంది. ఏవో ఒకటి, రెండు చిన్నా చితకా సినిమాలు చేసి టాలీవుడ్ నుండి మాయమైపోయింది. ఆతర్వాత బాలీవుడ్‌లో కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంది నేహాశర్మ. అక్కడ ఈ భామ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. అయితే నేహాశర్మ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. హాట్ హాట్ పోజులతో కుర్రకారును మైమరపిస్తోంది ఈ భామ. తాజాగా ఓ ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది నేహా శర్మ. నైట్‌వేర్‌లో అందాలొలికిస్తూ కనిపిస్తోంది ఈ బ్యూటీ. ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్


మేఘ్లా ముక్తా, తనిష్క్ రెడ్డి

'సుబ్రమణ్యపురం' నిర్మాత బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో సింహ ఫిలింస్, దీపాల ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సకలకళావల్లభుడు'. తనిష్క్ రెడ్డి, మేఘ్లా ముక్తా హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి శివగణేష్ దర్శకుడు. ఈ చిత్రం ఫిబ్రవరి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు అనిల్, త్రినాథ్, కిషోర్, శ్రీకాంత్ మాట్లాడుతూ ''అవుట్ అండ్ అవుట్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందింది ఈ చిత్రం. ఇందులో హీరో పర్‌ఫార్మెన్స్, కథ, కథనాలు హైలైట్‌గా నిలుస్తాయి. అలాగే ఇంటర్వెల్ సన్నివేశం ఒకింత ఉత్కంఠకు గురిచేస్తుంది''అని అన్నారు. చిత్ర దర్శకుడు శివ గణేష్ మాట్లాడుతూ ''ఒక హిట్ చిత్రానికి కావాల్సిన ఎలిమెంట్స్ అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి. హీరోహీరోయిన్లు, విలన్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. పృథ్వీ, జీవాల కామెడీ సన్నివేశాలు కడుపుబ్బ నవ్విస్తాయి. ఇప్పటికే విడుదలైన పాటలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి''అని తెలిపారు. సుమన్, అపూర్వ, శృతి, విశ్వ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరాః సాయి చరణ్, సంగీతంః అజయ్ పట్నాయక్, ఎడిటింగ్ః ధర్మేంద్ర

మరోసారి ఆ విషయం చెప్పింది



రాధికా ఆప్టే

బాలీవుడ్ హీరోయిన్ రాధికా ఆప్టే పేరు తెలియని సినీ ప్రేమికులు దాదాపుగా ఉండరు. ఈ హాట్ బ్యూటీ సౌత్ సినిమాల్లో కూడా నటించిన సంగతి తెలిసిందే. రాధిక తెలుగు సినిమాల్లో కూడా నటించింది. ఇప్పటికే సౌత్‌లో ఒక హీరో సినిమా షూటింగ్ సమయంలో తనతో అసభ్యంగా ప్రవర్తించాడని కామెంట్లు చేసిన ఈ భామ తాజాగా మరోసారి అదే విషయాన్ని నో ఫిల్టర్ నేహా షోలో చెప్పింది. ఈ టాక్ షో హోస్ట్ అయిన నేహా ధుపియా ''మీరు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు చేసిన వింత పని ఏంటి రాధికా?''అని అడిగితే... ''నేను సౌతిండియన్ సినిమాలు చేశాను. అక్కడ హీరోయిన్లకు మంచి పారితోషికం ఇస్తారు. అక్కడ చేయడం చాలా కష్టం''అని రాధికా ఆప్టే సమాధానమిచ్చింది. ''ఓ తెలుగు సినిమాకు పనిచేస్తున్న సమయంలో నాకు ఓ చేదు అనుభవం ఎదురైంది. ఓ పెద్ద హీరో నాకు చక్కలిగింతలు పెట్టడం మొదలుపెట్టాడు. నేను వెంటనే స్పందించి అరిచాను. ఎప్పుడూ ఇలాంటి పనులు చేయవద్దని చెప్పాను. ఆతర్వాత అతను మరోసారి ఎప్పుడూ నాతో ఈవిధంగా ప్రవర్తించలేదు''అని రాధికా ఆప్టే పేర్కొంది. ఇక రజనీకాంత్‌తో చేసిన 'కబాలి' సినిమా అద్భుతమైన అనుభవాన్నిచ్చిందని ఆమె చెప్పింది. ఈ సౌతిండియా సూపర్‌స్టార్ మంచి వ్యక్తి అని కితాబిచ్చింది.

హైదరాబాద్ జోన్

నెక్, చికెన్ ధరలు రూపాయల్లో

టోకు గుడ్లు	రూ. 402
రిటైల్ గుడ్డు	రూ. 4.60
ఫారమ్ కోడి	రూ. 83
డ్రెస్డ్ స్కిన్ చికెన్	రూ. 153
స్కిన్‌లెస్	రూ. 173



భారీగా నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. అమ్మకాల ఒత్తిడితో మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 368 పాయింట్లు నష్టపోయి 35,656 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 119 పాయింట్లు నష్టపోయి 10,661 వద్ద స్థిరపడింది. జి ఎంటర్‌టైన్‌మెంట్ షేరు 17శాతం లాభపడింది. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, బజాజ్ ఫైనాన్స్‌లు నష్టపోయాయి. టిసిఎస్, ఎల్ అండ్ టి, కోల్ ఇండియాలు లాభపడ్డాయి. ముఖ్యంగా ఐసిఐసిఐ బ్యాంక్ వరుసగా ఎనిమిదో ట్రేడింగ్ సెషన్‌లో కూడా నష్టాలను మూటగట్టుకుంది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో భారీ కంపెనీలు ఆశించిన ఫలితాలను వెల్లడించకపోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. భారత మార్కెట్లలో నుంచి ఎఫ్‌ఐఐలు అమ్మకాలను కొనసాగిస్తున్నారు.

హైదరాబాద్‌లో జావా తొలి షోరూం

మన తెలంగాణ / హైదరాబాద్: క్లాసిక్ లెజెండ్స్‌కు చెందిన జావా మోటార్ సైకిల్స్ హైదరాబాద్‌లో లభ్యం కానున్నాయి. సోమవారం నగరంలో తొలిసారిగా ఈ సంస్థకు చెందిన మూడు డీలర్‌షిప్‌లను సంస్థ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ థరేజా ప్రారంభించారు. దేశంలో ప్రస్తుతం ఢిల్లీ–ఎన్‌సిఆర్, పుణె, బెంగళూరు, నాసిక్ డెహ్రాడూన్, ముంబై, చెన్నై నగరాల్లో 23 డీలర్‌షిప్‌లు ఉన్నాయి. తాజాగా మరో మూడు జావా డీలర్‌షిప్‌లు దీనికి జతచేరాయి. బంజారాహిల్స్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్‌లలో వీటిని ప్రారంభించింది. జావా, జావా పార్టీటూ ధరలు వరుసగా రూ.1.67,000, రూ.1,58,000(హైదరాబాద్ ఎక్స్‌షోరూం)గా నిర్ణయించారు.

స్టీల్ ఉత్పత్తిలో జపాన్‌ను వెనక్కునెట్టిన భారత్

న్యూఢిల్లీ : స్టీల్ ఉత్పత్తిలో భారత్ మరో ఘనతను సాధించింది. స్టీలు ఉత్పత్తి జపాన్‌ను వెనక్కునెట్టి భారత్ రెండో స్థానానికి చేరింది. 'వరల్ స్టీల్ అసోసియేషన్' సోమవారం ఈ జాబితాను ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న వివిధ దేశాల జాబితాలో 51శాతం వాటాతో చైనా అగ్రస్థానంలో ఉంది. అయితే 2017లో 870.9 మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తితో 50.3 శాతం వాటా కలిగిన చైనా, దానిని 2018లో 928. 3 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేసి 51.3 శాతానికి పెంచుకుంది. భారత్ 2017లో 101.5 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేయగా, 2018లో 4.9శాతం వృద్ధితో 106.5 మెట్రిక్ టన్నులకు పెంచుకుంది.


స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	35656.70	368.84	(-1.02%)
నిఫ్టీ	10661.55	119	(-1.10%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.93
యూరో	80.95
బ్రిటిష్ పౌండ్	93.60
ఆస్ట్రేలియన్ డాలర్	51.03
కెనెడియన్ డాలర్	53.68
సింగపూర్ డాలర్	52.46
స్విస్ ఫ్రాంక్	71.46
చైనీస్ యువాన్	10.53
మలేషియన్ రింగిట్	17.25
న్యూజిలాండ్ డాలర్	48.67
హాంకాంగ్ డాలర్	9.04
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	233.85
సౌతాఫ్రికన్ రాండ్	5.21

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31270	33443.85	0.19%
ముంబై	31720	33925.13	0%
ఢిల్లీ	31950	34171.12	1.27%
కోల్‌కతా	32270	34513.37	1.32%
కేరళ	30500	32620.32	1.33%
బెంగళూరు	30700	32834.22	0%
హైదరాబాద్	31270	33443.85	0.19%
గల్ఫ్	136.28	145.75	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42500.00
ముంబై	₹ 42500.00
ఢిల్లీ	₹ 42500.00
కోల్‌కతా	₹ 42500.00
హైదరాబాద్	₹ 42500.00




ఎంఎస్‌ఎంఇ, వ్యవసాయ రంగాలకు

రుణాలివ్వండి



- బ్యాంకులకు పూర్తి సహకారం అందిస్తాం
- ప్రభుత్వరంగ బ్యాంకు చీఫ్‌లతో ఆర్థికమంత్రి గోయల్



న్యూఢిల్లీ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్‌ఎంఇ), వ్యవసాయం, గృహ రంగాలకు రుణాలను ప్రోత్సహించాలని ప్రభుత్వరంగ బ్యాంకులకు కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ సూచించారు. అలాగే రుణదాతలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19) మూడు త్రైమాసికాల్లో ఐబిసి(దివాలా చట్టం) ద్వారా ప్రభుత్వరంగ బ్యాంకులు దాదాపు రూ.లక్ష కోట్లను రికవరీ చేశాయని, వచ్చే రోజుల్లోనూ ఈ చట్టంతో మరింత సానుకూల ఫలితాలు రానున్నాయని ఆయన అన్నారు. తాత్కాలిక ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ప్రభుత్వరంగ బ్యాంకుల అధినేతలతో గోయల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివాలా చట్టం గురించి చర్చించామని గోయల్ అన్నారు. ఎన్‌సిఎల్‌టి(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్), ఐబిసి యంత్రాంగం ద్వారా పెద్ద మొత్తంలో రికవరీ వచ్చిందని, ఎన్‌సిఎల్‌టికి వెళ్లకుండా పెద్ద రుణగ్రస్తులపై బ్యాంకులు ఒత్తిడి తెచ్చాయని అన్నారు. ఈ సమావేశంలో ఆర్‌బిఐ మార్గదర్శకాల ద్వారా కేసుల పరిష్కారానికి అంతర్గత యంత్రాంగం అంశంపై చర్చించారు. దివాలా చట్టం ద్వారా వేగవంతంగా రికవరీ, అలాగే వ్యాపారాలు, బ్యాంకులు మళ్లీ త్వరగా గాడిన పడేందుకు చర్యలు వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అవినీతి నిరోధక చట్టంలో సవరణల పట్ల బ్యాంకులు విశ్వాసంతో ఉన్నాయని, బ్యాంకులకు పూర్తి సహకారం అందిస్తామని ఆర్థికమంత్రి హామీ ఇచ్చారు.

సిఇఒలతో ఆర్‌బిఐ గవర్నర్ భేటీ

ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల సిఇఒలతో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ సమావేశమయ్యారు. త్వరలో పరపతి విధాన సమీక్ష ఉన్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. బ్యాంకింగ్ రంగం నుంచి ప్రభుత్వం ఏమి ఆశిస్తోందో అనే విషయాన్ని శక్తికాంత దాస్ బ్యాంక్ అధినేతలకు తెలియజేశారు. ఫిబ్రవరి 7న ఆర్‌బిఐ ఆరో పరపతి విధాన సమీక్ష జరగనుంది. బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్‌బిఐ ఏమి ఆశిస్తోందో వారికి తెలియజెప్పేందుకు సమావేశమయ్యామని, ప్రస్తుత, భవిష్యత్తు అంశాలపై చర్చించామని శక్తికాంత్ దాస్ వెల్లడించారు. కాగా ఫిబ్రవరిలో నిర్వహించే పరపతి సమీక్షలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పుంజుకున్న 'జి' షేరు



న్యూఢిల్లీ : అతిపెద్ద టెలివిజన్ నెట్‌వర్క్ కల్గిన మీడియా మొఘల్ తన వ్యాపారంలో విశ్వాసాన్ని పునరుద్ధరించే ప్రయత్నం సఫలమైంది. సోమవారం జి ఎంటర్‌టైన్మెంట్ షేరు 15 శాతం పెరిగింది. కాగా సుభాష్ చంద్రకు చెందిన ఎస్సెల్ గ్రూప్ కంపెనీలపై ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు వార్తలు, రుణ సంస్థలకు చెల్లింపుల్లో డిఫాల్ట్ కావడం వంటి అంశాల నేపథ్యంలో సంస్థ షేర్ల విలువ భారీగా పతనమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కంపెనీ అధినేత సుభాష్ చంద్ర నష్టనివారణ చర్యలు చేపడుతున్నారు. తన వాటాదారులకు, రుణ దాతలకు లేఖ రాశారు. తన కంపెనీని రుణ ఎగవేతదారునిగా భావించవద్దని ఆయన రుణదాతలకు విజ్ఞప్తి చేశారు. కంపెనీ ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాట నిజమేనని అంగీకరించారు. ఈ వివాదానికి కేంద్ర బిందువైన ఎస్సెల్ ఇన్ఫ్రా గ్రూప్ పనితీరును సమీక్షించుకుంటామని, అవసరమైతే అందులోని వాటాలను పూర్తిగా వదులుకుంటామని సుభాష్ చంద్ర ప్రకటించడంతో వాటాదారులు, రుణ దాతలు సంతృప్తిని వ్యక్తం చేసినట్టు సమాచారం. సమస్యల నుంచి గట్టెక్కడానికి జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్‌లో వాటాలను విక్రయించి నిధులు సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అయితే దీనికి కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు.
ఐఎల్ అండ్ ఎఫ్‌ఎస్ డిఫాల్ట్ కారణంగా పరిస్థితి అదుపు తప్పిందన్నారు. వీడియోకాన్‌కి చెందిన డి2హెచ్ వ్యాపారం కొనడం కలిసి రాలేదని పేర్కొన్నారు. అన్ని రుణాలను తీరుస్తామని సుభాష్ చంద్ర హామీ ఇచ్చారు. చెల్లింపుల్లో డిఫాల్ట్ అయితే ఓపిక పట్టాలని, వేరే విధంగా అడుగులు వేయవద్దన్నారు. జీ ఎంటర్‌టైన్‌మెంట్ వాటా పూర్తయ్యే వరకు సహనంతో ఉండాలని కోరారు. రుణ దాతలు ఆందోళన చెందవద్దని తెలిపారు. సమస్య నుంచి పారిపోవడం లేదని, ప్రతి వ్యక్తికీ, ప్రతి బకాయిని చెల్లిస్తానని హామీ ఇచ్చారు. గత వారం నుంచి ఎస్సెల్ గ్రూప్‌నకు చెందిన సంస్థలన్నీ భారీగా నష్టపోయాయి. జి ఎంటర్‌టైన్‌మెంట్ 27 శాతం పతనమైంది. దీంతో చాలా మంది మదుపర్లు ఈ స్టాక్స్‌ను దీర్ఘకాలికంగా హోల్డ్ చేయడంలో పునరాలోచనలో పడ్డారు. ఇప్పటికే ఈ కౌంటర్లు అమ్మకాల ఒత్తిళ్ళను ఎదుర్కొంటున్నాయి. గత వారం ఈ స్టాక్ 44 నెలల కనిష్టానికి పడిపోయింది. కాగా గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థలు మాత్రం ఈ కంపెనీ స్టాక్స్ సమీప భవిష్యత్తులో డబుల్ డిజిట్ ప్రాఫిట్‌ను తీసుకురానున్నాయని అంచనా వేస్తున్నారు. నోమురా బ్రోకింగ్ సంస్థ ఏకంగా జీ ఎంటర్‌టైన్మెంట్ స్టాక్ టార్గెట్ ప్రైస్‌ను 110 శాతం పెంచి రూ. 671 గా పేర్కొంది. గత శుక్రవారం నాటికి ఈ స్టాక్ ధర రూ.319 వద్ద ముగిసింది. జి స్టాక్స్ 13 నుండి 17శాతం వరకూ కాగర్ రెవిన్యూను సాధించవచ్చని నోమురా అంచనా వేస్తోంది.



సైనిక్ సంక్షేమానికి

తెలంగాణ ఎస్‌బిఐ విరాళం

గవర్నర్‌కు రూ.14.04 లక్షల చెక్కు అందజే

మన తెలంగాణ / హైదరాబాద్: ఎస్‌బిఐ తెలంగాణ సర్కిల్ మేనేజ్‌మెంట్ కమిటీ సోమవారం తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ కలిసి రూ.14,04,350 చెక్కును సైనిక్ సంక్షేమ నిధికి విరాళంగా అందజేశారు. ఇది ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తెలంగాణ సర్కిల్ నుంచి విరాళం. ప్రతి సంవత్సరం ప్రతి ఉద్యోగి తమతమ వేతనం నుంచి కొంత మొత్తాన్ని మంచి పనికోసం విరాళంగా ఇస్తున్నారు. ఈ సందర్భంగా విరాళం చెక్కును గవర్నర్‌కు అందజేసేందుకు వచ్చిన వారిలో సర్కిల్ హెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ స్వామినాథన్, జిఎం యుఎన్‌ఎన్ మైయా, జిఎం వి రమేష్, డిజిఎం కెవి బంగార్రాజు, పిఆర్‌ఒ హనుమంత రావు ఉన్నారు. సైనిక్ వేల్ఫేర్ బోర్డు డైరెక్టర్ రమేష్ కూడా హాజరయ్యారు.

కెనరా బ్యాంక్ లాభం అదుర్స్

- క్యూ3లో 152 శాతం పెరిగిన లాభం



న్యూఢిల్లీ : డిసెంబర్ ముగింపు నాటి మూడో త్రైమాసిక ఫలితాల్లో(అక్టోబర్–డిసెంబర్) కెనరా బ్యాంక్ లాభం 152 శాతం వృద్ధిని సాధించింది. సంస్థ నికర లాభం రూ. 126 కోట్ల నుంచి రూ.318 కోట్లకు పెరిగింది. విశ్లేషకుల అంచనాలను మించి బ్యాంక్ లాభాలను నమోదు చేసింది. ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. డిసెంబర్ ముగింపు నాటికి మొత్తం రుణాల్లో స్థూల మొండి బకాయిలు 10.25 శాతానికి తగ్గాయి. అంతకుముందు త్రైమాసికంలో ఇవి 10.56 శాతంగా ఉన్నాయి. అధిక వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) అండతో పాటు మెరుగైన ఆస్తుల నిర్వహణ కారణంగా క్యూ3లో బ్యాంక్ లాభాన్ని పెంచుకుంది. నికర వడ్డీ ఆదాయం రూ.3184 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో రూ.3679 కోట్లతో పోలిస్తే ఇది 4శాతం అధికంగా ఉంది. త్రైమాసికం–త్రైమాసికం ఆధారంగా కేటాయింపులు మాత్రం రూ.2,403 కోట్ల నుంచి రూ.2,733 కోట్లకు పెరిగాయి. ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికి షేరు మాత్రం నష్టాల బాట పట్టింది. స్టాక్‌మార్కెట్‌లో షేరు 5.37 శాతం నష్టపోయి రూ.240.70 వద్ద ముగిసింది. షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ. 240.20 రూ.261.90లుగా ఉన్నాయి.

టాటా పవర్ త్రైమాసిక లాభం

67 శాతం డౌన్

ముంబై : డిసెంబర్ ముగింపునాటి త్రైమాసిక ఫలితాల్లో టాటా పవర్ తీవ్ర నిరాశపర్చింది. సంస్థ నికర లాభం రూ.204 కోట్లతో 67.42 శాతం క్షీణించింది. అత్యధిక ఇంధన, రుణ వ్యయం వల్ల లాభం భారీగా క్షీణించింది. ఏడాది క్రితం కంపెనీ నికర లాభం రూ.628 కోట్లుగా ఉంది. కంపెనీ మొత్తం ఆదాయం రూ.6,451 కోట్ల నుంచి రూ.7,721 కోట్లకు పెరిగింది. ఇంధన వ్యయం రూ.2,491 కోట్ల నుంచి రూ.3,189 కోట్లకు పెరిగింది. అదే విధంగా ఆర్థిక వ్యయం రూ. 855.28 కోట్ల నుంచి రూ.1,013.96 కోట్లకు చేరింది. క్యూ3 ఫలితాల నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో టాటా పవర్ షేరు విలువ 5 శాతం పతనమై రూ.70 వద్ద స్థిరపడింది.



13 ఏళ్లలో 'బిఒఐ'కు అతిపెద్ద నష్టం



న్యూఢిల్లీ : బ్యాంక్ ఆఫ్ ఇండియా త్రైమాసిక నష్టం 2005 సంవత్సరంనాటి స్థాయికి పడిపోయింది. డిసెంబర్ ముగింపు నాటి క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాల్లో సంస్థ నికర లాభం రూ.4,738 కోట్లకు పెరిగింది. గతేడాది ఇదే సమయంలో సంస్థ నికర నష్టం రూ.2,341 కోట్లుగానే ఉంది. అయితే ఈసారి నష్టం భారీగా పెరిగింది. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.9,179 కోట్లతో రెట్టింపు అయ్యాయి. ఆస్తుల నాణ్యత స్వల్పంగా మెరుగుపడగా, స్థూల మొండి బకాయిలు 16.31 శాతం, సెప్టెంబర్‌లో 16.36 శాతంగా ఉన్నాయి. గతేడాది స్థూల ఎన్‌పిఎ 16.93 శాతంగా ఉన్నాయి.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
జీ ఎంటర్‌టైన్	382.00	320.00	373.30	318.40	54.90	17.24
భారతి ఇన్‌ఫ్రాటెల్	293.85	277.05	287.30	279.75	7.55	2.70
కోల్ ఇండియా	227.50	218.05	225.20	220.95	4.25	1.92
టిసిఎస్	1,962.00	1,925.50	1,955.00	1,920.80	34.20	1.78
లార్సెన్	1,337.90	1,291.65	1,300.45	1,285.45	15.00	1.17
పవర్ గ్రిడ్ కార్ప్	188.60	182.00	187.80	185.85	1.95	1.05
యుపిఎల్	764.00	744.00	760.05	753.10	6.95	0.92
హెచ్‌సిఎల్ టెక్	980.00	963.90	977.80	969.40	8.40	0.87
టెక్ మహీంద్ర 738.00	721.15	735.15	729.05	6.10	0.84	
ఏసియన్ పెయింట్స్	1,391.00	1,366.85	1,379.50	1,372.15	7.35	0.54

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
ఆదానీ పోర్ట్స్	375.35	292.10	326.10	373.85	47.75	12.77
ఇండియా బుల్స్ హెచ్‌ఎస్‌జి	750.00	684.65	699.30	744.50	45.20	6.07
ఎస్ బ్యాంక్	223.00	206.10	207.50	219.60	12.10	5.51
బజాజ్ ఫైనాన్స్	2,610.00	2,355.00	2,458.50	2,599.55	141.05	5.43
బజాజ్ ఫిన్సర్వ్	6,352.80	5,948.80	6,050.90	6,321.55	270.65	4.28
అల్ట్రాటెక్ సిమెంట్	3,510.00	3,332.45	3,374.45	3,510.80	136.35	3.88
ఐసిఐసిఐ బ్యాంక్	354.90	336.65	343.55	357.20	13.65	3.82
గ్రాసిమ్	763.00	727.20	732.80	759.60	26.80	3.53
ఛిప్లా	509.00	489.10	492.15	507.65	15.50	3.05
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,492.95	1,437.40	1,443.70	1,484.90	41.20	2.77

బిజెపి ర్యాలీ స్థలం మార్పు
తృణమూల్ ఇబ్బంది పెడుతోంది



కోల్‌కతా: ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఠాకూర్ నగర్‌లో ఫిబ్రవరి 2న నిర్వహించబోయే ర్యాలీని బిజెపి మరోచోటుకి మార్చింది. భారీ ఎత్తున జనం హాజరయ్యే ఆ సభలో ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగించవలసి ఉంది. అయితే, ఆ మైదానంలోఅప్పుడు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ వారం రోజుల పాటు మతపరమైన కార్యక్రమాన్ని నిర్వహించబోతోంది. భారీ బహిరంగ సభలకు ఆ మైదానం చాలదని, పైగా భద్రతా ఏర్పాట్లు కష్టమవుతాయని బిజెపి నాయకులు చెబుతున్నారు. 'ఫిబ్రవరి 2న ఠాకూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తాం. కానీ వేదిక మారింది. సమీపంలో ఉన్న మరో మైదానంలో సభ ఉంటుంది' అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ చెప్పారు. 'ఇందుకు రెండు కారణాలున్నాయి. కొత్తగా ఎంపిక చేసిన స్థలం మొదటి మైదానం కంటే చాలా పెద్దది. రెండో కారణం: మొదటి వేదిక తృణమూల్ ఇంతకు ముందే ఒక మతపరమైన కార్యక్రమానికి తీసుకుంది. మేము ఎక్కడ ర్యాలీ నిర్వహించాలనుకున్నా తృణమూల్ ఆటంకాలు కల్పిస్తోంది. ఇప్పుడూ అదే జరిగింది. కాబట్టి ఇబ్బంది పడకుండా ఉండాలనే వేదిక మార్చాం. ప్రధానమంత్రికి రక్షణ కల్పించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పిజి) కూడా మొదటి సభాప్రాంగణం పట్ల అసంతృప్తితో ఉంది. అక్కడ భద్రతా ఏర్పాట్లకు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు' అని ఘోష్ వెల్లడించారు.

70 ఏళ్లుగా కోర్టుల్లో అయోధ్య వివాదం
ఆవేదన వ్యక్తం చేసిన కేంద్ర న్యాయశాఖ మంత్రి



పాట్నా : సుప్రీంకోర్టులో అయోధ్య పేరు వివాదానికి సంబంధించిన కేసు విచారణ నత్తనడకన సాగుతుండడం పట్ల కేంద్ర న్యాయశాఖామంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే శబరిమల ఆలయంలోకి మహిళల్ని అనుమతించడం వంటి విషయాల్లోనూ సుప్రీంకోర్టు తొందరపడి నిర్ణయాలు తీసుకున్నట్టు భావిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. ఒక మంత్రిగా కాక, సామాన్య పౌరుడిగా ఈ మాట అంటున్నానని చెప్పారు. రాజకీయంగా సున్నితమైన అంశంగా భావించే అయోధ్యలోని రామజన్మభూమి బాబ్రీ మసీదు స్థల వివాదం విషయంలో జనవరి 29న విచారణ జరగాల్సి ఉంది. అయితే అయిదుగురు సభ్యులు కల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలో ఒక న్యాయమూర్తి అందుబాటులో ఉండరన్న కారణంచేత సుప్రీంకోర్టు విచారణను రద్దుచేసింది. సుప్రీంకోర్టు ఈ సమాచారం తెలిపిన ఒక రోజు తర్వాత న్యాయశాఖామంత్రి స్పందించారు. 'అయోధ్య వ్యవహారం 70 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. అయోధ్య పేరు కేసులో తీర్పు చెప్పేందుకు అలహాబాద్ హైకోర్టుకు 60 ఏళ్లు పట్టింది. దీనిపై చేసిన అప్పీల్ ఇప్పటికి 10 ఏళ్ల నుంచీ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది' అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

పతాకం దగ్ధంపై భారత్ తీవ్ర నిరసన


లండన్: భారత రిపబ్లిక్ డే నాడు హై కమిషన్ కార్యాలయం ముందు ఖలిస్థాన్ అనుకూల మద్దతుదారులు భారత జాతీయ పతాకాన్ని తగలబెట్టడాన్ని ఇండియా తీవ్రంగా పరిగణించింది. సోమవారం నాడు బ్రిటన్‌కు ఘాటుగా నిరసన వ్యక్తం చేసింది. ఏడాదిలోపు రెండోసారిఇలా జరిగినందుకు బాధపడుతున్నామని బ్రిటన్ విదేశాంగ కార్యాలయం తెలిపింది. ఖలీస్థాన్ వాదులు భారత పతాకాన్ని తగలబెట్టడంపై భారత హై కమిషన్ ఘాటైన పదజాలంతో నిరసన తెలుపుతూ బ్రిటన్ విదేశాంగ కార్యాలయానికి ఒక నివేదిక పంపింది. వివిధ స్థాయిల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని ఇండియన్ హై కమిషన్ ఆ నోట్‌లో పేర్కొంది. జనవరి 26న ఇలాంటి సంఘటన జరిగే అవకాశం ఉందని బ్రిటన్ సెక్యూరిటీ అధికారులకు ఇండియా ఎన్నోసార్లు హెచ్చరించిన తర్వాతకూడా ఈ సంఘటన జరిగింది....అని భారత హై కమిషన్ ఆరోపించింది. 'రిపబ్లిక్ డే నాడు మాత్రమే కాదు... ఎవరు ఏ రోజు భారత పతాకాన్ని దగ్ధం చేసేందుకు ప్రయత్నించినా అది చాలా విషాద సంఘటనే అవుతుంది. జరిగిందానికి మేము దిగ్భ్రాంతి చెందాం. చాలా బాధపడుతున్నాం' అని బ్రిటన్ విదేశాంగ కార్యాలయం ప్రతినిధి ఒకరు చెప్పారు.

సంపూర్ణ బడ్జెట్ రాజ్యాంగ విరుద్ధం




న్యూఢిల్లీ: ఎన్‌డిఏ ప్రభుత్వం ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టజాలదని మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా అభిప్రాయపడ్డారు. ఆర్థిక సర్వే, ఆర్థిక బిల్లు ప్రవేశపెట్టడం లేదా కొత్త సర్వీసుల్ని ప్రారంభించడం వంటివి తాత్కాలిక బడ్జెట్‌లో పేర్కొనకూడదని, ఒకవేళ అలా చేస్తే అది రాజ్యాం గ విరుద్ధమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని, మధ్యంతర బడ్జెట్‌ను తీసుకురాదని వార్తలు వెలువడిన నేపథ్యంలో యశ్వంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంవత్సరంలో, అధికారం నుంచి వైదొలిగే ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను లేదా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీ. అయితే... 2009లో కాంగ్రెస్ సారథ్యంలోని యుపిఏ ప్రభుత్వంతో సహా చాలా ప్రభుత్వాలు మధంతర బడ్జెట్‌లో సైతం ఏమాత్రం సంకోచించకుండా విధాన ప్రకటనలు చేశాయి. 'పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకూడదని ఏ నిబంధన లేదనేవారూ ఉన్నారు. అలాంటప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 116 ఎందుకు?' అని గతంలో ఎన్‌డిఏ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హా ప్రశ్నించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ కూడా బిజెపిని విమర్శిస్తోంది. పూర్తి స్థాయి బడ్జెట్‌తో ప్రజలకు ఎరవేయాలని కేంద్ర ప్రభుత్వం విఫల యత్నం చేస్తోంది' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ ఆరోపించారు.

కాంగ్రెస్ ఒఆర్ఒపి రాహుల్, ప్రియాంక



సిమ్లా : కాంగ్రెస్ పార్టీకి రాహుల్ ప్రియాంకలే సర్వస్వమని, వారి దృష్టిలో సైనికులకు కల్పించే ఒఆర్ఓపి అంటే ఓన్లీ ఫర్ రాహుల్ ఓన్లీ ఫర్ ప్రియాంక అని బిజెపి నేత అమిత్ షా చెప్పారు. సోమవారం ఆయన హమీర్‌పూర్‌లో బిజెపి పన్నా ప్రముఖ్ సమ్మేళన్‌లో మాట్లాడారు. హమీర్‌పూర్ జిల్లా నుంచి సైన్యంలో అత్యధిక సంఖ్యలో వివిధ హోదాలలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిజెపి నేత కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలను సంధించారు. కాంగ్రెస్ ఎన్నో ఏళ్లుగా అధికారంలో ఉంది. అయితే వారికి సైన్యానికి అత్యవసరం అయిన ఒక ర్యాంక్ ఒకే పెన్షన్ (ఒఆర్ఒపి) సమస్య పరిష్కారానికి తీరిక దొరకలేదని, బిజెపి చిత్తశుద్ధితో వ్యవహరించి దీనిని అమలు చేసిందని, మాజీ సైనికోద్యోగులకు మేలు జరిగిందని షా చెప్పారు. కాంగ్రెస్ వారి దృష్టిలో ఒఆర్ఓపి అర్థం వేరేగా ఉందని చమత్కరించారు. రాహుల్, ప్రియాంకలే అంతా అనే ధోరణి వారిదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రియాంక ప్రవేశంపై అమిత్ షా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ వారికి ప్రియాంక ఆగమనం, రాహుల్ పలకరింపులే అంతా అని అంతకు మించి ప్రజల గురించి పట్టదని తెలిపారు. సైనికుల గురించి ఎవరూ 70 ఏళ్లుగా పట్టించుకోలేదని , మోడీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే వారి సమస్యలను పరిష్కరించారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్‌లో సోమవారం నాటి అమిత్ షా సభ ఎన్నికల సభగా మారింది. దేశం బలీయమైన ప్రభుత్వాన్ని కోరుకుంటుంది. అంతే కానీ బలవంతపు అతుకులబొంతల సర్కారును కాదని స్పష్టం చేశారు. సైనికులను చంపిన పాకిస్థాన్‌రె దెబ్బ తీసిన ధమాకా సర్కారును ప్రజలు కోరుకుంటారని చెప్పారు. ఇటీవలి కాలంలో రాహుల్ పదేపదే పేదరికం గురించి మాట్లాడుతున్నారని అంటూ ఇంతకూ ఈ రాహుల్ బాబా కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాలుగా పేదరిక నిర్మూలనకు ఏం చేశాయో చెప్పగలరా? అని ప్రశ్నించారు. పేదరిక నిర్మూలనకు బిజెపినే తగు చర్యలు తీసుకొంటోందన్నారు.

సైబీరియన్ అతిథులొచ్చేశాయ్..



సైబీరియా నుంచి వచ్చే ఈ కొంగలు ఎంతో అందంగా ఉంటాయి.రెండు అడుగుల ఎత్తు ఉండి కాళ్లు , పెద్ద పెద్ద రెక్కలు , బారు ముక్కు , మూడు రంగులతో ముచ్చగొల్పుతాయి.కాళ్లు రెక్కలు గులాబి , నలుపు రంగులో ఉంటే ముక్కు ఆరెంజ్ రంగులో ఉంటుంది.





మన తెలంగాణ/ చింతపల్లి: ఖమ్మం జిల్లా చింతపల్లికి సైబీరియాన్ అతిథులు చేరుకున్నారు.శతాబ్ద కాలం నుండి జనవరి మాసంలో సైబీరియా నుండి వచ్చే వందలాది కొంగల గుంపు కాస్త ఆలస్యంగా వేలాది కిలోమీటర్లు ప్రయాణించి చింతపల్లికి చేరుకున్నాయి.చింతపల్లిలోని చింతచేట్లపై తమ గూళ్లను ఏర్పాటు చేసుకుని ఆరు మాసాల అనంతరం తమ పిల్లలతో చింతపల్లికి ప్రణమిల్లుతూ తమ దేశానికి తిరుగు ప్రయాణమవుతాయి.పచ్చని పంట పొలాలు, కూరగాయల తోటలు , చింత చెట్ల తోపులతో రమణీయమైన చెరువుతో అహ్లాదకర వాతావరణం ఉన్న చింత పల్లిని శతాబ్ద కాలం క్రితమే తమ విడిదిగా కొంగలు గుర్తించాయి.నాటి నుంచి నేటి వరకు ప్రతి జనవరి మాసంలో గ్రామానికి చేరుకునే కొంగలు జూన్ నెల వరకు విడిది చేసి వెళ్ళిపోతాయి.సైబీరియా అత్యంత శీతల ప్రదేశం కావడంతో కొంగల సంతానోత్పత్తికి ఆటంకమవుతుండడంతో సమశీతోష్ణ స్థితిలో ఉండే భారతదేశాన్ని అందులో తెలంగాణ గడ్డ ఖమ్మం జిల్లాలోని చింతపల్లిని ఎంచుకున్నాయి. మగ ఆడ జంటలుగా వచ్చే కొంగలు చింత చెట్లపై గూళ్లు నిర్మించుకుని సహ జీవనం సాగిస్తాయి . ఈ ఆరు నెలలు ఆడ కొంగ గూళ్లలో ఉంటే మగ కొంగలు ఆహారం కోసం బయటకి వెళ్తుంటాయి.

చేపలను ఎక్కువగా ఇష్టపడే కొంగలు ఊరికి పక్కనే ఉన్న చెరువుతో పాటు పాలేరు, వైరా, పాకాల, బయ్యారం, మహబూబాబాద్ తదితర ప్రాంతాలలోని చెరువులు, ప్రాజెక్టులకు చేపలు వేటకు వెళ్ళి వస్తాయి.ఒక్కోమారు కిలో బరువున్న చేపలను సైతం ఇవి మోసుకొస్తాయి.ఇలా చేపల్ని భుజిస్తు కాలం గడుపుతాయి.ఆడ కొంగలు పెట్టే గుడ్లను సంరక్షిస్తుంటాయి.గుడ్లు పొదిగిన అనంతరం పిల్లలు వచ్చి అవి ఎంత దూరమైనా తమతో ఎగరగలవన్న భరోసా వచ్చిన పిదుప అవి గ్రామాన్ని విడిచి వెళ్తాయి.

పైలెట్ కొంగలు

ఈ కొంగల గుంపు జనవరిలో గ్రామాన్ని చేరుకోక ముందే ఐదారు కొంగలు అదే నెలలో పైలెట్లుగా ఇక్కడకు వచ్చి వాతావరణ పరిస్థితులు , చెట్ల పరిస్థితి గమనించి వెళ్తాయి. తమ జీవికకు అంతా అనుకూలంగా ఉన్నదని భావిస్తే మిగతా కొంగలతో కలిసి మూడు విడతలుగా తిరిగి వస్తాయి. వెళ్ళేటప్పుడు అన్ని కలిసి వెళ్తాయి.

చింతతీర్చే చింతపల్లి

సైబీరియా నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు చేరుకునే కొంగలకు ఎటువంటి ప్రాణభయం లేకుండా గ్రామస్తులే కట్టుబాట్లు విధించుకున్నారు.కొంగలు పొలాల్లో , చెరువు గట్లపై వాలినప్పుడు వాటికి హాని తలపెట్టడం , గూళ్లలో ఉన్నవాటిని పట్టుకోవడం , చంపడం , భయభ్రాంతులకు గురి చేయడం , వేటాడి భుజించడం వంటివి ఎవరు చేసిన గ్రామ బహిష్కరణ చేస్తారు.ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఇటువంటి చర్యలకు పాల్పడితే దేహశుద్ధి చేసి మరీ పోలీసులకు అప్పగిస్తారు.ఇంత వరకు బాగానే ఉన్నా పక్షుల వల్ల దుర్వాసన వెలువడుతున్నదని కొందరు తమ పొలాల్లో ఉన్న చెట్లను నరికి వేస్తున్నారు.అథితిగా వచ్చి పోయే ఆ చిన్న ప్రాణాల కోసం చెట్లను నరకవద్దని పక్షి ప్రేమికులు వారికి నచ్చ చెపుతున్నారు.ఇలా చెట్లు నరకడం వల్ల వాటికి గూళ్లు కట్టుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఉదాసీనతకు చోటులేదు



ఎన్‌సిసి పరేడ్‌లో మోడీ

న్యూఢిల్లీ : దేశ భద్రత విషయంలో ఎటువంటి ఉదాసీనతకు చోటు ఉండదని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. భారతదేశం సర్వదా శాంతికాముక దేశం. అయితే జాతీయ భద్రత పరిరక్షణకు ఎటువంటి చర్యలకు దిగేందుకు అయినా వెనుకాడదని ప్రధాని తెలిపారు. సోమవారం ప్రధాని మోడీ ఎన్‌సిసి బృందాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

శాంతియుత దేశంగానే భారత్‌కు పేరుందని, అయితే రక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని ప్రధాని తెలిపారు. దేశ భద్రతలో ఎన్‌సిసి పాత్ర కీలకం అని, తరాలుగా ఎన్‌సిసి విశిష్ట సేవలు అందిస్తోందని కొనియాడారు. కేంద్రంలో తమ ప్రభుత్వం గత నాలుగేళ్లలో దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చే పలు కీలక నిర్ణయాలను తీసుకుందని ప్రధాని తెలిపారు. ఎల్లవేళలా శాంతియుతంగానే ఉండటం జరుగుతుంది. అయితే అవాంఛనీయ స్థితిలో వ్యవహరించాల్సిన వైఖరిపై మన భద్రతా బలగాలకు స్పష్టత ఉందని అన్నారు. తమంత తాము గా కవ్వింపులకు దిగడం జరగదు. అయితే శత్రువు రెచ్చగొట్టినట్లు అయితే వారిని వదిలే ప్రసక్తే ఉండదనే నిర్ధిష్ట సంకేతాలను మన భద్ర తా బలగాలు వెలువరిస్తూ వస్తున్నాయని ప్రధాని తెలిపారు. చైనా అణు త్రికోణ పాటవాన్ని సంతరించుకుందనే అంశంపై ప్రధాని స్పందించారు. మనదేశం ఎటువంటి సవాళ్లను అయినా తట్టుకోగలిగే పాటవంతో ఉందని, అణ్వాయుధ బలం కూడా సంతరించుకుందని తెలిపారు. భూ సముద్ర, గగన తలం నుంచి కూడా అణ్వాయుధాలను ప్రయోగించగల సత్తా ఉన్న అతి కొద్ది దేశాల సరసన చేరిందని వెల్లడించారు.

అమెరికాకు ఇన్‌ఫెక్షన్

సెనెటర్ కమలా హారిస్ ఆందోళన



వాషింగ్టన్ : అమెరికాలో ప్రజాస్వామ్యానికి పెను ముప్పు వాటిల్లిందని భారతీయ సంతతి సెనెటర్ కమలా హారిస్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశాధ్యక్ష ఎన్నికలకు ఆమె తమ ప్రచార ఘట్టాన్ని ఆదివారం ప్రారంభించారు. ఇంతకు ముందెన్నడూ లేని స్థాయిలో ఇప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రెసిడెంట్ ట్రంప్ విధానాలతో దేశంలో అస్థిరత ఏర్పడిందని, దేశ చరిత్రలో తొలిసారిగా బలహీనపు దశ సంక్రమిస్తోందని విమర్శించారు. ఇప్పుడున్నది ఇన్‌ఫెక్షన్ స్థితి అని వ్యాఖ్యానించారు. ట్రంప్‌తో తలపడే ప్రతిపక్ష డెమోక్రాట్ల జాబితాలో కమలా హారిస్ ఇప్పుడు ప్రముఖ స్థానంలో నిలిచింది. ఈ తరుణంలోనే ఆమె ఇప్పటికే ట్రంప్‌పై అన్ని స్థాయిలలో విమర్శల ఉధృతితో ప్రచారం ప్రారంభించారు. అమెరికా సెనెట్‌కు ఎన్నికైన రెండో ఆఫ్రికన్ – అమెరికన్ మహిళ అయిన కమలా పూర్వీకులు భారత సంతతి వారు. రాజకీయ జీవితంలో ఆమెను బరాక్ ఒబామాతో సరిపోల్చవచ్చునని విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశ చరిత్రలో ఇప్పుడు తొలిసారిగా మనం దెబ్బతినే స్థితిలో పడ్డామని, అమెరికా కల లు, మన దేశ ప్రజాస్వా మ్యం ప్రమాదంలో పడినందునే సంఘటితంగా వ్యవహరించేందుకు ఇప్పుడు సంసిద్ధం కావల్సి ఉందన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో పోటీకి ఆమె గత వారం తమ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. 'మన నేతలు దూకుడుగా ఉండటం, పత్రికా స్వేచ్ఛను దెబ్బతీయడం, మన ప్రజాస్వామిక వ్యవస్థను కించపర్చడం వంటివి చూస్తూ ఉంటే ఇది మన అమెరికా కాదన్పిస్తోంది' అని ఈ సెనెటర్ చెప్పారు. అధికార దురహంకారం పనికిరాదని , దేశ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కూడిన స్పందన అవసరం అని తేల్చిచెప్పారు.

హిందువుననే విద్వేషం : గబార్డ్

వాషింగ్టన్ : తాను హిందువును కావడం వల్లనే కొందరు విమర్శలకు దిగుతున్నారని అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు తులసీ గబార్డ్ చెప్పారు. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ తరపున ఆమె బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు ఇటీవలే తమ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. హవాయి నుంచి నాలుగుసార్లు అమెరికా సెనెట్‌కు ఎన్నికయిన గబార్డ్ విమర్శకులపై ఎదురుదాడికి దిగారు. హిందూ జాతీయవాదిగా పేరుతెచ్చుకున్న గబార్డ్ అమెరికా ప్రయోజనాలకు కట్టుబడి ఉంటారా? అని ఇటీవలే విమర్శలు వెలువడ్డాయి. అయితే ఇటువంటి వ్యాఖ్యలు వారి మతపరమైన విద్వేషాలను తెలియచేస్తున్నాయని, ద్వంద్వ ప్రమాణాలను చాటుతున్నాయని గబార్డ్ చెప్పారు. తనకు ఎటువంటి మద్దతు దక్కకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పుడు హిందూ జాతీయ వాదిగా తనపై దాడికి దిగుతున్నారని, ఇక ముందు ఈ విధంగా అందరినీ జాతిపేరిట తిట్టడం జరుగుతుందని, విమర్శకుల ప్రామాణికతను ఈ విషయం స్పష్టం చేస్తోందన్నారు. ఈ దేశానికి తన అంకితభావం విషయానికి వస్తే దీనిని ఎవరూ కాదనలేరని, కేవలం తాను హిందూ జాతీయవాదిని అనే కారణంతో అమెరికాపట్ల అంకితభావం లేదనే వాదన అనుచితం అన్నారు.

ఏప్రిల్ చివర్లో లోక్‌సభ ఎన్నికలు

అధికారుల బదిలీలపై ఇసి లేఖలు ● మూడేళ్లు దాటితే స్థానచలనం ● మార్చి 5న షెడ్యూల్

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు ఎప్రిల్ లేదా మే నెలలలో జరుగనున్నాయి. రాష్ట్రాలలో అధికారుల బదిలీ, నియామకాల ప్రక్రియలపై కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) పంపించిన లేఖలతో ఈ విషయం మరింతగా స్పష్టం అయింది. ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి మొదటి వారంలో ప్రకటిస్తారని వెల్లడైంది. ఎన్నికల సంఘంలో అంతర్గత హడావిడితో ఈ అంశాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇటీవలే ఎన్నికల కమిషన్ అన్ని రాష్టాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కొన్ని కీలక సూచనలు పంపించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారుల నియామకాలు, బదిలీల ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఇందులో వెల్లడించింది. ఎన్నికల షెడ్యూల్ తరువాత అధికారుల స్థానచలనం, కొత్త నియామకాలకు వీలుండదనే విషయాన్ని తెలియచేసింది. 2019లో ప్రస్తుత లోక్‌సభ గడువు ముగుస్తుంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిషా, సిక్కిం అసెంబ్లీలకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుత లోక్‌సభ కాల పరిమితి ఈ ఏడాది జూన్ 3తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో లోక్‌సభకు ఆయా రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి వివిధ దశలలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు జరుపుతోందని స్పష్టం అయింది. దీనికి సంబంధించిన అత్యంత భారీ స్థాయి ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు యంత్రాంగాన్ని సమాయత్తం చేసుకోవల్సి ఉంది. అదే విధంగా అనుబంధంగా ఆయా ప్రాంతాల ఇతరత్రా పరిపాలనా అధికార యంత్రాంగాలను కూడా తమకు అనుగుణంగా సమన్వయం చేసుకోవల్సి ఉంటుంది. ఎన్నికలు సక్రమంగా, సజావుగా జరిపించేందుకు, సునిశిత కీలక ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లకు, శాంతి భద్రతల రక్షణకు తగు ఏర్పాట్లు చేసుకోవల్సి ఉంటుంది. కొన్ని రాష్ట్రాలకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉందనే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) తెలియచేయడంతో ఇప్పుడు ఆయా రాష్ట్రాలలో అధికార యంత్రాంగంలో కదలిక ఏర్పడింది. ఎన్నికల విధి నిర్వహణకు సంబంధించి కొన్ని నిర్ధేశిత విధివిధానాలు ఉన్నాయి.



మూడు నాలుగేళ్ల అధికారుల బదిలీ

పోలింగ్ ఇతరత్రా ఎన్నికల నిర్వహణతో సంబంధం ఉండే అధికారులు ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో తమ స్వస్థలాలలో విధులు నిర్వర్తించడానికి వీల్లేదు. ఇక అత్యధిక కాలం ఒకే చోట పనిచేసిన అధికారులను ఆయా ప్రాంతాల నుంచి వేరే చోటికి బదిలీ చేయాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి అధికారులను ప్రస్తుతమున్న జిల్లాల్లో విధులకు అనుమతించకుండా చూసుకోవల్సి ఉంది. తమ సొంత జిల్లాల్లో వివిధ ఉన్నత స్థాయి హోదాలలో అధికారులుగా ఉన్న వారు, గత నాలుగేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులు, ఈ ఏడాది మే 31 నాటికి మూడేళ్లు ఒకే చోట విధులు పూర్తి చేసుకున్న వారు ఆయా ప్రాంతాలలో ఎన్నికల విధులలో పాలుపంచుకోరాదు. వీరిని వేరే చోటికి బదిలీ చేయాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం ఉన్నతాధికారులకు తెలియచేసింది. ఇది నిర్థిష్ట నిబంధనగా ఉన్నప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్ది నెలల ముందు ఎన్నికల సంఘం నుంచి దీనిపై పార్వత్రిక సూచనలు వంటి ఆదేశాలు వెలువడుతాయి. ఎక్కువ కాలం అధికారులు ఒకే చోట ఉన్నట్లు అయితే అటువంటి వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని ఎన్నికల సంఘం తెలియచేసింది.

భద్రతా సిబ్బందిని బట్టి పోలింగ్ దశలు

దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ బహు సంక్లిష్టం. పలు అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వివిధ ప్రాంతాలలో శాంతి భద్రతల పరిస్థితులను ప్రధానంగా లెక్కలోకి తీసుకోవాలి. ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరం అయిన భద్రతా సిబ్బంది లభ్యతను బట్టి ఎన్ని దశలలో పోలింగ్ నిర్వహించాలనేది ఖరారు చేస్తారు. ఇతరత్రా అవసరాలు అంటే స్థానికంగా రవాణా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది సమాయత్తం వంటి అంశాలను కూడా చూసుకుని దశల వారి ఎన్నికల ప్రక్రియను నిర్ణయిస్తారు. లోక్‌సభ ఎన్నికలకు అటూ ఇటూగా జరగాల్సిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా కలిపి పోలింగ్ తేదీలను ఖరారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిని ఈసారి కూడా ఖచ్చితంగా పాటిస్తారని వెల్లడైంది. 2014లో ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 5వ తేదీన వెలువరించింది. అప్పుడు తొమ్మిది దశల పోలింగ్ ఎప్రిల్ చివరి నుంచి మే మధ్య వరకూ సాగింది. తొలి దశ పోలింగ్ ఎప్రిల్ 7వ తేదీన ఆరంభం అయింది. ఇక తుది దశ పోలింగ్ ఘట్టం మే 12తో పూర్తయింది. అంతకు ముందు 2009లో షెడ్యూల్‌ను మార్చి 2న, 2004లో ఫిబ్రవరి 29న జారీ చేశారు. అయితే ఈసారి కూడా మార్చి మొదటి వారంలోనే నోటిఫికేషన్ జారీ ఉంటుంది. ఎన్నికలు ఎప్రిల్ చివరి నుంచి మే మధ్య వరకూ జరుగుతాయని వెల్లడైంది.



రాయుడికి ఐసిసి ఝలక్

అంతర్జాతీయ టోర్నీల్లో బౌలింగ్‌పై నిషేధం

దుబాయి: టీమిండియా క్రికెటర్ హైదరాబాదీ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడికి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ఝలక్ ఇచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయకుండా నిషేధం విధించింది. ఆస్ట్రేలియాతో వన్‌డే సిరీస్‌లో భాగంగా జరిగిన తొలివన్‌డేలో రాయుడి ఆఫ్‌స్పిన్ బౌలింగ్ యాక్షన్‌ను ఐసిసిప్పుబట్టిన విషయం తెలిసిందే. ఈ నివేదికను ఐసిసి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ)కి ఇవ్వడమే కాకుండా 14 రోజుల్లోగా పరీక్షకు హాజరు కావాలని తేల్చి చెప్పింది. అయితే ఈ పరీక్షకు రాయుడు హాజరు కాకపోవడంతో నిబంధనలు మేరకు ఐసిసి అతనిపై చర్యలు తీసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయరాదని, దేశవాళీ క్రికెట్, బిసిసిఐ పరిధిలో జరిగే టోర్నీలలో మాత్రం బౌలింగ్ చేయవచ్చని స్పష్టం చేసింది. ఈ నెల 13 లోగా రాయుడు బౌలింగ్ పరీక్షకు హాజరు కావలసి ఉండింది. అయితే న్యూజిలాండ్ పర్యటనలో బిజీగా ఉన్నందున రాయుడు పరీక్షకు హాజరు కాలేదు. దీంతో ఐసిసి క్లాజ్ 4.2 నిబంధనల ప్రకారం అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయకుండా నిషేధం విధించింది. అతను పరీక్షకు హాజరై తన బౌలింగ్ యాక్షన్ సరయినదేనని నిరూపించుకునేంతవరకు ఈ నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

సిరీస్ టీమిండియాదే

మూడో వన్డేలోనూ అలవోక విజయం

బ్యాటింగ్‌లో రాణించిన రోహిత్, కోహ్లీ

మళ్లీ సత్తా చాటిన బౌలర్లు

మౌంట్ మాంగనీ: న్యూజిలాండ్‌తో వన్‌డే సిరీస్‌ను టీమిండియా సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన మూడో వన్‌డేలో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. దీంతో అయిదు వన్‌డేల సిరీస్‌ను మరో రెండు వన్‌డేలు మిగిలి ఉండగానే 3–0 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. రోహిత్ శర్మ(62; 77 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్స్‌లు), కోహ్లీ(60; 74 బంతుల్లో ఆరు ఫోర్లు, ఒక సిక్స్) కీలకపాత్ర పోషించారు. బౌలర్లు కూడా తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 244 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఆది నుంచి దూకుడుగానే ఆడింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ధాటిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. ధావన్ వరస బౌండరీలతో స్కోరును పరుగులు పెట్టించాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 39 పరుగులు జోడించాక 28 పరుగులు చేసిన ధావన్ తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తరుణంలో రోహిత్, కోహ్లీల జోడీ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టింది. ఈ క్రమంలో ఇరువురు కూడా అర్ధ సెంచరీలు నమోదు చేశారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యాన్ని అందించిన తర్వాత రోహిత్ రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే కోహ్లీ కూడా అవుటయ్యాడు. అయితే ఆ తర్వాత అంబటి రాయుడు, దినేశ్ కార్తిక్‌ల జోడీ సమయోచితంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించింది. రాయుడు 42 బంతుల్లో అయిదు ఫోర్లు, ఒక సిక్స్‌తో 40 పరుగులు చేసి నాటవుట్‌గా నిలవగా, దినేశ్ కార్తిక్ 38 బంతుల్లో 5 బౌండరీలు, ఒక సిక్స్‌తో 38 పరుగులతో ఆకట్టుకోవడంతో భారత్ 43 ఓవర్లలోనే కేవలం 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ రెండు వికెట్లు సాధించగా, సాంత్నార్ ఒక వికెట్ తీశాడు.



అంతకు ముందు తొలుత బ్యాట్ చేసిన న్యూజిలాండ్ 243 పరుగులకు ఆలౌట్ అయింది. రాస్ టేలర్ (93;106 బంతుల్లో 9 ఫోర్లు), టామ్ లాథమ్(51; 64 బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్స్) ఆకట్టుకోవడంతో న్యూజిలాండ్ రవప్రదమైన స్కోరు సాధించింది. ఈ వన్‌డే సిరీస్‌లో కివీస్ సాధించిన అత్యధిక స్కోరు ఇదే అయినప్పటికీ ఆ జట్టు 50 ఓవర్లు పూర్తిగా ఆడకపోవడం గమనార్హం. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్‌కు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. మన్రో(7)తొలి వికెట్‌గా వెనుదిరగ్గా ఆ తర్వాత కొద్ది సేపటికే గుప్టిల్(13) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో 26 పరుగులకే కివీస్ ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. ఈ తరుణంలో కేన్ విలియమ్సన్, రాస్ టేలర్ జోడీ ఇన్నింగ్స్ మరమ్మతులు చేపట్టింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 33 పరుగులు జోడించాక విలియమ్సన్(28)పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వాత టేలర్, లాథమ్ జోడీ స్కోరుబోర్డును చక్కదిద్దింది. వీరిద్దరూ సమయోచితంగా ఆడుతూ అడపాదడపా బౌండరీలతో స్కోరుబోర్డును





పరుగులు పెట్టించారు. నాలుగో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించడంతో కివీస్ తేరుకొంది. ఈ క్రమంలో టేకమంలో ముందుగా అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. లాథమ్ కూడా హాఫ్ సెంచరీ చేశాడు. తర్వాత పరుగుల వేగాన్ని పెంచే క్రమంలో లాథమ్ అవుటయ్యాడు. కాస్సేపటికి హెన్రీ నికోలస్, సాంత్నార్‌లు కూడా అవుటయ్యారు. దీంతో కివీస్20 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయింది. ఓ వైపు వికెట్లు పడుతూ ఉన్నప్పటికీ రాస్ టేలర్ స్కోరును పెంచే ప్రయత్నం చేశాడు. ఇదే క్రమంలో సెంచరీకి 7 పరుగుల దూరంలో ఉండగా షమీ బౌలింగ్‌లో దినేశ్ కార్తీక్ క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు. అనంతరం కివీస్ ఆటగాళ్లు క్యూ కట్టడంతో 49 ఓవర్లలోనే 243 పరుగులకూ ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో షమీ 3 వికెట్లు సాధించగా, హార్దిక్ పాండ్యా, చాహల్, భువనేశ్వర్ కుమార్‌లు తలా రెండేసి వికెట్లు సాధించారు. ఇరు జట్ల మధ్య నాలుగో వన్‌డే గురువారం జరగనుంది. కాగా చివరి రెండు వన్‌డేలకు కోహ్లీకి సెలెక్టర్లు విశ్రాంతి ఇవ్వడంతో జట్టుకు రోహిత్ శర్మ నాయకత్వం వహిస్తాడు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: మార్టిన్ గుప్టిల్ సి దినేశ్ కార్తిక్ బి మహమ్మద్ షమీ 13, కాలిన్ మున్రో సి రోహిత్ శర్మ బి షమీ 7, కేన్ విలియమ్సన్ సి పాండ్యా, బి చాహల్ 28, రాస్ టేలర్ సి కార్తిక్, బి షమీ 93, టామ్ లాథమ్ సి రాయుడు బి చాహల్ 51, హెన్రీ నికోల్స్ సి కార్తిక్ బి పాండ్య 6, సాంత్నర్ సి కార్తిక్ బి పాండ్య 3, బ్రేస్‌వెల్ రనౌట్ 15, సోధి సి కోహ్లీ, బి షమీ12, ట్రెంట్ బౌల్ట్ సి షమీ బి భువనేశ్వర్ కుమార్ 2, లాకీ ఫెర్గ్యూసన్ నాటవుట్ 2,ఎక్స్‌ట్రాలు 11, మొత్త అలౌట్(49 ఓవర్లలో) 243.
వికెట్ల పతనం: 1–10,2–26, 3– 59,4 –178 5– 191, 6– 198,7 –222, 8– 239, 9– 239
భారత్ బౌలింగ్: భువనేశ్వర్ 10 –1 –46– 2, మహమ్మద్ షమీ 9– 0– 41– 3, పాండ్య 10– 0 –45– 2, చాహల్ 9– 0 –51– 2, కుల్దీప్ యాదవ్ 8– 0–39– 0, కేదార్ జాదవ్ 3– 0– 17– 0.
భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ స్టంప్డ్ లాథమ్ బి సాంత్నర్ 62, శిఖర్ ధావన్ సి రాస్ టేలర్ బి బౌల్ట్ 28, విరాట్ కోహ్లీ సి నికోల్స్ బి బౌల్ట్ 60, అంబటి రాయుడు నాటౌట్ 40, దినేశ్ కార్తిక్ నాటౌట్ 38, ఎక్స్‌ట్రాలు 17, మొత్తం (43 ఓవర్లలో 3 వికెట్లకు) 245.
వికెట్ల పతనం: 1 –39, 2– 152, 3– 168.
న్యూజిలాండ్ బౌలింగ్: బౌల్ట్ 10 –1– 40– 2, బ్రేస్‌వెల్ 6– 0– 49– 0, ఫెర్గ్యూసన్ 10 –1– 57– 0, సాంత్నర్ 10– 0– 45 –1, సోధి 7– 0 –53– 0.



పడిలేచిన కెరటం జకోవిచ్

మన తెలంగాణ/క్రీడా విభాగం: ప్రపంచ టెన్నిస్‌లో సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ తనదైన ముద్ర వేశాడు. రెండేళ్ల క్రితం అతని కెరీర్ దాదాపు ముగిసిపోయిందనే అందరూ భావించారు. వరుస గాయాలతో అతను కనుమరుగు కావడం తథ్యమనే వార్తలు సర్వత్రా వినిపించాయి. ఒక దశలో జకోవిచ్ కూడా ఈ వార్తలతో ఏకీభవించాడు. ఒకప్పుడూ ప్రపంచ టెన్నిస్ శాసించిన జకోవిచ్ కెరీర్‌లో 2017 పెను విషాదమే నింపింది. వరుస గాయాలు ఓవైపు, వైఫల్యాలు మరోవైపు జకోవిచ్‌ను వెంటాడాయి. దీంతో అతని కెరీర్‌పై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. గతంలో టెన్నిస్ దిగ్గజాలు రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), రఫెల్ నాదల్ (స్పెయిన్)లు కూడా ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొని మళ్లీ గాడిలో పడ్డారు. అయితే జకోవిచ్‌కు వీరిలా మళ్లీ మునుపటి ఫామ్‌ను అందుకోవడం దాదాపు అసాధ్యమని చాలా మంది జోస్యం చెప్పారు.

మొక్కవోని ఆత్మవిశ్వాసంతో..

అయితే ఎవరూ ఎన్ని విమర్శలు చేసినా జకోవిచ్ మాత్రం ధైర్యాన్ని వీడలేదు. 2018 ఏడాది ప్రారంభంలో ర్యాంకింగ్స్‌లో ఎక్కడో ఉన్న జకోవిచ్ ఏడాది చివరి నాటికి టాప్–3లో చోటు సంపాదించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఇదే క్రమంలో తన ఖాతాలో రెండు గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌ను సయితం జమ చేసుకున్నాడు. 2018లో జరిగిన వింబుల్డన్, యూఎస్ ఓపెన్ టోర్నీల్లో జకోవిచ్ ట్రోఫీలను సాధించాడు. అప్పటి వరకు పురుషుల టెన్నిస్‌లో ఏకచక్రాధిపత్యం చెలాయించిన ఫెదరర్, నాదల్‌కు చెక్ పెట్టాడు. అంతేగాక తనను తక్కువ చేసి చూసిన వారికి ఆటతోనే దిమ్మతిరిగే సమాధానం చెప్పాడు.



జకోవిచ్ సమకాలీకుడిగా పేరు తెచ్చుకున్న ఆండీ ముర్రే (బ్రిటన్) కూడా ఇలాంటి పరిస్థితి ఎదుర్కొన్నాడు. ప్రపంచ పురుషుల ర్యాంకింగ్స్‌లో నంబర్‌వగా నిలిచిన ముర్రేను కూడా గాయాలు వెంటాడాయి. అయితే ముర్రే మాత్రం గాయాలను జయించలేక పోయాడు. తాజాగా ఆస్ట్రేలియా ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. అంతేగాక అందరిని విస్మయానికి గురి చేస్తూ రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. కానీ, జకోవిచ్ మాత్రం ఏ దశలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. వరుస టైటిల్స్‌తో మళ్లీ పూర్వ వైభవం సాధించి దిగ్గజాలు నాదల్, ఫెదరర్‌లకు తానేమి తీసిపోనని నిరూపించాడు. ఇప్పటికే తన ఖాతాలో 15 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ జమ చేసుకున్న జకోవిచ్ రానున్న రోజుల్లో మరెన్నో టైటిల్స్ సాధించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే జరిగితే పురుషుల టెన్నిస్‌లో అత్యధిక టైటిల్స్ గెలుచుకున్న ఆటగాడిగా జకోవిచ్ చరిత్ర సృష్టించడం ఖాయంగా చెప్పొచ్చు.

అతని ఆట తీరు అద్భుతం

ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడు

పాండ్యపై కోహ్లీ ప్రశంసల వర్షం

మౌంట్ మాంగనీ: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్‌డేలో 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన కోహ్లీ సేన మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకున్న విరుఘం తెలిసిందే. మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన కోహ్లీ... ఇది జట్టు సభ్యుల సమష్టి విజయమని కొనియాడాడు. ఈ క్రమంలో సస్పెన్షన్ అనంతరం మూడో వన్‌డే ద్వారా రీ ఎంట్రీ ఇచ్చినఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యపై ప్రశంసల వర్షం కురిపించాడు.' హార్దిక్ రాకతో జట్టులో సమతౌల్యం ఏర్పడింది. అతను తలదించుకునే ఉన్నాడు, కానీ జట్టుకు కావలసిందేమిటో అతనికి తెలుసు. అందుకే ఆటపై దృష్టిపెట్టాడు. తన బాధ్యతను నెరవేర్చాడు. ఈ రోజు అతని ఆట తీరు అద్భుతం. అతని రాక సంతోషాన్ని ఇచ్చింది' అని అన్నాడు. ఒక టీవీ షోలో మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్న పాండ్య మౌంట్ మాంగనీలో జరిగిన మ్యాచ్‌లో రీ ఎంట్రీ ఇచ్చాడు. రెండు వికెట్లు సాధించడంతో పాటుగా అద్భుతమైన క్యాచ్‌తో కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌ను పెవిలియన్‌కు పంపి తన రీ ఎంట్రీని ఘనంగా చాటుకున్నాడు. కాగా, తాజా వివాదం పాండ్య సరికొత్త శిఖరాలు అధిరోహించడానికి తోడ్పడుతుందన్న ఆశాభావాన్ని కోహ్లీ వ్యక్తం చేశాడు.



ఇలాంటి పరిస్థితులో ఎవరైనా అదనంగా ఏమీ చేయాల్సిన అవసరం లేదు. అలాంటి వివాదంనుంచి సానుకూలంగా ఎవరు బైటపడినా అతని కెరీర్ ఉన్నత శిఖరాలకు చేరుకుంటుంది. ఇంతకు ముందు మనం అలాంటి ఎంతో మంది క్రికెటర్లను చేశాం' అని కోహ్లీ అన్నాడు. అతను సరయిన మార్గంలో ముందుకు సాగి మెరుగైన క్రికెటర్‌గా ఎదుగుతాడని తాను ఆశిస్తున్నానని, అతను ఆ పని చేయగలడని తాను అనుకుంటున్నాని కూడా కోహ్లీ అన్నాడు. కాగా, శుభమన్ గిల్, విజయ్ శంకర్ లాంటి యువ ఆటగాళ్లు జట్టులోకి రావడం సంతోషంగా ఉందని కోహ్లీ అన్నాడు.' శుభమన్ ప్రతిభావంతుడైన ఆటగాడు. నెట్స్‌లో అతను ప్రాక్టీస్ చేసే తీరు అద్భుతం. నేను అతని వయసులో ఉన్నప్పుడు అతనిలో పదో వంతు కూడా ఆడలేదు' అంటూ ప్రశంసలు కురిపించాడు.

హాయిగా రెస్ట్ తీసుకుంటా

కివీస్‌తో సిరీస్ గెలుచున్నందున హాయిగా రెస్ట్ తీసుకుంటానని కోహ్లీ చెప్పాడు.' చివరి రెండు వన్‌డేలలోను విజయం సాధిస్తాం. చాలా రోజులుగా బ్రేక్ తీసుకోలేదు. ఆస్ట్రేలియా సర్యటనలతో ఊపిరి సలపకుండా ఉన్నాం. అందుకే విరామం తీసుకుంటున్నాను. కివీస్‌తో వన్‌డే సిరీస్‌ను 3 –0తో గెలుచుకున్నాం కాబట్టి సంతోషంగా బ్రేక్ తీసుకుంటా. విరామ సమయాన్ని బాగా ఎంజాయ్ చేస్తా. ఎవరో ఒకరు మన స్థానాన్ని భర్తీ చేస్తారు. మనం లేకున్నా ఆట కొనసాగుతుంది' అని కోహ్లీ అన్నాడు. సెలెక్టర్లు విశ్రాంతి కల్పించడంతో చివరి రెండు వన్‌డేలకు కోహ్లీ అందుబాటులో ఉండడం లేదు. కోహ్లీ స్థానంలో భారత జట్టుకు రోహిత్ శర్మ సారథ్యం వహించనున్నాడు.

పుజారా అజేయ సెంచరీ

రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర

బెంగళూరు: టీమిండియా బ్యాట్స్‌మన్ చటేశ్వర పుజారా పరుగుల యాత్ర అప్రతిహతంగా సాగుతోంది. టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుతంగా రాణించిన ఈ'రన్ మెషీన్' అజేయ సెంచరీతో సౌరాష్ట్ర రంజీట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజయిన సోమవారం నాడు సౌరాష్ట్ర కర్నాటకపై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. జైపూర్‌లో ఫిబ్రవరి 3నుంచి 7 వరకు జరిగేఫైనల్లో సౌరాష్ట్ర డిఫెండింగ్ చాంపియన్ విదర్భను ఢీకొంటుంది. సౌరాష్ట్ర రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరడం ఇది మూడో సారి. చివరి రోజు విజయానికి 55 పరుగులు చేయాల్సిన స్థితిలో ఆట ప్రారంభించిన సౌరాష్ట్రకు అది లాంఛనంగా మిగిలింది. మూడో రోజు ఆట ముగిసే వేళకు నాటౌట్‌గా నిలిచిన పుజారా 131 పరుగులతో నాటవుట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించగా, మరో నాటౌట్ బ్యాట్స్‌మన్ షెల్డన్ జాన్సన్ కూడా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ వెంటనే అతను అవుటయ్యాడు. అయితే అప్పటికే మ్యాచ్ ఫలితం నిర్ధారణ అయిపోయింది.సంక్షిప్త స్కోర్లు: కర్నాటక తొలి ఇన్నింగ్స్ 275, రెండో ఇన్నింగ్స్ 239, సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ 236. రెండో ఇన్నింగ్స్ 5 వికెట్ల నష్టానికి 279.



సికింద్రాబాద్ మనో వికాస్ నగర్‌లోని జాతీయ దివ్యాంగుల సాధికార సంస్థ (ఎన్ఐఎఇపిడి)లో సోమవారం జరిగిన 35వ క్రీడోత్సవంలో పాల్గొన్న టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా, కేంద్ర దివ్యాంగుల శాఖ కార్యదర్శి డాలీ చక్రవర్తి

నెహ్రూ భవన్‌గా పిలిచే లక్నోలోని కాంగ్రెస్ కార్యాలయం పూర్తి హంగులతో సిద్ధం అవుతోంది. త్వరలో తుది రూపు ఇవ్వనున్నారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ పర్యటన నేపథ్యంలో వాటికి మెరుగులు దిద్దుతున్నారు. ఇక్కడి కార్యాలయం నుంచే ఆమె రాజకీయ వ్యవహారాలు పరిశీలిస్తారని సమాచారం. తూర్పు యుపి బాధ్యతలను పర్యవేక్షించనున్న ఆమెకు ఇందిరాగాంధీ ఉపయోగించిన గదినే కేటాయించడం విశేషం.

విశాల

పేదలకు కనీస ఆదాయ పథకం

రైతుల సభలో రాహుల్ వాగ్దానం

రాయ్‌పూర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు కనీస ఆదాయం భద్రత కల్పిస్తామని పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ చెప్పారు. సోమవారం ఆయన ఛత్తీస్‌గఢ్‌లో రైతుల సభలో మాట్లాడారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే పేదలకు మేలు జరుగుతుందని ప్రకటించారు. తాము అధికారం చేపట్టగానే దేశంలోని పేదలకు కనీస ఆదాయ వనరులు కల్పిస్తామని అన్నారు. రైతాంగానికి రుణాల మంజూరీలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనుచితంగా ఉందని రాహుల్ ధ్వజమెత్తారు. రైతాంగానికి రుణాలు ఇవ్వడం సరి అయిన చర్య కాదని ప్రధాని మోడీ ఏ ప్రాతిపదికన చెపుతారని ప్రశ్నించారు. వ్యవసాయిక దేశంలో రైతాంగ సంక్షేమం కేంద్రానికి పట్టదా? అని నిలదీశారు. రైతుల రుణాల మాఫీకి కేంద్రం వద్ద కానీ మోడీ వద్ద కానీ నిధులు లేవు. ఆర్థిక ఇబ్బందులున్నాయని చెపుతున్నారని, మరి కొందరు పారిశ్రామికవేత్తలకు దండిగా రుణాలు ఏ విధంగా ఇస్తున్నారని ప్రశ్నించారు. 1960లో దేశంలో హరిత విప్లవం గురించి రాహుల్ ప్రస్తావించారు. తమ పార్టీ గతంలో పలు చారిత్రక పనులు చేసిందని, ఇక ముందు కూడా ఇదే పంథాలో వెళ్లుతుందని అన్నారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం చేపడితే పేదలకు కనీస ఆదాయం వచ్చేలా చేస్తామని ఇది దేశ చరిత్రలో మైలురాయిగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో



హరిత విప్లవానికి బీజం వేసింది. ఆహార భద్రతకు పాటు పడింది. క్షీర విప్లవం తీసుకువచ్చింది. తరువాతి దశలో టెలికాం విప్లవం దూసుకువచ్చిందని రాహుల్ గుర్తు చేశారు. ఇవన్నీ కూడా దేశానికి గర్వకారణంగా మారాయని చెప్పారు. పేదల సంక్షేమానికి తాము ప్రాధాన్యతను ఇస్తామని, వారికి సరైన ఆధారం దక్కేందుకు కీలక చర్యలు తీసుకుంటామని అన్నారు. చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ ఇంతకు ముందటి వరకూ ప్రతిపక్షంగా ఉంది. రైతాంగం గడ్డు స్థితి గురించి ప్రశ్నించాం. రైతుల రుణాలను మాఫీ చేయాలని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీశామని అయితే డబ్బులు లేవని చెప్పారని గుర్తు చేశారు. ఇదే విధంగా రాజస్థాన్‌లో, మధ్యప్రదేశ్‌లో కూడా అప్పటి బిజెపి ప్రభుత్వాల ముందు రుణమాఫీ అంశాన్ని తీసుకువెళ్లాం. అక్కడ కూడా నిధులు లేవనే జవాబు వచ్చింది. ఇక వీరి ధోరణి ఈ విధంగా ఉంటే కేంద్రంలో మోడీ కూడా వ్యవసాయ పంట రుణాల మాఫీకి డబ్బులు లేవని అన్నారని రాహుల్ గుర్తు చేశారు. అయితే ఇదే సమయంలో 15 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలకు కావల్సినంతగా నిబంధనలకు అతీతంగా రుణాలు ఇవ్వడం జరిగింది. ఇది దోపిడి కాదా? అని ప్రశ్నించారు. అనిల్ అంబానీకి రూ. 30,000 కోట్లు ఇవ్వడానికి ప్రధానికి వీలుంటుంది. అయితే రైతాంగానికి రూ.6000కోట్ల రుణమాఫీకి డబ్బులు సమకూరలేదా? ఇదేం జంతర్‌మంతర్ అని ప్రశ్నించారు. మూడు బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎన్నికలకు వెళ్లినప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా రైతుల రుణమాఫీనే ప్రధానంగా ప్రస్తావించిందని రాహుల్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పది రోజులలో రుణాలను మాఫీ చేస్తామని వాగ్దానం చేశామని, దీనిని అంతకు ముందే నిలబెట్టుకోవడం జరిగిందని, బిజెపి చేయలేనిది కాంగ్రెస్ గంటల వ్యవధిలో చేసి చూపించిందన్నారు.

గోవా రెస్టారెంట్‌లో రాహుల్ సెల్ఫీలు



పనాజీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదివారం తన తల్లి సోనియా గాంధీతో కలసి దక్షిణ గోవాలోని ప్రముఖ రెస్టారెంట్ ఫిషర్ మ్యాన్స్ వార్ఫ్‌ను సందర్శించి, అక్కడ కస్టమర్లను, రెస్టారెంట్ సిబ్బందిని ఆశ్చర్యపరిచారు. నీలం రంగు టీషర్ట్ ధరించిన రాహుల్ ఆ సీఫుడ్‌లో నిరాడబరంమైన లంచ్ చేయడమే కాదు అక్కడే ఉన్న కస్టమర్లతో ఫోటోలు, సెల్ఫీలు కూడా తీసుకున్నారు. అదే రెస్టారెంట్‌లో లంచ్ తీసుకుంటున్న గోవాకు చెందిన డెంటిస్ట్ రచనా ఫెర్నాండెజ్ రాహుల్‌తో తాను తీసుకున్న సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "ఈ పరమ చెత్త రాజకీయాలలో రాహుల్ ఎంతో మంచివ్యక్తిగా కనపడుతున్నారు" అంటూ కూడా ఆమె కితాబిచ్చారు. పార్లమెంట్ సమావేశాలు ముగియడంతో మూడు రోజుల "వ్యక్తిగత పర్యటన"పై తల్లితో కలసి గోవాకు వచ్చిన రాహుల్ దక్షిణ గోవాలోని ఐదు నక్షత్రాల రిసార్ట్‌లో బసచేశారు.

భారతరత్నకు సన్యాసులు పనికిరారా?



ప్రయాగ్‌రాజ్ : దేశంలోని హిందూ సన్యాసులకు భారత రత్న ఇవ్వకపోవడంపై యోగా గురు బాబా రాందేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నాడిక్కడ ఒక ఇంగ్లీష్ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ, "గడచిన 70 ఏళ్లలో ఒక్క హిందూ సన్యాసి(సాధువు)కి భారతరత్న అవార్డు ఇవ్వకపోవడం దురదృష్టకరం. మహర్షి దయానంద సరస్వతి, స్వామి వివేకానంద, శివకుమార స్వామీజీ ఇలా ఏ స్వామీజీకి భారతరత్న ఇవ్వలేదు. దేశానికి ఎంతో సేవ చేసిన ఇలాంటి మహానుభావులకు భారతరత్న ఇవ్వాల్సిందే" అంటూ రాందేవ్ డిమాండు చేశారు. మహర్షి దయానంద సరస్వతి కాని, స్వామి వివేకానంద కాని చేసిన కృషి ఏ రాజకీయ నాయకుడికి తీసిపోదని ఆయన వ్యాఖ్యానించారు. క్రిస్టియన్ అయినందున మదర్ థెరిసాకు భారతరత్న ఇచ్చారని, కాని హిందువులు కాబట్టి సాధువులకు ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు.

ఎంతమంది దళితులకు భారతరత్న ఇచ్చారు



ముంబై: ఒక్క సన్యాసికి కూడా భారతరత్న ఎందుకు ఇవ్వలేదని యోగా గురు బాబా రాందేవ్ ప్రశ్నించి భారతరత్న అవార్డుల ఎంపికపై కేంద్ర ప్రభుత్వ విధానంపై వివాదాన్ని రాజేయగా ఎఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మరో అడుగు ముందుకేసి దళితులు, ముస్లిములు, పేదలు, గిరిజనులలో ఎందరికి భారతరత్న ఇచ్చారంటూ అగ్గి రగిల్చారు. ఆదివారం నాడిక్కడ ఒక కార్యక్రమంలో పాల్గొన్న అసదుద్దీన్ మాట్లాడుతూ "ఇప్పటివరకు భారతరత్న పురస్కారాలకు ఎంపికైన వారిలో దళితులు, గిరిజనులు, ముస్లిములు, నిరుపేదలు, అగ్రవర్ణాల వారు, బ్రాహ్మణులు ఎందరున్నారో నాకు చెప్పండి. బాబాసాహెబ్(భీమ్‌రావు అంబేద్కర్)కు ఈ అవార్డు ఇచ్చారు కాని మనస్ఫూర్తిగా కాదు" అంటూ వ్యాఖ్యానించారు.

మోడీ మార్ఫింగ్ ఫోటో పెట్టినందుకు అరెస్ట్

చెన్నై: ప్రధాని నరేంద్ర మోడీని బిచ్చగాడిగా చిత్రీకరిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టిన ఎండిఎంకె నాయకుడు సత్యరాజ్ బాలును తమిళనాడు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బిజెపి తమిళనాడు శాఖ ఇచ్చిన ఫిర్యాదును పురస్కరించుకుని బాలును పోలీసులు అరెస్టు చేశారు. చేతిలో భిక్షాపాత్ర పెట్టుకున్న ప్రధాని మోడీ ఫోటోను ఎండిఎంకె నాయకుడు సత్యరాజ్ బాలు పోస్టు చేయడాన్ని బిజెపి తీవ్రంగా తప్పుపట్టింది. ప్రధాని పట్ల ద్వేషభావాన్ని రెచ్చగొట్టడానికే ఈ పోస్టు పెట్టారంటూ బిజెపి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐపిసిలోని 504, 505(2) సెక్షన్ల కింద బాలుకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓట్ల కోసం హేమమాలినితో నాట్యం

బిజెపిపై నోరు పారేసుకున్న కాంగ్రెస్ మంత్రి

భోపాల్: ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ వాద్రా నియామకం జరిగిన నాటి నుంచి బిజెపి, కాంగ్రెస్ మధ్య మాటల పోరు తీవ్ర రూపం దాల్చింది. ప్రియాంక గాంధీ అందగత్తే కాని ఆమె రాజకీయంగా సాధించింది ఏమీ లేదంటూ బీహార్‌కు చెందిన బిజెపి మంత్రి వినోద్ నారాయణ్ ఝా చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. కాగా, మధ్యప్రదేశ్‌కు చెందిన సజ్జన్ సింగ్ వర్మ సోమవారం ఝా చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ ప్రియాంక గాంధీ వంటి అందమైన ముఖం బిజెపికి లేకపోవడం దురదృష్టకరమంటూ వ్యాఖ్యానించారు. ఆయన మరో అడుగు ముందుకేసి బిజెపి ఎంపి, అలనాటి బాలీవుడ్ డ్రీమ్‌గర్ల్ హేమమాలిని వోట్ల కోసం బిజెపి నాట్యం చేయిస్తోందంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు.

మాట తప్పితే ప్రజలే చితగ్గొడుతారు

ముంబయి : వాగ్దానాలతో ప్రజలను నమ్మించి మోసం చేసే నాయకులను అదే ప్రజలు చితకిబాదుతారని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. ఆదివారం నాడిక్కడ ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తాను చెప్పింది చేసే వ్యక్తినని, చేసిన వాగ్దానానికి కట్టుబడి ఉంటానని చెప్పుకొచ్చారు. "తమను కలల లోకంలో విహరింపచేసే నాయకులను ప్రజలు కూడా ఇష్టపడతారు. అయితే ఈ కలలు నెరవేరకపోతే మాత్రం అదే ప్రజలు వారిని చితకబాదుతారు(రాజకీయంగా)" అంటూ గడ్కరీ వ్యాఖ్యానించారు. అయితే తాను అలాంటి వ్యక్తిని కానని, తాను చేసిన హామీలను వందశాతం నెరవేరుస్తానని ఆయన తెలిపారు. తాను గతంలో(199599) రాష్ట్రంలో శివసేనబిజెపి ప్రభుత్వ హయాంలో పిడబ్ల్యూడి మంత్రిగా పనిచేసిన రోజులను గుర్తు చేసుకుంటూ, ముంబైలో 50 ఫ్లైఓవర్‌లను నిర్మిస్తానని తాను ప్రతిపాదించినపుడు అందరూ నవ్వుకున్నారని ఆయన చెప్పారు. 91 కిమీ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా ముంబై–పుణె మధ్య ప్రయాణాన్ని రెండు గంటలకు తగ్గిస్తానని తాను అప్పట్లో చెప్పానని, తాను వాగ్దానం చేసిన ప్రతి ప్రాజెక్టును పూర్తి చేశానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్ మంత్రి గడ్కరీ సమక్షంలో బిజెపిలో చేరగా ఆమెను పార్టీ మహిళా రవాణా విభాగం అధ్యక్షురాలిగా ఆయన నియమించారు.



పనాజీలో సోమవారంనాడు మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి గడ్కరీతో కలిసి పాల్గొన్న గోవా సిఎం పారికర్

దిగిపోవడానికి నేను రెడీ

- కాంగ్రెస్ ఎంఎల్‌ఎలను నాయకత్వం కట్టడి చేయాలి
- కర్నాటక సిఎం కుమారస్వామి ఘాటైన హెచ్చరిక

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి మొట్టమొదటిసారి ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షమైన కాంగ్రెస్‌కు ప్రత్యక్ష హెచ్చరికలు జారీచేశారు. కాంగ్రెస్ నాయకత్వం తన ఎంఎల్‌ఎలను కట్టడి చేయకపోతే ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానంటూ కుమారస్వామి సోమవారం హెచ్చరించారు. ఇక్కడి మంత్రి స్క్వేర్‌లో గ్రీన్ లైన్ మెట్రో స్టేషన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన మీడియాతో చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. తనకు ఇప్పటకి సిద్ధరామయ్యే ముఖ్యమంత్రి అంటూ రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రి, కాంగ్రెస్ నాయకుడైన సి పుట్టరంగ, మరో ఎంఎల్‌ఎ ఎస్‌టి సోమశేఖర్ ఆదివారంనాడు మీడియాతో మాట్లాడుతూ సిద్ధరామయ్యను వెంటనే సిఎం చేయాలని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కుమారస్వామి ఈ హెచ్చరిక చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ లక్ష్మణ రేఖను దాటుతున్నారని, తమ ఎంఎల్‌ఎలను కట్టడి చేయవలసిన బాధ్యత కాంగ్రెస్ నాయకులదేనని ఆయన అన్నారు. ఒకవేళ నా పనితీరు నచ్చకపోతే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఇలాంటి బాధ్యత నాకేమీ వద్దని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలే కొనసాగించదలచుకుంటే తాను పదవి నుంచి తప్పుకుంటానని ఆయన తెలిపారు. తన ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతోందని, అభివృద్ధి జరగడం లేదని మాట్లాడడం అర్థరహితం అని కుమారస్వామి పేర్కొన్నారు. అదే సమయంలో సిఎం పక్కనే ఉన్న పిసిసి అధ్యక్షుడు గుండూరావు కొంత ఇబ్బందికి గురయ్యారు. కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు ఎవరూ భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు.



అలాంటి ప్రకటనలు చేసిన వారికి షోకాజ్ నోటీసులు పంపుతామని హెచ్చరించారు. సిద్ధరామయ్య వర్గానికి చెందిన ఇతర ఎంఎల్‌ఎలు కూడా ఆదివారం ముఖ్యమంత్రి కుమారస్వామిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఇప్పటి వరకు అభివృద్ధి పనులు ఏవీ జరగలేదని వారు విమర్శించారు.

బిజెపితో పొత్తు నిర్ణయం ఉద్ధవ్‌దే

ముంబయి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపితో పొత్తుపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని శివసేన ఎంపిలు పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరేకు కట్టబెట్టారు. సోమవారం థాకరే నివాసంలో జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహారాష్ట్రలో ప్రజల పక్షాన తమ పార్టీ పోరాడుతుందని, బిజెపితో పొత్తుపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని పార్టీ ఎంపీలు అధ్యక్షుడికి కట్టబెట్టారని సమావేశానంతరం శివసేన ప్రతినిధి సంజయ్ రౌత్ వెల్లడించారు. మహారాష్ట్రలో బిజెపి, శివసేన సమాన సంఖ్యలో పోటీ చేస్తాయనే వార్తలపై ఆయన స్పందిస్తూ తమకు ఇలాంటి సమాచారం లేదని, ఈ తరహా సీట్ల సర్దుబాటును తాము అంగీకరించమని ఆయన స్పష్టం చేశారు. మహారాష్ట్రలో తమ పార్టీ పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. పార్టీ ఎంపిల సమావేశంలో తాము రాఫెల్ ఒప్పందంతో పాటు మహారాష్ట్రలోని కరువు పరిస్థితిపైనా చర్చించామని చెప్పుకొచ్చారు.

పైలట్ పొగతాగడం వల్లే ప్రమాదం



ఖాట్మండూ: కాక్‌పిట్‌లో విమానం నడుపుతున్న పైలట్ సిగరెట్ కాల్చడం వల్ల ఆ విమానం ప్రమాదానికి గురై 51 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గత ఏడాది మార్చిలో నేపాల్‌లో చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దర్యాప్తు అనంతరం ప్రమాదానికి గల కారణాలు తాజాగా వెల్లడయ్యాయి. కాక్‌పిట్‌లో పొగ తాగడం వల్లే ప్రమాదం జరిగిందని అధికారులు విచారణలో తేల్చారు. యూఎస్ బంగ్లా విమానయాన సంస్థకు చెందిన బంబార్డియర్ యూబీజీ211 విమానాన్ని గత ఏడాది మార్చి 12న నేపాల్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగి విమానంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు సిబ్బంది సహా 51 మంది చనిపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో మొత్తం 67మంది ఉన్నారు.

30న మాంసం దుకాణాలు బంద్

హైదరాబాద్ : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 30వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మాంసం దుకాణాలు, కబేళాలను మూసివేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఎం. దానకిషోర్ ఆదేశించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే సహకరించాలని మాంసం దుకాణాల నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మహిళపై సిద్ధరామయ్య చిర్రుబుర్రు

- కుమారుడిపై ఫిర్యాదు చేస్తుండడంతో ఆగ్రహం
- చేతులోని మైకు లాగడంతో చేతిలోకి వచ్చిన చున్నీ
- అభినవ దుశ్శాసనుడు : బిజెపి ఫైర్





మైసూరు : ఒక మహిళ నుంచి మైక్ లాక్కునే ప్రయత్నంలో ఆమె దుపట్టాను(చున్నీ) లాగి కర్నాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివాదంలో చిక్కుకున్నారు. ఈ సంఘటన సోమవారం మైసూరులో జరిగింది. ఒక సభలో పాల్గొన్న సిద్ధరామయ్య వద్దకు ఒక మహిళ వచ్చి ఎంఎల్‌ఎ యతీంద్ర(సిద్ధరామయ్య కుమారుడు) తనకు అందుబాటులోకి రావడం లేదని ఫిర్యాదు చేసింది. అనుచరులు సమక్షంలో తన కుమారుడిపైనే ఫిర్యాదు చేయడంతో ఆగ్రహించిన సిద్ధరామయ్య ఆ మహిళ చేతిలో ఉన్న మైకును లాక్కునేందుకు ప్రయత్నించారు. అయితే, పొరపాటున మైకుతో పాటు ఆమె వేసుకున్న దుపట్టా(చున్నీ) కూడా చేతిలోకి రావడంతో ఆయన కంగుతిన్నారు. ఇదంతా వీడియోలోకి ఎక్కడంతో మండిపడిన మాజీ సిఎం ఆమెను అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయితే ఆ మహిళ ఏ మాత్రం బెదరకుండా ప్రశ్నల వర్షాన్ని కురిపిస్తుండడంతో ఇతరులు రంగ ప్రవేశం చేసి ఆమెను శాంతింప చేయవలసి వచ్చింది. ఒకదశలో సిద్ధరామయ్య అనుచరులు ఆయనను కూడా వారించడానికి ప్రయత్నించడంతో వారిపై కూడా అసహనం వ్యక్తం చేశారు. జమీలా అనే ఆ మహిళ ఓ గ్రామ నాయకురాలు, కాంగ్రెస్ కార్యకర్త అని తెలుస్తోంది. ఆమె మైసూరులో జరిగిన కార్యక్రమంలో సిద్ధరామయ్యను నిలదీశారు. సిద్ధరామయ్య కుమారుడు డాక్టర్ యతీంద్ర ఎంఎల్‌ఏ. యతీంద్ర ఎంఎల్‌ఏ అయిన తర్వాత తమకు అందుబాటులో ఉండటం లేదని జమీలా ఆరోపించడంతో సిద్ధరామయ్య తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కాగా, కర్నాటక బిజెపి ఈ సంఘటనను ప్రత్యర్థిపై విమర్శల దాడికి అనువుగా మలచుకుంది. సిద్ధరామయ్యను "కౌరవ సభలో అభినవ దుశ్శాసనుడి"గా అభివర్ణించింది. కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు ఒక్క కుటుంబానికి చెందిన మహిళలను మాత్రమే గౌరవిస్తారని గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి విమర్శించారు. దేశంలోని మిగతా మహిళలంటే వారికి చాలా చిన్నచూపని దుయ్యబట్టారు.

వెంటనే కేసు పెట్టండి

సిద్ధరామయ్య మహిళ పట్ల దురుసుగా వ్యవహరించడంపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. సమస్యలను విన్నవించడానికి వచ్చిన ఆమె పట్ల అలా ప్రవర్తించడమేంటని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కర్నాటక ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది.

తాలిబన్లతోనే శాంతి ఒప్పందం?

అమెరికా కొత్త ఫార్ములా



కాబూల్ : అఫ్ఘనిస్థాన్‌లో శాంతి సంవిధానంపై అమెరికా, తాలిబన్ల మధ్య సూత్రప్రాయ అంగీకారం కుదిరింది. అఫ్ఘనిస్థాన్‌లో శాంతి పరిరక్షణకు అమెరికానాయకత్వ సంకీర్ణ దళాలు తిష్టవేసుకుని ఉన్నాయి. ప్రధానమైన తాలిబన్లతో అమెరికా అధికార యంత్రాంగం కీలక ఒప్పందం కుదుర్చుకునేందుకు చేసిన యత్నాలు ఇప్పుడు ఫలించాయి. ఇరు పక్షాల మధ్య సోమవారం జరిగిన విస్తృత చర్చలలో కీలక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది. దీని మేరకు అఫ్ఘన్ భూ భాగ ప్రాంతాన్ని ఉగ్రవాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాడుకోకుండా తాలిబన్లు చూసుకోవల్సి ఉంటుంది. దేశం నుంచి అమెరికా సేనలు పూర్తి స్థాయిలో వైదొలిగేందుకు దీనితో వీలేర్పడుతుందని, ఈ క్రమంలోనే తాలిబన్లకు పలు రాయితీలు ఉపశమనలు కల్పించనున్నట్లు అమెరికాతరఫు దూత తెలిపారు. అయితే తాలిబన్లకు ఎటువంటి సౌలభ్యం కల్పించినా ముందుగా వారు కాల్పుల విరమణకు దిగాలి. అఫ్ఘన్ ప్రభుత్వంతో నేరుగా చర్చలకు ముందుకు రావాలి, చాలా కాలంగా ఉన్న తమ డిమాండ్లను వదులుకోవాలని అమెరికా ప్రతినిధి స్పష్టం చేశారు. రాజీ మార్గపు శాంతి సంవిధానంపై ఇప్పుడు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందని, దీనిపై త్వరలోనే ముసాయిదా రూపొందుతుందని, తరువాత ఇది పూర్తి స్థాయి ఒప్పందం అవుతుందని అమెరికా దూత జైమే ఖలిల్జద్ తెలిపారు. తమ షరతులకు తాలిబన్లు బాగానే అంగీకరించారని వివరించారు. అఫ్ఘనిస్థాన్‌ను ఉగ్రవాదుల వేదిక కాకుండా చేసేందుకు అవసరం అయిన చర్యలు తీసుకోవల్సిందేనన్నారు. హింసను వీడి తాలిబన్లే హింసాత్మక శక్తులను దేశంలోకి రాకుండా చేసేందుకు అంగీకరించడం కీలకమేనని తెలిపారు. దేశంలో ఉగ్రవాదుల ఏరివేతకు ముందు బయటి నుంచి వారి చేరికను అరికట్టాల్సి ఉందని చెప్పారు. ఈ కీలక ఒప్పందం వివరాలు రూపొందించాల్సి ఉందని తెలిపారు. అయితే ఈ ఒప్పందాన్ని సూత్రప్రాయంగా తాలిబన్లు అంగీకరించినట్లు చెపుతున్నప్పటికీ దీనిపై పూర్తి స్పష్టత రాలేదని వెల్లడైంది. భేటీకి వచ్చిన తాలిబన్ల ప్రతినిధి బృందం చివరికి ప్రతిపాదనలను తమ నాయకత్వానికి తెలియచేయాల్సి ఉందని చెప్పినట్లు అమెరికా అధికారి మరొకరు తెలిపారు. అఫ్ఘన్ ప్రభుత్వంతో నేరుగా చర్చలు , కాల్పుల విరమణ వంటివి కీలకమైనవని భావిస్తున్నారు. అయితే సూత్రప్రాయంగా అంగీకారం కుదరడం తొమ్మిదేళ్ల పలు దఫాల పొసగని చర్చల తొలి ముందడుగు అని వివరించారు. తాలిబన్లు ఖచ్చితంగా ఒప్పందానికి ముందుకు వస్తారా? ఈ ప్యాకేజీ కూడా రష్యా సంబంధిత వలయంలో చిక్కుకుంటుందా? తెలియదని అమెరికా అధికారి తెలిపారు. పలు ఉగ్రవాద సంస్థలు వేరు వేరు ప్రాంతాలలో పనిచేస్తూ వస్తున్నాయని, వీటిని అన్నింటినీ అదుపులో పెట్టడం తాలిబన్లకు చేతనవుతుందా? అసలు దీనికి పూర్తి స్థాయి అంగీకారం దక్కుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

మద్యనిషేధం కోసం మహిళల 200 కి.మీ యాత్ర

బెంగళూరు: కర్నాటకలో సంపూర్ణ మద్య నిషేధాన్ని కోరుతూ సుమారు 2,500 మంది మహిళలు 200 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. మాండ్య, మైసూరు, రామనగర, చామరాజనగర, తుమకూరుకు చెంది న ఈ మహిళలంతా ఆదివారం తుమకూరు సమీపంలోని సిద్దగంగ మఠానికి చేరుకున్నారు. "బీరు వద్దు..నీరు కావాలి" అన్న నినాదంతో మద్య నిషేధ ఆందోళన ఆధ్వర్యంలో యాత్ర జనవరి 19న చిత్రదుర్గ నుంచి ప్రారంభమైంది. మార్గ మధ్యంలో తగిలే గ్రామాల ప్రజలకు మద్యం మహమ్మారి వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ ఈ మహిళా యాత్ర సాగుతోంది. బుధవారం రాష్ట్ర రాజధానికి చేరుకోనున్న ఈ యాత్ర విధాన సౌధ ముట్టడికి ప్రయత్నిస్తుంది.



Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666